సంపుటి_8 సంచిక—2

అపరాధ పరిశోధన

సచిత్ర డిటెక్టివ్ మాస పత్రిక

మేనేజింగ్ ఎడిటర్ :
శ్యామ దామోదర్ రెడ్డి

సెప్టెంబరు, 1969

ఇందులోని కధలు....

జి. వి. జి.
శ్రీ భగ[illegible]
కె. [illegible]రామ్
టె[illegible]నాథ్
[illegible] మోహ[illegible]
[illegible]దత్త
[illegible]గంధరశ్రీ

తొలిమాట

నమస్కారం. పాఠకుల కోరికను బట్టి చందాదారులకు ఇచ్చే బహుమతి పుస్తకాల స్కీమ్ గడువును మరో 3 నెలలకు పొడిగిస్తున్నాము. మరికొన్ని కొత్త పుస్తకాలు కూడా ఇందులో చేర్చబడ్డాయి. ఇకపైన చందాలుపంపే పాఠకులు తాము ఎన్నికచేసిన 15 నవలల పేర్లు తెలియజేస్తే, వాటిలో నుంచి 12 పుస్తకములు బహుమతిగా పంపగలము.

ఈ సంచికనుండి మీ అభిమాన రచయితల కథలకు ఎక్కువ ప్రాధాన్యత యిస్తున్నాము. వచ్చే సంచికలో—శ్రీ విజయ-బాపినీడు, జి.వి.జి., శ్రీభగవాన్, కె. శివరామ్, వి. ఎస్. చెన్నూరిగారల కథలు మీకు లభ్యమవుతాయి.

గుండెలు తీసిన బంట్లు, పచ్చినెత్తురు త్రాగే కసాయి వాళ్ళు, కొమ్ములు తిరిగిన మొనగాళ్ళుసైతం ఆ "మృత్యు మందిరం" లోకి అడుగుపెట్టడానికి జడుస్తారు. అందులోకి వెళ్ళినవాళ్ళేకాని, తిరిగి వచ్చిన వారెవరూ లేరు. ప్రసిద్ధ డిటెక్టివ్ రచయిత శ్రీభగవాన్‌గారి అపూర్వసృష్టి. డిటెక్టివ్ వర్సన్ పరిశోధన. వచ్చేసంచికనుండి ధారావాహికంగా వెలువడుతున్న యీ సీరియల్ నవలను తప్పక చదవండి.

యీ సంచికలో ప్రచురించిన 'వెంటాడిన నీడ' చక్కని కథ అని మా అభిప్రాయం. చదివి మీ అభిప్రాయం తెలుపుతారు కదూ!—

సెలవా మరి—

మీ

శ్యామ దామోదర్ రెడ్డి

శ్రీ భగవాన్

టెలిఫోన్ బెల్ ట్రింగ్...ట్రింగ్ మని మోగింది. ప్రఖ్యాత డిటెక్టివ్ నర్సన్ రిసీవర్ అందుకుని "యస్... ప్లీజ్..." అన్నాడు తాపీగా.

"నర్సన్ గారూ! 3906 నెంబర్ నించి మాట్లాడుతున్నాను. ప్రస్తుతం ఇంట్లో ఎవ్వరూ లేరు. ఒంటరిదాన్ని. నా కెందుకో భయంగా వుంది. వన్నెవరో చంపడానికి ప్రయత్నిస్తున్నారు. దయచేసి..." కంగారుగా చెబుతున్న కంఠస్వరం హఠాత్తుగా మధ్యలో ఆగిపోయింది.

నర్సన్ మొహం చిట్లిస్తూ "హాల్లో...హాల్లో...ఎవరు మాట్లాడుతున్నది? ఏం జరిగింది?" అని అడిగాడు. సమాధానంగా లైన్ డిస్కనెక్టు అయినట్లు క్లిక్ మన్న శబ్దం వినిపించింది. అతని భృకుటిముడిపడింది. ఎక్ఛేంజ్ కి నెంబర్ తిప్పి "హాల్లో! డిటెక్టివ్ నర్సన్ స్పీకింగ్! క్షణం క్రితం నాకు వచ్చిన ఫోన్ కాల్ ఏ నెంబర్ నించో అడ్రసుతో సహా చెప్పగలరా?" అని అడిగాడు—ఆమె చెప్పిన నెంబర్ నిజమైనదో? కాదో?

"జస్టు ఏ మినిట్ ప్లీజ్..." అని నిమిషం తర్వాత "త్రీ నైన్ జీరో సిక్స్ నించి ఫోన్ కాల్ కనెక్షన్ అయింది. అడ్రస్..." అని అడ్రసు చెప్పాడు ఆపరేటర్.

ఆ మేటర్ని నోట్ చేసుకుని, "థాంక్యూ..." అని రిసీవర్ పెట్టేశాడు నర్సన్. ఎవరో స్త్రీ ఫోన్ చేసి సహాయం కోరింది. ఉన్నట్టుండి మధ్యలోనే డిస్కనెక్టు చేసింది. ఎందుకని? ఆమె ఆపదలో వున్నట్లూ, చాలా భయపడుతున్నట్లు కంఠస్వరంలోని ఆదుర్దా, కంగారువల్ల స్పష్టమైంది. ఆమె వూహిస్తున్న ఆ ప్రమాదం అనుకోకుండానే ముంచుకొచ్చిందా?

క్షణంకూడా నిలవలేకపోయాడు నర్సన్. డ్రాయర్ తెరిచి రివాల్వర్ తీసుకుని లేచి, స్టాండ్ దగ్గరికెళ్ళి కోటు అందుకొని తొడుక్కుంటూ వాడావిడిగా బయలుదేరాడు. అర

నిమిషంలో పార్కింగ్‌లో వున్న కారు స్టీరింగ్ ముందు కూర్చొని స్టార్టు చేసాడు.

సరిగ్గా మధ్యాహ్నం నాలుగు నిమిషాల తర్వాత కారు ఓ చిన్న డాబా యింటిముందు ఆగింది. క్రిందికి దిగి శబ్దం కాకుండా డోర్ మూస్తూ ఓసారి నలువైపులా పరిశీలనగా చూశాడు నర్సన్. ఇంటిముందు నాలుగు గజాల ఆవరణవుంది. ముంగు భూరు టైల్స్ పరచారా. వెనక డాబాపైన ఒకే ఒక గది. బయటి పోల్నించి టెలిఫోన్ వైరు ఆ యింటి గదిలోకి కనె క్షన్ యివ్వబడింది. అంటే ఆ యువతి పైన వుంటోందన్న మాట!

తల పంకించి చకచకా అడుగులు వేశాడు నర్సన్. ముందున్న చిన్న గేటు తెరుచుకుని లోపల అడుగుపెట్టాడు. కింద భాగంలో లైట్లు వెలగడం లేదు. తలుపులకి వేసివున్న పెద్ద తాళంకప్ప స్పష్టంగా కన్పించింది. చుట్టుప్రక్కల ఇళ్ళల్లో ఎక్కడా అలికిడి లేదు. అంతా నిశ్శబ్దంగా వుంది. పై గదిలో లైటు వెలుగుతున్నట్లు కిటికీలోంచి వెలుతురు బయటికి ప్రసరిస్తోంది.

ఓ క్షణం ఆగి కోటుజేబులోవున్న రివాల్వర్ మీద చెయ్యి పెట్టి పరచారా పక్కనున్న మెట్లవైపు కదిలాడు నర్సన్. క్షణంలో మెట్లెక్కి పైకి చేరుకున్నాడు. విశాలమైన డాబా పైభాగంలో కట్టబడిన పెద్ద గదిముందు ఆగాడు.

గది తలుపులు దగ్గరికి జేరవేసి వున్నాయి. రెండు తలుపులకీ మధ్య సగంవరకూ చిరిగిన చీరకొంగు చిక్కుకుని ఓ కొస బయటికి వేలాడుతోంది. తనకి ఫోన్ చేసిన ఆమెకి ఏదయినా ఆపద సంభవించిందా? ఆ చీరకొంగు ఆమెదేనా?

తలుపులకి తల ఆనించి లోపలికి తొంగిచూశాడు నర్సన్. ఎదురుగ్గా గది మధ్యన తెల్లటి మల్లెపూల పాన్పు కనిపించింది.

చందాదారులకు గోల్డెన్ ఛాన్స్!

31-11-69 తేదీలోగా "అపరాధ పరిశోధన"కు ఏడాది చందా రు. 13-00 లు గానీ, లేదా ఉచితచందా (డిపాజిట్టు) రు. 60-00 లు గానీ, పంపినవారికి యీ క్రింది వాటిలో నుంచి మీరు కోరుకున్న 12 పుస్తకములు బహుమతిగా పంపగలము.

చందా సొమ్ము మనిఆర్డరుద్వారా పంపుతూ, వీరు ఎన్నుకొన్న 15 పుస్తకముల నెంబర్లు అందులోనే వ్రాసి పంపండి. వాటిలో నుంచి 12 పుస్తకములు మీకు మొదటి నెల పత్రికతో పంపుతాము. స్థానిక పాఠకులు నేరుగా ఆఫీసుకు వచ్చి, చందా కట్టి, బహుమతి పుస్తకాలు వెంట తీసుకు వెళ్ళవచ్చును.

బహుమతి పుస్తకాలు రిజిష్టరు పోస్టులో పంపగోరే వారు రు. 1-00 అదనంగా పంపవలసి వుంటుంది.

1.	డేరింగ్ కిల్లర్	— వి. ఎస్. చెన్నూరి	రు. 1-25
3.	అందం తెచ్చిన ఆపద	,,	రు 1-25
4.	నన్ను చూచి నవ్వింది	,,	రు. 1-25
5.	ఆతడే ఇతడైతే?	,,	రు. 1-25
6.	ముద్దుతెచ్చిన ముప్పు	,,	రు. 1-25
7.	పోస్టుమార్టం	,,	రు. 1-25
8.	రూం నంబర్-16	— విద్యారాణి	రు. 1-50
9.	మీరు నన్ను బంధించలేరు	,,	రు. 1-25
10.	ఆడవారి అంతర్యం	,,	రు. 1-25
11.	అసలు రహస్యం!	,,	రు. 1-25
13	పందెంవేసిన సుందరి	— పి. సుశీల	రు. 1-25
14.	స్టంట్ మాస్టర్	— విజయ-బాపినీడు	రు. 1-25
16.	నిజం కాగదు	— సి. రామలక్ష్మి	రు. 1-25
17.	ప్రళయంతెచ్చిన పరిమళం	—ఉమామహేశ్వర్	రు. 1-25

18. యువరాణి సలోమి — ఎమ్ ఆర్. ఎన్. రు. 1-25
19. హత్యకు ఆహ్వానం ప్రసాదరావ్ రు. 1-25
20. కళ్ళల్లో రహస్యం — జలజ రు. 1-25
21. దొంగే హంతకుడా ? — సత్యమూర్తి రు. 1-25
22 జంటనగరాలు ,, రు. 1-25
24. గూఢచారి-303 — ఏ. వి. మోహన్రావ్ రు. 1-25
25. మనోహారి కథ ,, రు. 1-25
26. చావు తెచ్చిన లావు ,, రు. 1-25
27. కోపం కోరిక తీర్చదు ,, రు. 1-25
28. పేచీకోరు పెనుభూతం ,, రు. 1-25
30 కిలాడి లేడి — శశికళ రు. 1-25
31. తేలుకొండి — ప్రభాకర్ రు. 1-25
32. విడుదలైన ఖైదీ — అజీజ్ రు. 1-25
33. దొంగలరాణి — మధూకర్ రు. 1-50
34. బ్లాక్ డెవిల్ — వి. ఎస్. చెన్నూరి రు. 1-50
35. కమలే కారణం ,, రు 1-25
36. తెల్లగులాబీ-99 — టెంపోరావ్ రు. 1-50
37. దెయ్యాలు సిగరెట్లు కాల్చవు ,, రు. 1-50
38. పునర్జన్మ ,, రు. 1-25
39. అర్థంకాని హత్యలు ,, రు. 1-26
40. నేను గూఢచారిని కాను ,, రు. 1-25

నెంబరు 2, 12, 15, 23, 29 పుస్తకాలు లేవు

ఏజెంట్లకు అవకాశం :- ఈ స్కీములో, చిన్నచిన్న ఏజెంట్లుకూడా చేరవచ్చును. 5 కాపీలకుగాని, అంతకు మించిన కాపీలకుగాని ఒకేసారి చందాకట్టే ఏజెంట్లకు అదనంగా, చందాదారులలో 10% డిస్కౌంట్ లభిస్తుంది.

మేనేజర్, "అపరాధ పరిశోధన"

హైద్రాబాద్-29.

తలగడలు దుప్పటి చిందరవందరగా పడి వున్నాయి. పూలు నలిగిపోయాయి. అతని మనస్సు ఏదో కీడును శంకించింది. బడాల్ను తలుపులు తోసుకుంటూ లోపల అడుగు పెట్టాడు నర్సన్. లైటు కాంతిలో కన్పించిన దృశ్యం అతన్ని కలవర పర్చింది. పూలపాన్పు ప్రక్కన నేలమీద ఓ యువతి అచేత నంగా పడివుంది. చాలా అందంగా వుంది. వొంటిమీద గాట్లు రక్కులు స్పష్టంగా కన్పిస్తున్నాయి. ఎవరో ఆమెను బలా త్కరించిన నిదర్శనాలవి! ఒంటిమీద ఒక్క నూలుపోగు కూడా లేదు. పూర్తి నగ్నంగా వుంది.

ఒక్క అంగలో ఆమెను సమీపించాడు నర్సన్. ఒంగి రెండు చేతులతో ఆమెను ఎత్తుకొని మంచం దగ్గరికి తీసుకు వెళ్ళాడు. పూల పాన్పుమీద ఆమెను పడుకో బెడుతుం డగా...

తళుక్కున మెరుపు మెరిసింది. మెరుపు కాదు. ఫోటో ఫ్లాష్! ఉలిక్కిపడ్డాడు నర్సన్. ఎవరో తనని ఆ సమయంలో ఫోటో తీశారు. ఎందుకు? కంగారుగా తల తిప్పి గుమ్మంవైపు చూశాడు అదే సమయంలో—

అంతవరకూ స్పృహతప్పినట్లు నటిస్తూ, అతని బాహువుల్లో లతలా పెనవేసుకుపోయిన ఆ యువతి చెంగున లేడిపిల్లలా ఎగిరి కిందకు దూకింది. ఒక్క అంగలో గదిలోంచి బయటకు వురికింది. మరుక్షణం గది తలుపు బయటినుంచి బంధించ బడింది!!

* * *

ఉదయం పదకొండు గంటలైంది. డిటెక్టివ్ నర్సన్ తన ఆఫీస్ రూమ్‌లో ఒంటరిగా కూర్చుని ఆలోచిస్తున్నాడు. అతని చేతిలో కార్డుసైజు ఫోటో ఒకటి వుంది. అది ఆవేళ

పోస్టులో వచ్చింది. ఆ ఫోటోలో—

అతను ఓ యువతిని ఎత్తుకుని పూల పాన్పుమీద పడుకో బెట్టబోతున్న దృశ్యం. ముల్లెలువాడి తలగడలూ, దుప్పటీ అటూయిటూ చెదిరి వున్నాయి. ఆ యువతి బుగ్గలమీద, రొమ్ములమీద గాట్లు స్పష్టంగా అవుపిస్తున్నాయి. గుమ్మం దగ్గర సగంవరకూ చిరిగిన చీరకొంగు స్పష్టంగా కనిపిస్తోంది.

ఆ ఫోటో తనకి ఎందుకు పంపారో తెలుసు తనకి! దాని ఆధారంతో బ్లాక్ మెయిల్ చేసి ఏదో సాధించడానికి! ఎన్నో కేసులను అవలీలగా ఛేదించగలిగిన తన చేతుల్లో యిరికించి వాడుకోడానికి!

డిటెక్టివ్ కళ్ళు కోపంతో ఎరబడ్డాయి. ఫోటోని డ్రాయర్ సొరుగులోకి తోసి సిగరెట్ అందుకున్నాడు అగ్గి పుల్లతో వెలిగించుకుంటుండగా టెలిఫోన్ బెల్ మ్రోగింది.

"హల్లోవ్! డిటెక్టివ్ వర్సన్ స్పీకింగ్" అన్నాడు గంభీరంగా, రిసీవర్ అందుకుని.

అవతల్నించి పరిహాసంగా నవ్వు వినిపించింది. "నన్ను గుర్తుపట్టారనుకుంటాను. ఫోటో అందిందా?" అడిగిందా యువతి హేళనగా, ధీమాగా.

"యస్. ఏం కావాలి మీకు?" ప్రశ్నించాడు వర్సన్ డైరెక్టుగా తనే సంభాషణ నడుపుతూ.

"అర్థం చేసుకున్నారు. హోంమినిస్టరీ డిపార్ట్ మెంట్ నించి వారంరోజులనాడు ఒక ఫైలు మీకు పంపబడింది. అందులోని వివరాలు మాకు కావాలి." అన్నదా యువతి.

"ఫోనులో చెప్పనా?" తాపీగా ప్రశ్నించాడు వర్సన్.

"అవసరం లేదు. యీ రాత్రి ఎనిమిదిన్నరకి డీలక్సు హోటల్ దగ్గరకి ఆ ఫైల్ తీసుకుని ఒంటరిగా రండి. ఒక

అరగంటలో అందులోని వివరాలు నోట్ చేసుకుని యిచ్చేస్తాను. మీకూ మాటరాదు. మాపనీ పూర్తవుతుంది.

మీరు మమ్మల్ని మోసగించాలని ప్రయత్నించినా, వెంట ఎవరినైనా తీసుకొచ్చినా అసలు మీకు కన్పించను. తెల్లారేప్పటికి యీ ఫొటో ప్రింట్ చేసిన కాగితాలు దేశవ్యాప్తంగా పంచిపెట్టబడతాయి. ఆ తర్వాత ఏమవుతుందో మీరు చెప్పాలా?" అని నవ్వింది.

"ఆల్ రైట్! మీరు కోరిన ఫైల్ తీసుకొస్తాను. అంత కంటే గత్యంతరం లేదని నాకూ తెలుసు." అని డిస్కనెక్టు చేసి కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్నాడు నర్సన్. ఆలోచనలతో అతని మస్తిష్కం వేడెక్క సాగింది.

* * *

రాత్రి ఎనిమిదిన్నరైంది. డీక్స్ ముందు కారాపి సిగరెట్ వెలిగించుకుని నలువైపులా పరిశీలనగా చూడసాగాడు నర్సన్. అయిదు నిమిషాలు గడిచేసరికి ఓ వ్యక్తి అతని ప్రక్కకి వచ్చి నిలబడి "తెచ్చారా?" అని అడిగాడు.

ఓసారి అతనివైపు పరిశీలనగా చూసి, అంగీకార సూచకంగా తలవూపాడు నర్సన్.

"గుడ్! దాన్ని తీసుకొని నా వెనక రండి. తెలివి తేటలు ప్రదర్శించవద్దు" అని అతను ముందుకు కదిలాడు. కారు లోపలికి చెయ్యిపెట్టి ఓ ఫైలు అందుకుని అతని వెనక బయలు దేరాడు నర్సన్. ఇద్దరూ పది గజాలు నడిచి పక్క వీధిలో ప్రవేశించారు.

"ఈ కారులో ఎక్కి కూర్చోండి. క్విక్." అన్నాడతను ఆజ్ఞాపిస్తున్న ధోరణిలో. నర్సన్ మాట్లాడకుండా కారులో కూర్చున్నాడు. ఆ వ్యక్తి కారు ఎక్కగానే అది బయలుదేరింది. ఎవ్వరూ మాట్లాడుకోలేదు.

పావుగంట తర్వాత కారు బారేజ్ దాటి, సీతానగరంలో ప్రవేశించి, కొండప్రక్కన ఆగింది. కారు ఆగుతుండగా చీకట్లోంచి ఇద్దరు పరిగెత్తుకొచ్చారు. ఇద్దరిలో మూడు రోజులనాడు అతన్ని మోసగించిన యువతి కూడా వున్నది.

"తెచ్చారా? ఇటివ్వండి" గర్వంగా అడిగిందా యువతి.

"ఇస్తాను. కానీ, ఎందుకో చెప్పాలి." అన్నాడు నర్సన్ గంభీరంగా.

"హోం మినిష్టర్ మీకు పంపిన ఫైలులో మా దేశపు గూఢచారులకి సంబంధించిన వివరాలున్నాయి. మీ దేశంలో మాకు ఎవరెవరు సహాకరిస్తున్నారో, వాళ్ళ పుట్టుపూర్వోత్తరాలన్నీ వున్నాయి. అందుకు."

"మీకు సహాకరించేవాళ్ళెవ్వరో మీకు తెలియదా? ఫైల్ చూసే తెల్సుకోవాలా?" అడిగాడు నర్సన్.

"అలాకాదు. మీ ఫైల్లో ఎక్కిన వాళ్ళెవరో తెల్సుకుని - ఇందులో ఎక్కిన వాళ్ళని హెచ్చరించి వాళ్ళను జాగ్రత్తగా వుండమని తెలియపర్చడం మా బాధ్యత! అయినా ఇవన్నీ మీ కెందుకు? ఫైల్ ఇటివ్వండి."

"ఇవ్వకపోతే, ఏం చేస్తావ్?" నవ్వుతూ ప్రశ్నించాడు నర్సన్.

"నా నోటితోనే చెప్పాలా! మీకు వచ్చిన ఫోటో తెలియడం లేదా? ఓ యువతిని బలాత్కరించి మానభంగం చేసినందుకు ప్రభుత్వం మిమ్మల్ని శిక్షిస్తుంది. ఆ ఫోటో పబ్లిష్ కాగానే మీ పరువుప్రతిష్టలు మంటగలుస్తాయి. అది మీకూ, మీ కుటుంబానికి మంచిది కాదు. మర్యాదగా ఆ ఫైల్ యివ్వండి." అందామె కాస్త కోపంగా ఓ అడుగు ముందుకువేసి.

నర్సన్ నవ్వి, జేబులోంచి చెయ్యిపెట్టి ఫోటోతీసి "ఈ ఫోటోయేగా! ఆల్ రైట్! కానీ ఒక చిన్న సవరణ! ఈ ఫోటో తీసినవాడు పెద్ద పొరపాటు చేశాడు. గుమ్మందగ్గర సగం చిరిగిన చీరకొంగును అలాగే వుంచాడు. చీర ఆ గదిలో మరోచోట వుంది. కొంగు అక్కడికి ఎలా వచ్చిందంటావు? నేను నిన్ను నేలమీద బలాత్కరించానని మూలగా పడివున్న పిడిచిన చీర కన్పిస్తోంది. మరి తలగడులు ఎలా చెదిరాయి. మల్లెపూలు ఎలా నలిగాయి. నిన్ను బలాత్కరించి రక్క కొరికి స్పృహలేని స్థితిలో మంచంమీదకు చేరవేస్తున్న దృశ్యం ఇది! కానీ ఓ మిస్! ఇక్కడ చాలా పెద్ద పొరపాటు జరిగింది! నిన్ను అంత ఘోరంగా హింసించి, బలాత్కరించిన నా బట్టలు ఏమాత్రం నలగలేదేం? నా తల చెరగలేదేం? నీ వొంటికి కనీసం మొహానికి చెమట పట్టలేదేం? ఇవన్నీ ఆలోచిస్తే యీ ఫోటోతో కేసు పెడితే నిలవదు. ఎగిరిపోతుంది. నువ్వు కావాలనే యిలా నాటకం నడిపి ఫోటో తీశావనీ, నిజంగా నిన్ను బలాత్కారం చెయ్యలేదనీ, ఏమాత్రం తెలివితేటలున్నవారైనా సులభంగా గ్రహిస్తారు. కనుక యీ ఫోటోతో నన్ను ఏమీ చెయ్యలేవు ఇందా! తీసుకో!" అని ఫోటో ఆమె చేతిలో పెట్టాడు.

ఆ యువతి మొహం వెలవెల బోయింది చటుక్కున పిస్టల్ తీసి "మీరు తీసుకొచ్చిన ఫైల్ ఇటివ్వండి" అని గర్జించింది కోపంగా.

"వై నాట్! అందుకోసమేగా తెచ్చింది! తీసుకో" అంటూ ఆ ఫైల్ యిచ్చాడు నర్సన్ నవ్వుతూ.

ఆ యువతి ఆత్రుతగా ఫైల్ తెరిచి చూసింది. అన్నీ తెల్లకాగితాలు! ఉలిక్కిపడి తలెత్తింది.

"సారీ, మిస్! నీ పథకం పారనందుకు విచారిస్తున్నాను.

ఆ చీరెలాంగూ - పూల పొన్నూ, నా నిర్దోషిత్వాన్ని నిరూపిస్తున్నాయి. నిన్ను బంధిస్తున్నాము. ఇదిగో! నిన్ను నీ బృందాన్ని ఖైదు చెయ్యడానికి మా కృపాల్ పోలీసులతో వచ్చేశాడు." అన్నాడు నర్సన్ పేల్చివగా.

సరిగ్గా అదే సమయంలో పాతికమంది మనుషులు కార్లు దిగుతూ వాళ్ళని చుట్టేశారు!!

* * *

ఫస్టు క్లాసు కంపార్టుమెంటులో ఇద్దరు వ్యక్తులు ప్రయాణం చేస్తున్నారు. అందులో ఒకాయన సిగరెట్ వెలిగించాడు. దీనికి రెండో ఆయన, ఈ కంపార్టుమెంటులో సిగరెట్ త్రాగడానికి వీలులేదు. ఆర్పెయ్యి, మన్నాడు. ఈ విషయంలో యిద్దరూ ఘర్షణపడి, టి. సి. ని పిలిచారు. సిగరెట్ దమ్ము లాగుతున్నాయన టి. సి. తో, ఆయన సెకండ్ క్లాసు టిక్కెట్టుతో ఫస్టు క్లాసులో ప్రయాణం చేస్తూ, తనతో తగువుకు దిగుతున్నాడని రిపోర్టు చేసాడు. టి. సి. ఆయన దగ్గర టికెట్ చెక్ చేసి, ఆయన్ని సెకండ్ క్లాసు టికెట్ అని తెలుసుకొని దింపేసాడు.

ఆ ఇద్దరు మరో స్టేషన్లో దిగిపోయారు. అప్పుడు రెండో ఆయన "ఏమండీ! వాడి సెకండ్ క్లాసు టికెట్టు అని మీరు ఎలా కనుక్కున్నారు" అంటూ అడిగాడు.

దానికి మొదటాయన "ఏముందీ! మీ చేతిలో వున్న టికెట్టు, నా టికెట్టు ఒకే రంగులో వున్నాయి." అంటూ వడివడిగా వెళ్ళిపోయాడు.

—చింతకాయల గంగాధర్, విశాఖపట్నం-4.

పాఠకుల ప్రశ్నలు

ఎస్. శ్యామ్‌సుందర్, పెద్దపల్లి.

కేవలం 'అదృష్టం' మీద ఆధారపడే మనుషులను ఏమనాలి?

సోమరులు.

రాధా కిషన్ పాండే, నార్సింగి.

'అపరాధ పరిశోధన పోటీ' లో గెలుపొందిన వారికి నగదు బహుమతి ఏర్పాటు చేస్తే బావుండేదేమో–?

డబ్బైతే వెంటనే ఖర్చయిపోతుంది. పుస్తకాలైతే. కొంతకాలందాకా మీకు వినోదాన్ని కల్గజేస్తాయి.

ఎస్. లక్ష్మణ్‌గుప్త, అలీసాగర్.

సార్! మీ బుట్టాసుకుడి బుర్ర, బొర్ర, ఎత్తు, లావు ఎంత వుంటుంది?

అబ్బో, పెద్ద ఆలోచనే? సర్వే చేయించి తెలుపుతాను.

జి. వాసుదేవ్, బొంబాయి-25.

అన్నయ్యా! మీ చెత్తబుట్టకు దయాదాక్షిణ్యాలు...?

వున్నాయి. విసుకు చెందకుండా నీవు ప్రతి నెలా పంపుతున్న అసంఖ్యాకమైన రచనలను ఎంతో ప్రేమతో అందుకుంటూనే వున్నాడు కదా, తమ్ముడూ!

ఎస్. శ్రవణ్‌కుమార్, సోమాజిగూడ.

డియర్, రెడ్డీ! కత్తిపోట్లకు, రివాల్వర్ గుళ్ళకు డిటెక్టివ్‌లు తప్పించి, మిగతావారు చస్తారు. కాని డిటెక్టివ్‌లు

సామాన్యముగా చావనే చావరు. ఎందుకు? అమృతం త్రాగారా ఏమిటి?

డిటెక్టివ్ లే చస్తే కథ ఏముంది? సస్పెన్స్ భరించగలరా మీరు?

జి. భూషన్ రెడ్డి, నిజామాబాద్.

నేను ఒక డిటెక్టివ్ నవల రాసాను దానిని మీరు సీరియల్ గా ప్రచురించగలరా?

క్షమించండి. వీలుపడదు.

ఎస్. గురురాజు, హైద్రాబాదు-6.

'విధి' చాలా బలీయమైందంటారు. ఎందుకు?

'విధి'కి తలొగ్గనివాడు, 'విధి'ని తప్పించుకోగల్గిన వాడు ఇప్పటివరకు ఎవరూలేరు.

వెబ్బిలి జగ్గారావు, పిఠాపురం.

కొందరు డిటెక్టివ్ నవల్సు, మాస వారపత్రికలను రోజు వారీ తక్కువ అద్దెలకిచ్చి డబ్బును సంపాదిస్తున్నారు. ఇలాంటివారివల్ల మీకు నష్టం కాదా, శ్యామ్ గారూ?

నష్టమే. ఇలాంటివారివల్ల అన్ని పత్రికలవారికి, పబ్లిషర్లకు ఎంతో హాని కలుగుతుంది. దీనికి పరిష్కారంకూడా ఎవరూ కనిపెట్టలేక పోయారు. పాఠకులు చాలావరకు పుస్తకాలు కొని చదవడం అలవాటు చేసుకుంటే, పబ్లిషర్లకు ప్రోత్సాహకరంగా వుంటుంది. మంచి పుస్తకాలు ప్రచురించడానికి, ఇంకా పేజీలు పెంచి, తక్కువ రేటులో అందించడానికి కృషి చేస్తారు. మీకుకూడా పుస్తకాలు కొనడం అలవాటు చేసుకుంటే, కొంత కాలానికి మీ ఇంట్లోనే స్వంత గ్రంథాలయం ఏర్పడుతుంది.

ఎమ్. జయంత్, సికింద్రాబాదు-3.

"అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను చిత్రీకరించే చిత్రకారుని పేరేమిటి?

సి. వి. అంబాదాస్.

యస్. ఎల్. యన్. గుప్త, అలీసాగర్.

డబ్బువుండి, ఇంగ్లీషు రానివాడు విదేశాలకు వెళ్ళాలంటే, ఎలా?

డబ్బు వుండగా కొదవేముంది? వెంట ఒక ట్రాన్స్లేటర్ ని పట్టుకెళ్ళవచ్చు.

పి. శ్రీధర్, ఆడిగొప్పుల.

రెడ్డిగారూ! మీ హాబీ ఏమిటి?

ఏముంటుంది? నెల తిరక్కుండా మీ చేతిలో పత్రికను పెట్టడమే.

జి. వాసుదేవ్, మెట్పల్లి.

మీరు స్వార్థపరులు—దీనికి మీ సమాధానం?

అవును. నిజంగా స్వార్థపరుణ్ని. "అపరాధ పరిశోధన" ను ముందుగా నేను చదవందే మీకు పంపించను.

కె. రామారావు, బాపట్ల.

ఎడిటర్ గారూ, మీరు "అపరాధ పరిశోధన పోటీ" లో జవాబుల్ని ముందే నిర్ణయించుకొంటారా, లేక వచ్చిన వాటిల్లో ఉత్తమమైన వాటికి బహుమతి నిస్తారా?

లేదు. జవాబులు ముందే నిర్ణయించి వుంటాయి.

అయూబ్ & మహమ్మద్, అమనగల్లు.

జీవితంపై విరక్తి ఎందుకు పుడుతుంది?

ఆశించినవి పొందలేక.

ఎస్. వి. లక్ష్మణరావు, బెంగుళూరు-13.

మీరు ప్రకటించిన 33 బహుమతి పుస్తకాలు మాకు యేదైనా కన్సెషన్‌లో అందించడానికి వీలవుతుందా?

పుస్తకాల రేటులో 25% కమీషన్ మినహాయించుకొని సొమ్ము ముందుగా పంపితే, మీరు కోరిన పుస్తకాలు అంద చేయగలము.

పసున్నూర్ వెంకటరెడ్డి, హైద్రాబాదు.

మీరు ఈనెల ప్రచురించిన 'ప్రియుడా? పిశాచమా?' అనే కథ మరోపేరుతో 'డిటెక్టివ్' పత్రికలో వచ్చింది. యిలా ఒకే కథ, ఒకేనెలలో రెండు వేర్వేరు పత్రికలలో పడటం శోచనీయం.?

యీ పొరపాటు రచయిత అతితెలివివలన జరిగింది. ఆయన ఆకథను మాకు ప్రత్యేకసంచికకని పంపాడు. కొందరికి ఇదొక హాబీ అనుకుంటాను. దీనిపై తగిన చర్య తీసుకుంటున్నాము.

చందా వివరాలు

ఏడాది చందా (ప్రత్యేక సంచికలతో)	రు. 13-00
ఉచిత చందా (డిపాజిట్టు) ,,	రు. 60-00

ప్రత్యేక బహుమతి: 30-11-'69 తేదీలోగా 'అపరాధ పరిశోధన' కు చందా పంపిన వారికి, వారు యేరి కోరుకున్న 12 డిటెక్టివ్ నవలలు ఉచితంగా లభిస్తాయి. నవలలన్నీ మీకు మొదటి నెల పత్రికతోపాటే పంపుతాము. వివరాలు 6, 7 పేజీలలో చూడండి. 'అపరాధ పరిశోధన' పాత సంచి కలు కావలసినవారు బహుమతి నవలలక్రింద కోరుకో వచ్చును.

సానివాడలో హత్య!

—జి.వి. సుబ్బయ్య.

"వస్తారా!" సుతారంగా అడిగింది.

"ఎంత?" ఆమెకేసి చూస్తూ ప్రశ్నించాడు.

ఆమెకు సుమారు పాతిక సంవత్సరాలు వయస్సు వుంటుంది. వామనచాయ, నైలాన్ జాకెట్టునుంచి బిగించి కట్టిన 'బ్రా' కొట్టొచ్చినట్లు కన్పడుతుంది.

తలలో సన్నజాజులు సౌరభంతో, గస్త్రులకు పులిమిన చౌకబారు సెంటు వాసనకలసి కొత్తరకం వాసన వేస్తుంది.

"పదిహేను యివ్వండి."

"కాదు పది" అన్నాడతను. బాగా అలవాటున్నవాడిలా.

"సరేరండి" అని గుమ్మంనుంచి వైదొలగి లోపలికి దారితీసింది.

"నీ పేరేమిటి?" అడిగాడతను కావాలనే.

"ఏం? పేరెందుకు! సౌదామిని అని పిలవండి" నవ్వుతూ చెప్పింది.

"నీవు ఒక్కదానివేనా వుండేది" మంచం మీద కూర్చుంటూ అడిగాడు.

"కాదు. మరిద్దరు వున్నారు. వారు నైటు బుకింగ్‌లకు వెళ్లారు" అంది చేయి చాచి నవ్వుతూ. కిల్లీ వేసుకోవటంవల్ల ఎర్రబడ్డ పెదవులు అందంగా విచ్చుకున్నాయి.

చాచిన చేయి పట్టుకొని మీదకు లాక్కొని, గట్టిగ కావు

లించుకున్నాడు.

"అబ్బ! డబ్బు యివ్వండి" అంది అతని బిగి కౌగలినుంచి తప్పించుకుంటూ.

అతను మాట్లాడకుండ జేబులోంచి పది రూపాయల నరి కొత్త నోటు తీసి యిచ్చాడు.

దాన్ని నాలుగు మడతలు పెట్టి, గదిలోంచి బయటికి వెళ్ళి అరనిముషంలో తిరిగి వచ్చింది.

ఓసారి చిన్నగా నవ్వి, అతని ప్రక్కన కూర్చొని అలాగే మంచంమీదకు వాలి "త్వరగా కానీయండి. పోలీసులు వస్తారేమో..." అంది చీరచెంగులు తొడలమీదకు లాగుతూ.

"వస్తే రానీ! యిప్పుడు కాకపోయినా, తరువాతనయినా రావలసిన వారేగా..."

కెవ్వుమంది కమిలిన బుగ్గను చేత్తో రాసుకుంటూ.

"ఏమిటి? ఈ మోటు సరసం," తీవ్రంగానే అంది. కళ్ళల్లో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"ఏం కన్నెపిల్లలా ఆడుగుతున్నావు, యిదే మోటు అను కుంటే నైటుకు బుక్ చేసి, రూముకు తీసుకువెళ్లి నలుగురు వంతు లేసి అనుభవించుతూ తలొకటి పట్టుకొని యిష్టం వచ్చినట్లు లాగుతుంటే ఏమనుకుంటావో" అన్నాడతను వెకిలిగా నవ్వుతూ.

"ఏదో ఒకటి అనుకుంటాను కాని. ముందు మీరు త్వరగా కానీయండి. మీ ఒక్కరితో వుంటే మాకు గడవదు" అంటూ అతన్ని మీదకు లాక్కుంది.

"గడవదు అనుకుంటే, మరో నలుగురిని చూచుకుంటే సరి

పోతుంది. అంతేకాని సంసారం చేసుకోనే స్త్రీలను ఉసురు పెట్టి, వారి సంసారంలో నిప్పులుపోయటం చాలా ప్రమాదం. క్షమించరాని నేరం" అన్నాడతను కటువుగా.

"ఏమిటి మీరు మాట్లాడేది? ఎవరు మీరు? ఎందుకొచ్చారు?" కాస్త తీవ్రంగానే అంది అదిరిపడుతూ.

"ఎవరా? ఎందుకొచ్చానా?? యిందుకు" అన్నాడు చటుక్కున అరంగుళాల కత్తితీసి.

"యిదా? యిదెందుకు?" కంగారుగా అరిచింది.

"ఎందుకా! యిందుకు!" అంటూ చేత్తో నోరుమూసి, బలంగా వక్షస్థలంలో కత్తి దిగేశాడతను.

2

"ముందుగా శవాన్ని చూచిందెవరు?" ఇన్‌స్పెక్టర్ కేశవరావు ప్రశ్నించాడు.

"నేను" అంది ఓ యువతి ముందుకు వచ్చి.

"నీవేనా! నీ పేరేమిటి?" ఆ యువతిని పరీక్షగా చూస్తూ అడిగాడు.

ఆ యువతికి యిరవై వుండొచ్చు. చౌకబారు వేషం, వెకిలి నవ్వు, రేగినజుట్టు, వాడిన పూలు, నలిగిన దుస్తులు, ఆమె ఎవరో! చెప్పకనే చెపుతున్నాయి.

"నా పేరు మేరి అండి" అంది నవ్వుతూ.

"నీవు ఏం చేస్తుంటావు?" అని అడుగబోయి, ఏం చేస్తుంటుందో తెలుసు కనుక, "నీవు వుండేది ఎక్కడ?" అని అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"దీనికి ఆవతల కుడిచేతివైపు రెండో యింట్లో! మీకు తెల్సుగా" చెప్పింది వెకిలిగా నవ్వుతూ.

"మటాష్! శవాన్ని ఎప్పుడు చూశావ్! యిక్కడికి ఎందుకొచ్చావ్. ఏం జరిగిందో చెప్పు." కోపంతో మండిపడుతూ గద్దించాడు ఇన్‌స్పెక్టర్. ఆమె డైలాగు అతని తల కొట్టేసినట్లయింది.

"మరండి ఇవాళ సెకండ్ షో సినిమాకు వెళ్దాం రమ్మని చెప్పిందండి సౌదామిని! అందుకని తొమ్మిదిన్నరకల్లా యిక్కడకు వచ్చేశానండి! నేనిక్కడకు వచ్చేసరికి మంచంమీద అలా పడుందండి! నిద్రపోతుందనుకొని తట్టి లేపుదామనుకొని దగ్గరకెల్లానండి. గుండెలమీద రక్తం, కత్తి కనిపించాయి. అంతేనండి. కెవ్వున అరుస్తూ బయటకొచ్చేశాను. ఆ తర్వాత చుట్టుపక్కల వాళ్లంతా వచ్చారు. పోలీసుస్టేషన్‌కు ఫోను చేశానండి, మీరొచ్చారు. అంతేనండి" అని చెప్పింది మేరి.

ఆమె చెప్పిన కథ నమ్మదగిందిగా కన్పించలేదు ఇన్‌స్పెక్టర్ కేశవరావుకు. పక్కకు తీసుకెళ్లి "మేరి! యిది హత్యకేసు. ఏం జరిగిందో దాచకుండా నాతో చెప్పు. లేదా నిన్ను పోలీసు స్టేషన్‌కు తీసుక వెళ్తాను. నువ్వు అనవసరంగా ఇందులో యిరుక్కుంటావు" అన్నాడు.

మేరి తలొంచుకొని "ఇవాళ్ళ ఈ వీధిలో మాకెవ్వరికీ బేరాలు తగల్లేదండి తొమ్మిదింటికి ఒకతను సౌదామిని కావాలంటూ వచ్చాడు. మేము ఎన్ని విధాలుగా ప్రయత్నించినా అతను ఎవరిదగ్గరకు రాలేదు. సౌదామినీ కావాలన్నాడు. గత్యంతరం లేక దూరంనుంచే ఆమెను చూపించాము. యిద్దరు బయట నిలబడి కాసేపు మాట్లాడుకున్నారు. ఆ తరవాత లోపలికి వెళ్ళారు.

పావుగంట పర్వాత అతను గబగబా బయటికి వచ్చి, రిక్షాలో ఎక్కి వెళ్ళి పోయారండి. సౌదామిని ఎంత సంపా దించిందో నన్న కుతూహలం కొద్ది నేను పరుగెత్తు కొచ్చా నండి! యిక్కడకు వచ్చి చూస్తే ఆమె చచ్చి పడుంది. ఈ విషయాలు ఎలా చెప్తామండీ" అంది.

నిజమే! వేశ్యలు పట్టుబడ్డా వ్యభిచారం చేస్తున్నామని పోలీసులతో ఎలా చెప్పకుంటారు? వాళ్ళకు అభిమానం వుంటుంది.

ఆమె చెప్పింది విన్నాక గట్టిగా నిట్టూర్చి, "ఆల్ రైట్! పై అధికారి అడిగితే యిప్పుడు నాకు చెప్పిన వివరాలన్నీ చెప్పాలి. యిందాక వినిపించిన కథ చెప్పక! చిక్కుల్లో పడ తావు..." అని బయటకు వచ్చి తాను తెలుసుకున్న వివరా లన్నీ క్రైంబ్రాంచికి తెలియపర్చాడు కేశవరావు.

పావుగంటతర్వాత ఆ కేసు హాండోవరు చేసుకోడానికి క్రైంబ్రాంచి నుంచి డిటెక్టివ్ నాగరాజన్ వచ్చాడు. అతను సమర్థుడు. తెలివి తేటలు కలవాడు. ఎన్నో హత్యకేసులు అవ లీలగా ఛేదించాడు.

ఇన్‌స్పెక్టర్ కేశవరావు చెప్పిన వివరాలన్నీ విన్నాడు. నాగరాజన్ శవంవున్న గదిలోకి వెళ్ళి, చచ్చి పడివున్న సౌదా మినిని పరిశీలనగా చూశాడు. చెప్పుకోతగ్గ అందం కాదామెది. అయినా హంతకుడు ఆమెనే వెతుక్కుంటూ వచ్చాడు. కనుక, హత్యకు మరేదో కారణం వుంది. ఆ విషయం హాతు రాలికికూడా తెల్సుండదు. తెలిస్తే అతన్ని లోనికి రానిచ్చేది కాదేమో!

శవాన్ని పరిశీలిస్తున్న నాగరాజన్ దృష్టి మంచం ప్రక్కన

పడివున్న చేతి రుమాలు మీద పడింది. పెన్సిల్‌తో దాన్ని పైకి తీసి పరిశీలించాడు. తెల్లటి శిల్కు రుమాలు. ఓమూల "క" అన్న అక్షరం కుట్టివుంది.

ఎవరీ 'క?' ఆమెను ఎందుకు హత్య చేశాడు? ఆలోచిస్తూ గదంతా వెతికాడు నాగరాజన్.

శవం పడివున్న కరుపు తలగడల క్రింద కొన్ని మనియార్డరు కూపన్లు, ఉత్తరాలు కన్పించాయి. వాటిని చదువుతున్న కొద్దీ అతని ముఖం వికసించసాగింది.

3

"నాభర్త లేకుండా వున్న సమయంలో, ఒంటరిగావున్న నన్ను కల్సుకోవల్సిన అవసరం పోలీసుల కేమిటో అర్థం కావటం లేదు" అంది మీనాక్షి మొహం చిట్లిస్తూ.

నాగరాజన్ నవ్వి, కాలుతున్న సిగరెట్‌ని క్రింద పడేసి, బూటుకాలుతో నొక్కి ఆర్పేశాడు.

"మీనాక్షి దేవిగారూ! వీలయితే మిమ్మల్ని ఆపదల్లోంచి కాపాడాలనే సదుద్దేశంతోనే మీ భర్తలేని సమయంలో వచ్చాను. ఇవి చూడండి" అంటూ కొన్ని ఉత్తరాలు మనియార్డరు కూపన్లు ఆమెకు అందించాడతను.

వాటిని చూడగానే ఆమె మొహం వెలవెలపోయింది.

"ఇన్ని మీ కెక్కడివి? ఎవరిచ్చారు?" అంది.

"సౌదామిని యింట్లో దొరికాయి. ఆమె మరణించింది. నిజం చెప్పాలంటే, హత్య చేయబడింది." తాపీగా చెప్పాడు.

"హత్యా...!" తెల్లబోయింది మీనాక్షి.

నాగరాజన్ నవ్వి, "అవును. ఈ వుత్తరాలు మణియార్డరు

కూడన్ను, ఈ హత్యతో మీకు సంబంధం వున్నదని సూచిస్తున్నాయి. కానీ, నేనలా అనుకోవటం లేదు. మీకు సౌదామిని ఎప్పటినుండి తెలుసు? ఆమెకు ప్రతినెలా పైకం ఎందుకు పంపుతున్నారో చెప్పండి. మీరు నిరపరాధులని రుజువయితే వెళ్ళిపోతాను" అన్నాడు గంభీరంగా.

మీనాక్షి తలొంచుకొని "చాలా రోజులనుంచి పరిచయం. నేను, సౌదామిని, పంకజం, కలిసే స్కూలు ఫైనల్ వరకు చదువుకున్నాము. అది స్కూలు లీడర్సుతో, టీచర్సతోను చాలా చనువుగా ప్రవర్తించేది. ఒక్కొక్క రోజు ఒక్కొక్కరితో గడిపేది. ఆమెను ఆ పాపాన్నుంచి తప్పించాల్సిందిపోయి, మేము అందులో పాలు పంచుకున్నాము. అది పరీక్ష తప్పింది. మేము పాసయ్యాము. ఆ తర్వాత మా దార్లు వేరయ్యాయి. నేను, పంకజం వివాహం చేసుకున్నాము." అని చెప్పింది.

"ఆ తర్వాత సౌదామినిని మీ రెప్పుడు కలుసుకున్నారు," అడిగాడు నాగరాజన్.

"దాదాపు సంవత్సరం అయిందనుకుంటాను. ఓసారి నన్ను చూడటానికి పంకజం ఈ వూరొచ్చింది. మే మిద్దరం సినిమా కెళ్ళాం. సినిమాహాల్లో అనుకోకుండా కన్పించిందది. తానే గుర్తుపట్టి పలకరించింది. మా వివరాలు అడిగి తెలుసుకుంది. ఆ తర్వాత చెప్పింది, తాను వొళ్ళు అమ్ముకొని బతుకుతున్నానని.

"నాకు కోపం వచ్చింది. దాన్ని తిట్టాను. ఆపని మానెయ్యమన్నాను. అది వినలేదు. నా మాటల్ని తేలిగ్గా తీసి అవతల పారేస్తూ నవ్వింది. స్కూల్లో చేసిన పని బయటచేస్తే తప్పేమిటుంది! తనకు ఆ జీవితమే హాయిగా వుందన్నది.

స్కూల్లో మేము చేసిన తప్పులు ఎత్తి పొడచింది. దానితో వాదించ దల్చుకోలేదు. సినిమా వదిలాక, ఎవరి దార్న వాళ్ళం విడిపోయాము. మూడు రోజుల తర్వాతనుకుంటాను. సౌదామిని దగ్గర్నుంచి నాకో ఉత్తరం వచ్చింది. వెంటనే వంద రూపాయలు పంపమన్ని, లేదా స్కూల్లో నేను చేసిన తప్పులను బయటపెట్టి, రుజువుచేసే ఆధారాలు తన దగ్గరున్నాయని, వాటిని నా భర్తకు పంపిస్తానని! స్నేహితురాలు ఇంత ద్రోహం చేస్తుందనుకోలేదు. చదువుకునే రోజుల్లో, ఎన్నో తప్పులు చేస్తాం. అవి జీవితాలను నాశనం చేస్తాయని అనుకోము అప్పట్లో! అవన్నీ ఆలోచించే వయస్సు కాదది! ఇప్పుడు ఆ విషయాలను రచ్చకీడ్చుకొని సుఖంగా సాగుతున్న నా సంసారాన్ని నాశనం చేసుకోటం ఇష్టంలేక పోయింది. అందుకని అది వుత్తరం వ్రాసినప్పుడెల్లా మణియార్డరు చేస్తూనే వున్నాను. ఈ పద్ధతి మంచిది కాదని నాలుగైదు ఉత్తరాలుకూడా వ్రాశాను. కాని, దాని జీవితం ఈలాగైందే అన్న జాలి తప్ప, హత్య చెయ్యాలని నే నెప్పుడూ అనుకోలేదు." అంది.

ఆమె ముఖంలోనే కాదు, స్వరంలోకూడా స్నేహితురాలు మరణించిందన్న విచారం కనిపెట్టాడు డిటెక్టివ్ నాగరాజన్.

"ఒకవేళ ఈ విషయం తెల్సి, మీ భర్తగారు హత్య చేశారేమో!" నాగరాజన్ తన అనుమానాన్ని వ్యక్తపరిచాడు.

"ఆయనా! ఛా!...ఛా!... ఆయన వయస్సెంతనుకుంటున్నారు? అరవై అయిదు. హత్య చేసేంత బలమైన శరీరం కాదు. గత్యంతరం లేక ఆయన్ను చేసుకున్నానన్న మాటే కాని, నన్ను పువ్వుల్లో పెట్టి పూజిస్తున్నారు. ఎంత ఖర్చు

పెట్టిగా అడగరు అందువల్లే, దాని డిమాండ్‌ను ఎప్పటి కప్పుడు సర్దుకో గలిగాను."

నాగరాజన్ కాసేపు ఆలోచించి "ఆల్ రైట్! అవసర మైనప్పుడు మళ్ళీ కలుస్తాను. ప్రస్తుతానికి పంకజంగారి అడ్రసు యివ్వండి చాలు," అన్నాడు.

అతను కోరిన అడ్రసు వ్రాసి యిచ్చి, "దయచేసి యీ విషయం వారికి చెప్పకండి ప్లీజ్!" అంది దీనంగా.

నాగరాజు ఓసారి ఆమె మొహంలోకి సూటిగా చూచి "చెప్పను..." అని వెళ్ళిపోయాడు.

4

"నా పేరు నాగరాజన్! క్రైం బ్రాంచిలో డిటెక్టివ్ ఇన్ స్పెక్టరుగా పనిచేస్తున్నాను. మీరే కదూ, కృష్ణమూర్తి అంటే?"

తనను తాను పరిచయం చేసుకుంటూ ప్రశ్నించాడు నాగరాజన్.

"యస్. గ్లాడ్ టూ మీట్ యూ సర్! ప్లీజ్ టేక్ యువర్ సీట్" అని కుర్చీ చూపించి, "ఏం పని మీద వచ్చారో తెలుసుకోవచ్చా?" అని అడిగాడు కృష్ణమూర్తి వినయంగా.

"యింట్లో మీ మిసెస్ పంకజం గారున్నారా?" ప్రశ్నించాడు నాగరాజన్.

"లేదు. గుడికి వెళ్ళింది! ఆమెతో మాట్లాడాలా?"

"అవసరం లేదు" అని సిగరెట్ తీసి వెలిగించుకున్నాడు నాగరాజన్. రెండు నిముషాలు ఆగి, "మిస్టర్ కృష్ణమూర్తి! మీరు చదువుకున్నవారు, సంస్కార వంతులు, సౌదామిని

ఎందుకు హత్యచేశారు?" అని అడిగాడు తాపీగా.

అతను ఉలిక్కి పడి "వాట్! నేను హత్యచేశానా? ఏమిటి మీరంటున్నది?" బదులు ప్రశ్నించాడు.

"కృష్ణమూర్తిగారూ! మీరు హత్య చేశారని నిర్ధారణ అయింది. అందుకు కావాల్సిన ఆధారాలు మా దగ్గర వున్నాయి. యీ జేబురుమాలొక్కటే చాలు, మిమ్మల్ని హంతకులుగా నిరూపించేందుకు. అయితే, నేను కోరేది నిజం మాత్రమే." అన్నాడు గంభీరంగా నాగరాజన్.

కృష్ణమూర్తి ఓసారి అతని మొహంలోకి చూచి, తల దించుకొన్నాడు. "అవును. సౌదామినిని చంపేను. ఆమె నా భార్యను బ్లాక్ మెయిల్ చేస్తూంది. అనుకోకుండా ఓసారి ఆ వుత్తరం నేను చూశాను. నా భార్య పంకజాన్ని అడిగాను. చిన్నప్పుడు స్కూల్లో ఒకే ఒక సారి చేసిన తప్పును వొప్పుకుంది. ఏ శిక్ష విధించినా భరిస్తానంది. కాని, తన సంసారాన్ని పాడుచెయ్యొద్దని పాదాలు పట్టుకొని ఏడ్చింది.

ఆమె నా భార్య. ఏమి తెలియని వయస్సులో ఒకే ఒక సారి తప్పు చేసింది. పెళ్ళి అయిం తర్వాత నన్నే సర్వస్వంగా భావిస్తోంది. సైగా అడిగిన వెంటనే కల్లిబొల్లి కబుర్లు చెప్పకుండా తప్పు వొప్పుకుంది. చదువుకునే రోజుల్లో నేనూ తప్పులు చేశాను. పెళ్ళి అయేంతవరకూ బ్రహ్మచారిగా గడపలేక పోయాను. అందుకే ఆమెను అర్థం చేసుకున్నాను. పంకజాన్ని మనస్ఫూర్తిగా క్షమించాను.

"కాని, సౌదామిని మమ్మల్ని క్షమించలేదు. నేను అసలు విషయం తెలుసుకొని క్షమించానని, యిక మీదట డబ్బు పంపమని పదేపదే వుత్తరాలు రాయవద్దని నిష్కర్షగా పంకజం, సౌదామినికి ఉత్తరం వ్రాసింది. కాని, వెంటనే

తాను కోరిన డబ్బు పంపకపోతే మా యిద్దరి పరువు బజారు పాలు చేస్తానని బెదిరించుతూ జవాబు వ్రాసింది.

నేనయితే పంకజాన్ని క్షమించి, ఈ రహస్యాన్ని కాపాడగలను. కాని, ఈ లోకం ఆ విషయం తెలిస్తే నన్నూ, పంకజాన్ని కాకుల్లా పొడుస్తుంది, నిల్వ నీడలేకుండా చేస్తుంది. అందుకే ఆమెను చంపేశాను. నేను ఏమైనా, ఒక దుర్మార్గురాలిని అంతం చేశాను," అని పూర్తి చేశాడు.

"నాకు తెలుసు, మీ రుమాలు అక్కడ పడకుండాను వుంటే, మీ మిసెస్ పంకజం వ్రాసిన వుత్తరాలు, మనియార్డరు కూపన్లతో పాటు, మీనాక్షి పంపిన వాటినికూడా మీరు వెంట తెచ్చుకొని వుంటే, యింత త్వరలో కనుక్కోలేక పోయేవాళ్ళం. మీనాక్షి ఎవరో మీకు తెలియకపోయినా ఆమె వ్రాసిన వుత్తరాలు అక్కడ వుంటే అనుమానం ఆమె మీదకు పోతుందని ఆశించారు. పైగా, సౌదామినే కావాలంటూ అందర్నీ అడుగుతూ వెళ్ళారు. ఈ ఆధారాలవల్ల మిమ్మల్ని సులువుగా పట్టుకో గలిగాం. వెళ్దాం పదండి" అన్నాడు నాగరాజన్ గంభీరంగా.

"కాసేపు ఆగండి. నా భార్య గుడినుంచి రాగానే చెప్పి వస్తాను. ప్లీజ్ ..." అన్నాడు కృష్ణమూర్తి ప్రాధేయపడుతూ.

డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజన్ తలవూపి కుర్చీలో వెనక్కు వాలాడు.

* * *

జ్యోతిష్కుడు: నీకీ నెల పెళ్ళి గండం వుంది...?

యువకుడు: అయ్యో, బాబోయ్! నాకేమిటి గతి?

జ్యోతి: వంటగది.

—యస్. లక్ష్మన్‌గుప్త, అలీసాగర్.

లేఖలు

'నమ్మలేని నగ్నసత్యాలు'—చాలా సరికొత్త శీర్షిక. కొత్తదనంతో చాలా బావున్నాయి బిట్సు. పత్రికకు వన్నెలవి. శ్రీ యుగంధర శ్రీ హిప్ హిప్ హుర్రే!!

—దామిడి ప్రేమరంజనరెడ్డి, సూర్యాపేట.

అద్భుతం. 'అపరాధ పరిశోధన' జన్మదిన ప్రత్యేక సంచిక చాలా బాగుంది. శ్రీభగవాన్, విజయ-బాపినీడు, చెన్నూరి గారల కథలు చాలా బాగున్నయ్. 'డిటెక్టివ్‌ల చైనా యాత్ర' అయిపోవటం కాస్త నిరాశ కలిగించినా, ఏ.వి. మోహన్‌రావ్ గారి 'జాక్‌పాట్' ఉత్సాహాన్ని ద్విగుణీకృతం చేసింది. 'అపరాధ పరిశోధన పోటీ' లో తీసుకొని వచ్చిన మార్పు అభినందనీయం. 'నమ్మలేని నగ్నసత్యాలు' ఆశ్చర్యంలో ముంచివేస్తున్నవి.

—క. వి. దుర్గామోహన్‌రావు, మిర్యాలగూడెం.

ప్రత్యేక సంచికలో ప్రవేశించిన 'గూఢచారి-002' మమ్మల్ని చాలా నవ్వించాడు. ఆదొక మంచి శీర్షిక. చిన్న నవల 'స్మగ్లర్స్' అంత బాగా లేదు. వాక్యానికో పేరాగ్రాఫ్! 'జాక్‌పాట్' వండ్రఫుల్‌గా వుంది.

—'కమలాధర', ముఫ్‌కాల్.

క. శివరామ్ గారి సీరియల్ 'డిటెక్టివ్‌ల చైనాయాత్ర' ఆఖరి అంశంవరకు సస్పెన్స్‌గా నడిచింది. ముగింపు పొడిగించితే ఇంకా రక్తిగా యుండేది. 'స్మగ్లర్స్' చిన్ననవల చదివి

నప్పుడు ఒళ్ళు పులకరించింది. రచయితలకు నా ధన్యవాదాలు.

—ముమ్మిడి శ్రీరామచంద్రమూర్తి, కాకినాడ-1.

'గూఢచారి 002' వ్యంగ్య రచన చాలా బాగుంది. గబ్బిలం మొఖమా, అని వినబడినప్పుడు; సున్నపు పిడతా, అంటూ ప్రక్కనున్న వ్యక్తిని లెంపకాయ వేసుకోబోయి మమ్మల్ని భలే నవ్వించాడు. 'డిటెక్టివ్‌ల చైనాయాత్ర' ముగింపువరకూ డీసెంట్‌గా వుంది.

—డి. వెంకట్‌దాస్ అండ్ కె. సత్యనారాయణ, ముప్కాల్.

'జన్మదిన ప్రత్యేక సంచిక' అద్భుతంగా వుంది. రెండు రూపాయలైనా, సంచిక ఎంతో హుందాగా, మంచి గెటప్‌తో, చక్కటి కథలతో, వింత శీర్షికలతో మమ్మల్ని ఆనందపర్చింది. మీరు క్రొత్తగా ప్రారంభించిన 'గూఢచారి 002', 'రీడర్స్ క్లబ్' శీర్షికలు మాకెంతో నచ్చినవి. జి.వి.జి., 'టెంపోనాధ్' గారలకు మా హృదయపూర్వక అభినందనలు.

—పన్యాల్ వెంకటరెడ్డి, హైద్రాబాదు.

పాకెట్ సైజులోకి వచ్చిన తర్వాత 'అపరాధ పరిశోధన' ఇంత అందంగా, ఆకర్షణీయంగా ఎప్పుడూ రాలేదు. గెటప్ బావుంది. చెన్నూరిగారి 'యజమానికోసం-యమయాతన', టెంపోనాధ్‌గారి 'రీడర్స్ క్లబ్ పోటీ' పత్రికకి హైలెట్, ఎంప్లాయ్‌మెంట్, మరుజన్మ ముగువ, స్మగ్లింగ్ రాకెట్ లాంటి చిన్న కథలు ఎంతో వుత్సాహంగా సాగినయ్. 'అపరాధ పరిశోధన' ఇలాగే ఎప్పటికీ ఏకైక డిటెక్టివ్ మాస పత్రికగా వెలుగొందాలని కోరుతూ—

—పి. జయప్రకాశ్, సికింద్రాబాదు.

అపరాధ పరిశోధన పోటీ—14

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి ప్రక్కనే జవాబులుకూడా ఉన్నవి. మీరు సరియైనదని గ్రహించిన జవాబును నెంబరు వారీగా ఒక తెల్ల కాగితంపై వ్రాసి, దానితో 20 పైసల పోస్టలు స్టాంపు జతపరచి పంపండి. ఆల్ కరెక్టుగా పంపిన వారికి ఒక సంవత్సరముపాటు 'అపరాధ పరిశోధన' లేదా, ఆ విలువకు సరిపడే ఇతర నవలలు ఉచితంగా పంపుతాము

ఒక్కొక్కరు రెండు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకు 20 పైసల పోస్టలు స్టాంపు జతపరచాలి. స్టాంపులు జతపరచని కూపన్లు పోటీకి స్వీకరించబడవు. కూపన్లు 30-9-'69 తేదీలోగా మాకు చేరేటట్లు పంపాలి. తుది నిర్ణయం సంపాదకులదే. ఫలితాలు నవంబరు '69 నెల సంచికలో ప్రకటిస్తాము. **

1. ప్రతి హంతకుడు ఇక్కడికి వెళ్ళవలసిందే. తప్పదు! (నరకానికి, జైలుకు, కోర్టుకు, వురికంభం దగ్గరకు.)

2. ఈయనకు అసిస్టెంట్ లేనిదే పని జరుగదు (డిటెక్టివ్, అడ్వకేటు, జడ్జీ, ఇన్‌స్పెక్టర్.)

3 ఇది 'శాంతి సిరి' రచన—? (అన్యాయం చేశాను—అనుభవిస్తాను, ఎర్రతేలు, అరిగిపోయిన అణాకాను, ఆడదాని భార్య.)

4. డిటెక్టివ్ సాహిత్యం మొదలై ఇప్పటికి దాదాపు ఎన్ని సంవత్సరాలైందో చెప్పగలరా? (15 సం.లు, 85 సం. లు, 130 సం. లు, 175 సం. లు.)

5. హత్య ప్రదేశానికి వెళ్ళగానే ఇన్‌స్పెక్టర్ చేసే మొట్టమొదటి పని ఇది—(హత్య వివరాలను సేకరించడం, 'క్లూ' లకు వెతకడం, హతుని పరిశీలించడం.)

కె. శివరాబు
మంత్రసిద్ధి

వనజ అద్దం ముందు నిలబడి అందాని మెరుగులు చేసు కుంటూ వుంది. వనజ మేకప్ చేసుకోవడం చూస్తూ ఆమె భర్త వేణు తదేకంగా చూస్తూ నిలబడ్డాడు. ఎంతసేపు చూసినా వేణుకు తనివితీరదు. రేయింబవళ్ళు వనజతో, వేణు కాలం వెళ్ళబుచ్చినా తృప్తి తీరదు. అందుకు కారణం వనజ అందమే! వనజ అందానికి వేణు గర్వపడుతుంటాడు. తన కంత అందగత్తెలాటి భార్య లభించినందుకు లోలోనే కాక, బహిరంగంగానే విర్రవీగుతుంటాడు.

వనజ తన అందానికి తుది మెరుగులు దిద్దుకొని సిదమైంది!

"ఎక్కడికి?" ప్రేమతో అడిగాడు వేణు.

"బీచ్‌కు వెళ్ళివస్తాను." చెప్పింది వనజ.

"నేనూ వస్తాను" అన్నాడు అమితానందంతో.

"మీరూ వస్తే పాప ఏంకావాలి?" అని చిరుకోపం ప్రదర్శించింది.

"పాపనూ తీసుకెళ్ళుదాం!" అని చెప్పాడు చతురా హాలంగా.

"వద్దొద్దు. నేనొక్కదాన్నే వెళ్తాను. నాకు ఒంటరిగా వెళ్ళి షికారు కొట్టడమంటే మహాయిష్టం!" అని చెప్పింది వనజ.

"ఏమిటి వనజా! భర్తనూ, బిడ్డనూ వదలి నీవు షికా రెళ్ళడం నా కిష్టం లేదు" నిరుత్సాహంతో చెప్పాడు వేణు.

వనజ బుంగమూతి పెట్టుకుంది. సత్యభామను అలుకను ప్రదర్శించింది.

"నా యిష్టప్రకారం, నేను చేస్తేనే నాకు సంతోషం. ఆనందం! నేను సంతోషంగా, ఆనందంగా వుంటేనే మీకు

సుఖం లభిస్తుంది. పైగా మీరూ ఆనందంగా వుంటారు, సుఖంగా వుంటారు!" అనన్నది వనజ.

అదీ నిజమనిపించింది వేణుకు. అయినా వనజ ఒంటరిగా వెళ్ళడం యిష్టంలేదు. ఆవేళ కే కాదు, వనజ ప్రతిరోజూ షికారుకు వెళ్ళుతూంది. తన సంపాదన వనజ ఆడంబరాలకు చాలడం లేదు. వనజకు కష్టం కలగకుండా అహోరాత్రులూ కష్టపడి సంపాదిస్తున్నాడు. కానీ చాలడం లేదు. వనజ ఒంటరిగ వెళ్ళుతున్నదని తెల్సు. పాపని, ప్రక్కయింటివారికో-యెదురింటివారికో అప్పగించి వెళ్ళడ ఆతనికి తెల్సు!

వనజ యెన్ని తిరుగుళ్ళు తిరిగినా అతనికి కోపం రాదు. వనజ అందానికి పూర్తిగ బానిస అయినవాడు వేణు! ఎంత బానిస అయినప్పటికి వనజ తిరగడం అతని మనసు ససేమిరా ఒప్పుకోవడం లేదు.

వనజ వేణు జవాబు చూడకుండా వెళ్ళి పోయింది.

వనజ, యేం చేస్తూంది? తెల్సుకోడానికి అతను వుబలాట పడ్డాడు. అతి జాగ్రత్తగ తన భార్యను వెంటాడడం మొదలు పెట్టాడు.

వనజ హోటల్లోకి దూరింది. కొద్ది సేపటి తరువాత అతను కూడా ఆ హోటల్లోకి దూరాడు. వనజ ఓమూలగా కూర్చొని వుంది. అతను తంటాలు పడి, వనజ దృష్టిలో పడకుండా జాగ్రత్త పడ్డాడు. వనజ కాఫీకి ఆర్డరిచ్చింది

వేణూ, వనజను తీక్షగ గమనిస్తున్నాడు. ఆ సమయంలో-

వనజ, తన మెళ్ళో వున్న మంగళసూత్రాన్ని మెరుపులా తీసేసింది. రెప్పపాటుకాలంలో, తీసేసిన మంగళసూత్రాన్ని బొడ్లో దోపుకుని దాచేసింది!!

అది చూస్తూవున్న వేణూ గడగడ వణికి పోయాడు. ఆదిరి

పోయాడు. ముచ్చెమటలు పట్టినై!

మంగళసూత్రాన్ని దీసి యెందుకు దాచుకుంది? వేణుకు దిగ్భ్రమ కలిగింది. ఆలోచించలేకపోయాడు. వూహించలేక పోయాడు. అలాగే చూస్తూనే వున్నాడు తన భార్యను.

కాఫీ త్రాగిన తరువాత వనజ బయలుదేరింది. బీచ్ చేరుకుంది. ఎవరికోసమో యెదురుచూడడం ప్రారంభించింది. కొన్ని నిముషాలు గడిచాయి.

ఆమె ప్రక్కనే ఒక కారాగింది. అందులోనుండి ఒక వ్యక్తి దిగాడు. అతను, వనజ ఎంతో ఆనందంగా చేతులు పట్టుకు నూపుకుంటూ బయలుదేరారు. ఆ దృశ్యాన్ని చూస్తూన్న వేణు గతుక్కుమన్నాడు.

“నువ్వు ఊఁ...అంటే మనిద్దరమూ వివాహం చేసుకుందాం!” అని చెప్పాడతను.

“పెళ్ళి చేసుకున్న తరువాత, ఈ సంతోషం, ఈ ఆనందం వుండదు, డియర్.” చెప్పింది వనజ.

“ఎందుకని?” అడిగాడతను.

“పెళ్ళి తరువాత నా ముఖం, మీ ముఖం ప్రతి నిముషమూ చూసుకుంటూ వుంటూనే వుంటాం! అలా చూసుకుంటూ వస్తే, కొద్ది కాలానికి పాతపడి పోయి ఆకర్షణను కోల్పోతాము. ఆకర్షణ కోల్పోతే ఇప్పటి ప్రేమా వుండదు, ఆనందమూ వుండదు, సంతోషమూ పొందలేము” అని చెప్పింది వనజ.

వనజ జవాబుకు ఆ వ్యక్తి అచ్చెరువు నొందాడు.

ఆ వ్యక్తి వనజను వివాహమాడడానికి వువ్విళ్ళూరి పోతున్నాడు. ప్రతి యువతీ తను ప్రేమించిన యువకుని వివాహమాడడానికి తహతహలాడి పోతుంది. ప్రియుడు మోసం

చేయకూడదనే, యువతి యెదురుచూస్తూ అతనిని తన వానిగా చేసుకోవడానికి ముందంజ వేస్తుంది. అయితే వనజ వివాహమంటే ఎందుకు వెనుకడుగు వేస్తూ వుంది? ఆ వ్యక్తి బుర్ర కందలేదు.

"ఎందుకని వనజా? పెళ్ళంటే. ఒప్పుకోవడం లేదు?" అడిగాడతను.

"పెళ్ళికి అమ్మా, నాన్నలే గాక బంధుమిత్రులు అడ్డు పడతారని నా నమ్మకం! సమయంకోసం యెదురుచూస్తున్నాను. అవకాశం అందడం లేదు. ఆ అవకాశం అందేవరకు నిన్నూ ఆపాలి, నేనూ ఆగాలి. ఏమంటారు?" అన్నది వనజ.

"నీ ధోరణి అదా!" అనంటూ వనజను తన గుండెలకు అదుముకున్నాడు. ఆ బీచీలో ఆ యిద్దరు సరసా లాడుకున్నారు.

"వంద రూపాయలుంటే యివ్వు ఈశ్వర్!" అనడిగింది వనజ.

"వందేమిటి ఎంతైనా అడుగు యిస్తాను. ఇవేళ రాత్రికి మంచి బిజినెస్! కొన్నివేలు చేతికి అందుతాయి." అనంటూ ఈశ్వర్, వనజకు వందరూపాయల కాగితం అందించాడు.

"ఏమిటో, ఆ బిజినెస్?" అని గోముగా అడుగుతూ వనజ వంద కాగితాన్ని అందుకుని, జాకెట్టులో దూరుముకుంది!

కాసేపు పిచ్చాపాటీ మాట్లాడి బయలు దేరారు. ఇద్దరూ కారులో యెక్కి కూర్చున్నారు.

వేణుకు అయోమయం అయిపోయింది. డబ్బుకోసం మరొకరిని వనజ ప్రేమిస్తుందా? లేక తన మీద యిష్టంలేక ప్రేమిస్తుందా? బిడ్డను కన్న తరువాతకూడా వనజకు యిదేం పాడు

బుద్ధి? మంగళసూత్రం దాచడంలోని ఆంతర్యం, ఈశ్వర్‌ని మోసగించడానికా? అబ్బ!— వనజ యెంతటి నెఱజాణ! ఇపుడు వనజను యేం చేయాలి? ఈశ్వర్‌ని ఏం చేయాలి? తీవ్రంగా ఆలోచించాడు వేణు. చివరకు—

ఈశ్వర్‌ని చంపాలనుకున్నాడు. అవును, నిజమే! తన ప్రియాతి ప్రియమైన భార్యను ఏమీ అనడానికి ధైర్యమూ, మనసూ రావడం లేదు! అందుకే ఈశ్వర్‌ని హత్య చేయడానికి పూనుకున్నాడు.

ఈశ్వర్, వనజను ఆమె యింటికి అల్లంతదూరంలో డ్రాప్ చేసాడు. దిగిన వనజ అటు యిటు బిత్తర చూపులు చూచి, తన బొడ్లో వున్న మంగళసూత్రాన్ని మెళ్లో వేసుకునేసింది. ఇదంతా—

వేణు గమనిస్తూనే వున్నాడు. తన భార్యను ఇవేళ కాకపోయినా రేపైనా శాస్తి చేయవచ్చు. ఈశ్వర్‌ని వదలకూడదు. అదను చూసి ఈశ్వర్‌ని చంపాలి! చంపెయ్యాలి! ఈశ్వర్ ఛస్తే వనజకు ప్రియుడుండడు. ఒకవేళ వనజ క్రొత్త ప్రియుడికి ప్రయత్నిస్తే తను జాగ్రత్త పడాలనుకున్నాడు.

2

ఈశ్వర్‌ని, వేణు నీడలా వెంటాడుతూనే వున్నాడు. ఈశ్వర్ ఒకింటి తాళం తెరచాడు. లోని కెళ్ళాడు. సుమారు అర్థగంటలో బయట వచ్చాడు. ఆశ్చర్యం—

ఈశ్వర్ యిపుడు పోలీసు దుస్తులలో వున్నాడు. వేణు గుండెలు గుబగుబ లాడాయి. ఈశ్వర్ పోలీసతనా? తనిపుడు పోలీసుని చంపాలా? పోలీసుని చంపి తను బ్రతక గలడా? వనజ గుర్తుకు రాగానే—

వేణు యెక్కడలేని ధైర్యం తెచ్చుకున్నాడు. పోలీసైతే నేం, మరెవరైతే నేం, చంపాలి, చంపి తీరాలి. తనజాతి ప్రియుడు లేకుండా చేయాలి. తను భార్యతో హాయిగా వుండాలనుకున్నాడు.

కూడు నీళ్ళు లేకుండా ఈశ్వర్‌ని, వేణు వెన్నాడుతూనే వున్నాడు గానీ సరైన అవకాశం, అదను చిక్కలేదు. రెండవ ఆట వదిలారు.

ఈశ్వర్ — దారిన వెళ్ళే ఒక రిక్షాను ఆపడం, రిక్షాలో వున్న దంపతులను అకారణంగా అవమానించడం గమనించాడు. వేణూ కేమీ అర్థం లేదు.

పోలీసు స్టేషనుకు పదమని చెప్పి ఈశ్వర్ రిక్షా వెనుకనే బయలు దేరాడు. రిక్షా వెనుకనే వెళ్ళే ఈశ్వర్ హఠాత్తుగా ఒక సందులోనికి తప్పుకున్నాడు. కానీ వేణు ఈశ్వర్‌ని వదల దలుచుకోలేను. ఈశ్వర్‌ని అతి జాగ్రత్తగ వేణూ వెంటాడుతున్నాడు.

ఒక ఇంటి ప్రక్కన ఈశ్వర్ ఆగాడు. ఆ యిల్లు కొన్ని వ్యాపారసంస్థలకు అధిపతియైన సీతాపతిది!!

అక్కడ నిలబడి దొంగచూపులు చూచే ఈశ్వర్ మీద తురకడానికి వేణూ ఆయత్త మవుతున్నాడు. గురి చూసుకుంటున్నాడు. స్టడీ అవుతున్నాడు. అప్పుడు—

ఈశ్వర్ ఒక్క క్షణంలో సీతాపతి యింటి ప్రహారీ గోడను పట్టుకుని ఆ వైపుకు దుమికాడు. వేణు సందిగ్ధలో పడిపోయాడు. ఏం చేయాలో అతనికి బోధపడలేదు. ఆ వైపుకు తనూ దుమికితే??

ముందడుగులు రెండేశాడు. దుమికిన తనని చూస్తే ఈశ్వర్ యేం చేస్తాడు? కలియబడతాడా? తన బలం చాలుతుందా?

అతను ఛస్తాడా? తను ఛస్తాడా? వేణూ యిలా ఆలోచిస్తూనే వున్నాడు.

అంతలో ఈశ్వర్ తిరిగి ఈ వైపుకు దుమికేశాడు. అతని కంట బడకుండా వేణూ తప్పుకున్నాడు.

ఈశ్వర్‌ని చంపడానికి వేణు మనసు వురకలు వేస్తూవుంది గానీ — ధైర్యం చాలడం లేదు. చాలా దూరం నడిచారు. అపుడు—

వెనుక ఒక కారు హారు పెడుతూ వస్తూవుంది. ఈశ్వర్ ఆ కారుని గమనిస్తూ నిలబడడం వేణూ గ్రహించాడు.

ఆ కారు ప్రమాదానికి గురి కావడం, అందులోని వ్యక్తి క్షణంలో మరణించడం ఆ యిద్దరూ చూశారు.

పైపెచ్చు—

అపాయానికి గురైన కారుని, కారులోని భాగాలను, ఫోటోలు ఎవరో తీయడమూ చూశారు. విశేషమేమిటంటే,

ఈశ్వర్—ఆ కారుని ఒకరు ఫోటోలు తీయడమే చూశాడు. వేణూ మాత్రం ఇద్దరు ఫోటోలు తీయడమూ చూశాడు. ఆ హడావిడిలో — ఈశ్వర్, వేణూని తప్పుకున్నాడు. ఆ తరువాత వేణూ ఈశ్వర్‌ని కనుగొనలేక యమ యాతన పడి, యింటి ముఖం పట్టాడు.

3

"ఎక్కడి కెళ్ళారండి?" అడిగింది వనజ.

"సినిమాకు" చెప్పాడు వేణూ.

"ఏ సినిమాకు?"

"భార్యకు దొంగప్రియుడు" అని కల్పించి పేరు చెప్పాడు వేణూ. వనజ గతుక్కు మంది. ఏమీ మాట్లాడలేక పోయింది.

వేణూ, తన భార్యను తదేకంగా చూశాడు. ఎందుకనో ఆతనిలో దుఃఖం వుబికింది. ఆపుకోలేక బావురుమంటూ, వనజను వాటేసుకుని, ముద్దులు వర్షం కురిపిస్తూ, "నేనంటే నీకిష్టంలేదా వనజా? చెప్పూ," అని ఆక్రోశించాడు.

"మీరంటే నా కెంతో భక్తి, ప్రేమ వుంది" అని మధురంగా భాషించింది వనజ.

"అయితే వాడెవడు?" అడిగాడు.

"ఎవడు?"

"అదే బీచీలో___"

"వాడెవడైతే మన కేం? మనకు కావల్సింది డబ్బు'"

"నేను సంపాదిస్తున్నానుగా!?"

"చాలడం లేదు."

"అందుకని నీచంగా ప్రవర్తిస్తావా?"

"ఏమిటండీ నీచం, మనకంటె అతినీచాతినీచంగా ప్రవర్తించేవారున్నారు! నాదో లెక్కా?"

"డబ్బుకని, పెళ్ళైన నువ్వు, ఒక తల్లివైన నువ్వు శరీరం అమ్ముకోవడం...ఛీ...ఛీ..." అని అసహ్యించుకున్నాడు.

"నా శరీరం చెడినా, నా మనసు చెడదండీ. నా మనసెప్పుడూ మిమ్ములనే కోరుకుంటుంది. నా మనసెప్పుడూ మిమ్ములను సంతోషపెట్టడానికే కృషి చేస్తుంది" అని వనజ చెప్పింది.

"ఏమిటో వనజా, నీ పోకడ నా కంతు పట్టడంలేదు" చెప్పాడు.

"మానసికంగా మీరే కావాలి. డబ్బుకు, పరోకరు కావాలి. ఇందులో తప్పు కనిపించడం లేదు. ఈ కాలానికి సరిపోయిందనుకుంటాను." అని చెప్పింది.

"నోర్మూయ్!" అన్నాడు.

4

డిటెక్టివ్ యువరాజుకు నమస్కరిస్తూ, యిద్దరు యువతీ, యువకులు కూర్చున్నారు. వారి పేర్లు మాలతి, మోహన్ లు.

“మా నాన్న సీతాపతిగారు చనిపోయారు” అని చెప్పి తలవంచుకున్నాడు మోహన్.

“ఎందుకు, ఎలా చనిపోయారు చెప్పండి” అనడిగాడు యువరాజు.

“ఆక్సిడెంట్ జరిగింది!”

“ఎలా జరిగింది?”

“కారు ముందు చక్రాలలో ఒక చక్రం వూడి పోయింది. ఫలితంగా అపాయానికి గురైయ్యారు, మా నాన్నగారు” అని చెప్పాడు మోహన్.

“కారు రన్నింగ్ లో వున్నపుడు, చక్రం వేరుపడిపోయి అపాయం జరగడం సహజమే! ఇందులో అనుమాన పడడానికి విశేషం లేదు” అని చెప్పాడు యువరాజు.

“ఆ విషయాలనే పోలీసులూ అంటున్నారు. అపాయమనుకునే పోలీసులు తీర్మానించారు.”

“అయితే, మీ అనుమానం?”

“నా అనుమానం యేమీ లేదండీ. ఒక సందేహం కలిగింది. అందుకని మీ దగ్గర కొచ్చాను.” అని చెప్పాడు మోహన్.

“ఊఁ చెప్పండి” యువరాజన్నాడు.

“గతరాత్రి మేమిద్దరమూ సెకండ్ షో సినిమాకు వెళ్ళి రిక్షాలో తిరిగి వస్తూండగా, ఒక పోలీసతను మమ్మల్ని అకారణం అవమానించాడు. మమ్మల్ని తిరుగుబోతులుగా నమోదుచేసి, స్టేషనుకు రావాలన్నాడు. కాని, మధ్యలోనే

అతను తప్పుతున్నాడు. మేము ఇంటికి వెళ్ళి జరిగింది మా నాన్నగారితో చెప్పగా, ఆయన ఉగ్రుడై కారులో పోలీసు స్టేషనుకు బయలుదేరాడు. దారి మధ్యలో యీ ప్రమాదం జరిగింది" చెప్పాడు మోహన్.

యువరాజు సావధానంగా విన్నాడు.

"మిమ్ములను అవమానించాలన్న వుద్దేశముతోనే ఎవరో పోలీసు వేషంలో వచ్చి వుంటారని అనుకుంటున్నాను. ఎందుకు? కారణ మేమిటి? తెల్సుకోవాలి" చెప్పాడు యువరాజు.

"మాకు తెల్సినంతవరకు మా వూహా కందడంలేదు. మీరు పరిశోధించి తెల్సుకుంటే సంతోషిస్తాం అవమానం యెలాగూ అనుభవించాం. పోతే—మా నాన్నగారు అపాయానికి గురైన తోడనే మరణించి వుండాలి. ఆయన ప్రక్కనే, ఇదో, ఇది వుంది" అనంటూ తన జేబులోనుండి — ఒక చిత్రంగల అటను అక్కడ వుంచాడు.

మోడర్న్ అర్ట్‌లో గీచిన చిత్రమది! ఆ చిత్రం సీతా పతిది!

ఆ మోడర్న్ అర్ట్‌ని యువరాజు సునిశితంగా పరీక్షించి చూశాడు. చనిపోయిన సీతాపతి ప్రక్కనే— ఆయన చిత్రమే మోడర్న్ ఆర్ట్‌లో యెందుకుంది? ఆంతర్య మేమిటి?

"చనిపోయిన మా నాన్నగారి ప్రక్కన-ఆయనచిత్రమేంగల యీ పటం యెందుకుంది? అంతుపట్టడంలేదండి. తెల్సుకోవ డానికే మీదగ్గరకొచ్చాం" అని చెప్పాడు మోహన్.

దీర్ఘంగా ఆలోచించాడు యువరాజు. పైన ఫాన్ గిరగిర తిరుగుతూంది. 'స్మాల్ కండిషన్'నుండి కమ్మటివాసన వస్తూ వుంది. నిశ్శబ్దం తాండవమాడింది కాసేపు!

ఫోటోను నిశితంగా పరిశీలించి, "ఇది ఊడూ మంత్రప్రయోగ మని నా అనుమానం" అని చెప్పాడు యువరాజు.

"అంటే?" అందరూ ఆశ్చర్యంగా చూశారు.

"ఊడూ మంత్రశక్తి అతి భయంకరమైనది!"

"నే చెప్పడూ వినలేదు సార్!" చెప్పాడు సూరి. మోహనూ, మాలతీ అలాగే చెప్పారు.

"ఆఫ్రికా కారడవులలో అడవిమనుషులవద్దవున్న మంత్ర శక్తులలో, ఊడూ మంత్రశక్తి గొప్పది. అతి భయానకమైనదికూడా!" అని చెప్పాడు యువరాజు

అందరూ ఆశ్చర్యంగా యువరాజుని చూస్తున్నారు.

"ఈ ఊడూమంత్రశక్తికి పాశ్చాత్యులుకూడా గడగడ వణికిపోతారు. భయపడిపోతున్నారు."

"ఇక్కడ ఊడూమంత్రం నేర్చుకున్నవారెవరైనా వున్నారనా మీ అనుమానం?" అడిగాడు మోహన్. మాలతి బిక్కుబిక్కుమంటూ చూస్తూ వుంది.

"ఏమో? ఆవిషయమె తెల్సుకోవాలి. ఈ ఊడూమంత్రం ఆఫ్రికాలోను, హాథీదీవుల్లోను వున్న నీగ్రోలకే తెల్సు! పైగా ఊడూ మంత్రాన్ని నీగ్రోలుతప్ప మరెవరికీ నేర్పరట!" అని చెప్పాడు యువరాజు.

"ఆ మంత్రప్రయోగమేనంటారా, మా నాన్నగారి మరణం?"

"అవును అని చెప్పడానికిముందు, ఆ ఊడూమంత్రాన్ని గురించి తెల్సుకోవాలి?" అని చెప్పాడు యువరాజు.

"ప్రపంచ ప్రసిద్ధిపొందిన ఊడూ మంత్రాన్ని ఇక్కడ యెవరు నేర్చుకునివచ్చారు? నీగ్రోలు యెలా నేర్పించారు? తెలియడంలేదు."

"ఆ మంత్రప్రయోగం యెలాంటిది?" అనడిగాడు మోహన్.

"మోడర్న్ ఆర్ట్‌లో గీయబడినవ్యక్తి—చనిపోతాడు."

"అంటే చేతబడి లాంటిదా?"

"అనుకోవచ్చు." చెప్పాడు యువరాజు.

సూరి మౌనంగా వింటూ వున్నాడు.

"ఎంత ఖర్చయినా వెనుకాడకండి. మా నాన్నగారిని చంపిన ఆ దోషిని శిక్షిస్తే ఆయన ఆత్మ శాంతించవచ్చు" అనంటూ మోహన్ లేచాడు. మాలతిలేచి నిలబడింది.

"శాయశక్తులా కృషిచేస్తాను" అని చెప్పాడు యువరాజు.

5

యువరాజు తన స్నేహితులకు టెలిఫోన్లుచేయడం ప్రారంభించాడు. "ఊడూమంత్రం నేర్చుకున్నవ్యక్తి ఎవరైనా మీకు తెల్సినవారున్నారా?" అని అడుగుతున్నాడు. ఎవరికీ తెల్సినవారు లేరు 'మాకు తెల్సినవారు లేరు' అనే జవాబొచ్చింది!

"సార్, ఒక్క—సందేహం!" అనడిగాడు సూరి.

"ఏమిటి?"

"మంత్రప్రయోగమైతే యంత్రంమీద పనిచేస్తుందంటారా?" అనడిగాడు సూరి.

"అవును సూరీ! ఆ ఊడూమంత్రం అటువంటిది. దానిని గురించి నాకూ అంత బాగా తెలియదు. మనం పరిశోధించి, ఊడూ మంత్రంగురించి—సీతాపతిగురించి తెల్సుకుందాం" అని చెప్పాడు యువరాజు.

"మోహన్ మాలతీలను అవమానించి, సీతాపతికి కోపం తెప్పించి వున్నారు ద్రోహులు. ఆ కోపంలో సీతాపతి మర

ణించాడు, అపాయం జరిగింది. అపాయాన్ని సృష్టించారా? లేక కాకతాళీయంగా జరిగిందా? తెలుసుకోవాలి" అని చెప్పాడు సూరి.

"తెలుసుకోవాలంటే మోహన్ మాలతీలను అవమానించిన, పోలీసువేషంలోని వ్యక్తిని కనుగొనాలి." చెప్పాడు యువరాజు.

"అవును సార్!" అని చెప్పాడు సూరి.

6

మోహన్, మాలతీలు చెప్పినప్రకారం పోలీసుస్టేషనుకెళ్ళి, ఆ యిద్దరు డిటెక్టివ్‌లు వాకబుచేశారు. రిక్షావాడు దొరికాడు.

రిక్షాఅతను వర్ణించిచెప్పాడు. ఆ వర్ణనబట్టి ఆ వ్యక్తిని పట్టుకోవడం అసాధ్యమని యువరాజు గ్రహించి, రిక్షా అతనిని, వెంటబెట్టుకొని వీధీవీధి, సందుసందూ తిరగడం మొదలుపెట్టారు. నమ్మకమున్నా, లేకపోయినా ప్రయత్నించడం వివేకుల లక్షణం!!

తిరిగితిరిగి వేసారి యిల్లుచేరుకున్నారు యువరాజు, సూరిలు. రిక్షాఅతను, తన అడ్రసుచెప్పి వెళ్ళిపోయాడు.

"ఇలాగైతే మన పరిశోధన ముందుకు సాగదనుకుంటాను సార్!" అన్నాడు సూరి.

"నిరుత్సాహపడకు సూరీ!" అని చెప్పాడు యువరాజు.

"నాకేదో అనుమానంగా వుందిసార్! అంతా మానవబుద్ధిబలమేగానీ, ఊడూ మంత్రమూ కాదు, తంత్రమూ కాదు" అని చెప్పాడు సూరి.

"ఊడూగురించి నీకు తెలియదు సూరీ! ఊడూ మంత్రం నేర్చుకున్నవారు ప్రపంచంలో ఎంత దూరంలో వున్నవారి

నైనా చంపేయవచ్చు. దానికి అంతశక్తి వుంది"

"అంతశక్తి వుందనుకుందాం! మోడర్న్ ఆర్ట్—ఎలా వస్తుంది?" అడిగాడు సూరి.

"మోడర్న్ ఆర్ట్ చనిపోయేవాని ప్రక్కనే వుండవలసిన పనిలేదు. ఆర్ట్, ప్రయోగించినవానిదగ్గరున్నా ఫలితం వుంది." అని చెప్పాడు యువరాజు.

"మనం తెలియనివిషయాన్నిగురించి తర్జనభర్జన పడుతూ ప్రాకులాడడంకంటే, సీతాపతివైపువారిలో దర్యాప్తు ప్రారంభించి విషయాలు సేకరించడం వుచితమనుకుంటాను." సూరన్నాడు.

"నీవన్నదీ, నేనన్నది—మనిద్దరము యిపుడు చేసేది ఒకటే! అవమానంచేసినవ్యక్తి దొరికితే—సీతాపతిని చంపిందెవరు? తెలుస్తుంది."

మరుసటిదినం......

ఆ యిద్దరు డిటెక్టివ్‌లు రిక్షాఅతని యింటికి బయలుదేర బోయారు. అపుడు—

వాళ్ళ ఎంగేజ్‌మెంట్‌లో, యువరాజు ఒకసభలో వుపన్యసించవలసివుంది. సూరి గుర్తుచేశాడు.

యువరాజు దీర్ఘంగా ఆలోచించాడు. రిక్షావానితో ప్రయత్నిస్తేనే కేసు ముందుకుపోతుంది. లేనిచో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే వుంటుంది!

"సూరీ నీవెళ్ళి వుపన్యసించు" అని చెప్పాడు యువరాజు. సూరి గతుక్కుమన్నాడు.

"సార్, నాకలవాటు లేదుసార్" నసిగాడు.

"నేర్చుకో. ఒకకేసు దర్యాప్తు మూలంగా నేవెళ్ళాలని—నాబదులు నువ్వు మాట్లాడుతావని చెప్తాను. దేనినిగురించి

మాట్లాడాలో తెలుసా?" అనడిగాడు యువరాజు.

"అఁ తెల్సుసార్, 'కట్నపిశాచం' గురించి మాట్లాడాలి" అన్నాడు సూరి.

"కట్నపిశాచంగురించి మాట్లాడడానికి నేనొక కాగితం మీద గుర్తించివున్నాను. అది చూడు, లేదా—నీ స్వంతంగా ప్రసంగాన్ని తయారుచేసుకో." అని చెప్పాడు యువరాజు.

"అలాగే సార్!"

"నేను రిక్షా అతనిని వెంటేసుకుని పని ప్రారంభిస్తాను. వీలుపడితే, సభాస్థలానికి వస్తాను" అంటూ యువరాజు వెళ్ళాడు.

యువరాజు వెళ్ళగనే, సూరి ఆలోచనలో మునిగాడు. కట్నపిశాచాన్ని గురించి ప్రసంగించాలి! తనొక డిటెక్టివ్ కు అసిస్టెంట్!-ఈ కట్నాలు కొన్ని కుటుంబాలను, కొందరి జీవితాలను నిలువునా హరించుకుతింటున్నాయి. కట్నం పెరగడానికి కారణం ఏమిటి? ఆడపిల్లలకు కట్నం, ఓ సమస్యగా తయారై - జటిలమై కూర్చోవడానికిగల కారణమేమిటి? కట్నములు యెందుకు యిలా ధరలు పెరిగాయి? సూరి ఆలోచిస్తున్నాడు. అతని ఆలోచనలు ప్రసంగపాఠాన్ని తయారుచేస్తున్నవి.

ఉపన్యాసధోరణిని మనసులో నాలుగైదుసార్లు మననం చేసుకున్నాడు. ప్రసంగపాఠాన్ని తన మనోఫలకంమీద భద్రపరుచున్నాడు. బయలుదేరాడు. సభాస్థలికి చేరుకున్నాడు. అక్కడ—

మహిళలు యెక్కువగా వున్నారు. సుమారు ఆరువందల మంది వుంటారు. కొందరు యువతీయువకులూ వున్నారు. పెద్దలు, పిన్నలు—కిటకిట లాడుతున్నారు.

అలవాటులేని సూరికి వారంకరిని చూడగానే జంకు యేర్పడింది. ధైర్యం తెచ్చుకున్నాడు. కొన్ని మహిళా సంఘాలు యేకమై కట్నాలను తీవ్రంగా ఖండిస్తూ వుపన్యాసాలు యిస్తున్నవి

గొప్పగొప్పవారిని ఆహ్వానిస్తున్నారు. అందులో యువరాజు ఒకడు. ఆ వేళ యువరాజు లేనికారణంగా, సూరివంతు అయింది.

సూరికిముందు యెవరో యిద్దరు మాట్లాడారు. సూరిని వుపన్యసించవలసినదిగా అధ్యక్షుడు కోరాడు. సూరి గొంతుని సవరించుకుంటూ, ప్రసంగపాఠాన్ని గుర్తుకు తెచ్చుకుంటూ మైక్ ముందు నిలబడ్డాడు.

7

ఇంటినుండి బయలుదేరిన యువరాజు రిక్షా అతనింటికెళ్ళాడు. ఆశ్చర్యం—అక్కడ—

రిక్షాఅతను మంచంమీద పడుకునివున్నవాడు_పడుకుని వున్నట్టుగానే మరణించి వున్నాడు. పైగా—

ఆ రిక్షాఅతనిప్రక్కన మోడర్న్ ఆర్ట్‌లో అతని చిత్రాన్ని చిత్రీకరించివుంది !!

యువరాజు గుండెలు ధమధమ కొట్టుకున్నై! మోడర్న్ ఆర్ట్ పటాన్ని చూస్తూ యువరాజు నిశ్చేష్టుడైపోయి నిలబడ్డాడు.

రిక్షాఅతని శవాన్ని పరీక్ష చేశాడు. త్రాచుపాము కాటుకి మరణించి వుండాలనీ యువరాజు గ్రహించాడు.

ఊదూ మంత్రాన్ని ప్రయోగిస్తే, ఏరూపంలోనైనావచ్చి హతమార్చుతుంది. ఆ మంత్రానికి అంతశక్తివుంది. వచ్చిన రూపాన్ని వదులుకుని మాయమైపోతుంది.

రిక్షావాడు ఊదూమంత్రానికి బలిఅయిపోయాడు. ఊదూ

మంత్రాన్ని రిక్షాఅతనిమీద ఎందుకు ప్రేరేపించారు?

రిక్షాఅతని తప్పిదం ఏమిటి? ఆలోచించాడు యువరాజు. అవమానించినతనిని తనకు చూపించవద్దని జాగ్రత్తపడి, ఊదూ మంత్రంతో రిక్షాఅతనిని చంపారా? అవునని, యువరాజు సమాధానపడ్డాడు.

రిక్షాఅతని బంధుమిత్రులు శవంచుట్టూచేరి ఏడుస్తున్నారు. అతని కాలిమీద రెండు గాట్లుకనబడినవి. పాముకాటేనని యువరాజు ధృవపరుచుకున్నాడు. కాటేసినపాము అప్పటి కప్పుడే మాయమైపోయి వుంటుంది. ఊదూమంత్రప్రభావం అటువంటిది!

ద్రోహులెవరో వున్నఆకాస్తా ఆధారాన్ని తుడిచేశారు. ఏమీతోచక బయలుదేరాడు యువరాజు. సభాస్థలికి చేరుకోడానికి నడుస్తున్నాడు. అల్లంతదూరంలో, సూరి మైక్ ముందు నిలబడివుండడం, సూరిఉపన్యాసం లీలగ వినబడుతూ వుండడం గమనించి, అడుగులు గబగబ వేశాడు.

8

వుపన్యాసంకాగానే యువరాజు, సూరీలు ఆ దగ్గరలో వున్న ఒక హోటల్లోకెళ్ళి కాఫీకి ఆర్డరిచ్చారు. అపుడు—

ముగ్గురుస్త్రీలు. కిలకిలనవ్వుతూ ఆయిద్దరి డిటెక్టివ్‌లను చుట్టేశారు.

“డిటెక్టివ్‌లు హంతకులను, దోషులను, దుండగులను పట్టుకోవడం గొప్పకాదు. ఒక సమస్యను, కారణభూతమైన హేతువును వెలికితీసి నిరూపించడం చాలా గొప్పవిషయమండి!” అని అన్నది ఆమె. ఆమెపేరు నీరజ.

“చాలా థాంక్స్” అన్నాడు సూరి.

"ప్రస్తుతం సమాజంలో నిండివున్న కల్మషంమూలంగా కట్నాలు గగనానికంటడం సహేతుకంగా వుంది" అందామె. ఆమె పేరు వాసంతి.

యువరాజు నవ్వాడు.

"మీరన్నట్టు స్త్రీ బలహీనకలయి పదుగురిలో విలువను పోగొట్టుకుంటూంది!" అని చెప్పిందామె. ఆమె పేరు వనజ. వేణూభార్య !! తలొంచుకునుంది

కాఫీలు వచ్చాయి. అందరూ త్రాగారు. కట్నాలగురించి పిచ్చాపాటి మాట్లాడుకున్నారు.

"మాది పెద్ద ఎస్టేటు. మీరొకరోజు పార్టీకి రావాలి" ఆహ్వానించింది నీరజ.

యువరాజు, సూరిలు తలలూడించారు.

"మాయింటికీ రావాలి" పిలిచింది వాసంతి.

"సరే" నన్నారు.

నీరజ, వాసంతి వెళ్ళబోతూ, వనజను రమ్మని పిలిచారు. రానంది. వాళ్ళు వెళ్ళిపోయారు.

వనజ తదేకంగా యువరాజుని, సూరిని చూసింది.

"ఏమిటి" అడిగాడు యువరాజు.

"ఏమీలేదండి. మాఆయన రావాలి" అని చెప్పింది. ఇంతలో—

వేణూ పాపను చంకనేసుకుని వచ్చాడు.

తనభర్తకు యువరాజుని, సూరిని పరిచయం చేసింది.

"ఏదైనా కేసుని దర్యాప్తుచేస్తున్నారా?" అనడిగాడు వేణూ.

"అవునండి. సీతాపతి మరణంగురించిదర్యాప్తుచేస్తున్నాం" అని చెప్పాడు సూరి.

వేణూ గుండెలు గబగబ కొట్టుకున్నై!

యువరాజు, సూరీలు వెళ్ళిపోయారు.

వేణూ, వనజతో వదుస్తున్నాడన్నమాటేగానీ ఆతని మన సులో మనసులేదు.

యువరాజుకు నిజంచెప్పాలా? వద్దా? మానసికంగా ఘర్షణపడ్డ వేణూ—చివరకు విషయాన్ని చెప్పదలుచు కున్నాడు.

9

"రిక్షాఅతను చనిపోయి వున్నాడు" అనిచెప్పాడు యువ రాజు సూరికి.

"ఎందుకు?"

"ఊడూ మంత్రప్రయోగం! పాముకాటుతో ప్రాణం తీసి వుంది!" చెప్పాడు యువరాజు. సూరి ఆశ్చర్యచకితు డయ్యాడు.

"పాము కనిపించిందా?" అడిగాడు సూరి.

"కనబడదు సూరీ! ఏరూపంతోనైనావచ్చి, హతమార్చిన పిదప మాయమైపోతుంది!" అన్నాడు యువరాజు.

"ఏమిటోసార్! ఈ ఊడూమంత్రం నాకు నమ్మకంలేదు. కానీ మీరు చెప్పేదిచూస్తే నమ్మకలసి వస్తూవుంది!" అనన్నాడు సూరి.

అపుడు టెలిఫోన్ మ్రోగింది.

రిసీవ్ చేసుకున్నాడు యువరాజు.

టెలిఫోన్‌లో, వేణూ ఈశ్వర్‌ని వెంటాడడం పూర్తి పాఠం చెప్పేశాడు. పైగా, ఈశ్వర్ పోలీస్‌వేషం మార్చు కున్న, యింటిఅడ్రసూ చెప్పేశాడు.

"మీరెందుకు ఈశ్వర్‌ని వెంటాడారు?" అడిగాడు యువ

రాజు. భార్యనుగురించి మొదట చెప్పడానికి చాలా సిగ్గు పడ్డాడు. కానీ సిగ్గువొదిలి విషయాలన్నీ చెప్పాడు.

యువరాజ్ ఫోన్ క్రిందపెట్టి, "సూరి, కమాన్!" అని చెప్పి బయలుదేరాడు. ఇంపాలా కారెక్కారు. కారు బయలుదేరింది.

"విషయం ఏమిటి?" అడిగాడు సూరి.

"ఈశ్వర్ అనే అతను, మోహనూ, మాలతీలను అనుమానించి వున్నాడు. పైగా, సీతాపతి ఇంట్లోకి వెళ్ళివున్నాడు. ఎందుకెళ్ళాడు యీశ్వర్? కారుచక్రం తీయడానికా? లేక సీతాపతి మోడర్న్ ఆర్ట్ కారులో పెట్టడానికా?"

"విచిత్రంగా వుందిసార్!"

"అఁ విచిత్రంగానే వుంది. ఆక్సిడెంట్ అయినకారుని, ఇద్దరు వేరువేరు వ్యక్తులు ఫోటోలు తీసివున్నారు ఎందుకు?" అని యువరాజు ఆలోచిస్తున్నాడు.

సూరికి అయోమయం అయింది. "సార్, వీటివెనుక ఏదో గూడుపుఠాణీ వుంటుందనుకుంటున్నాను సార్" అని చెప్పాడు సూరి.

"వుండొచ్చు. ఏమిటా గూడుపుఠాణి? ఊదూ మంత్ర ప్రయోగమేమిటి?" అని, "విషయాలన్నీ తెలుస్కోవాలి" అంటూ యువరాజు కారుని వేగంగా పోనిచ్చాడు.

10

కారాగింది. ఆ కారు నెంబర్ ప్లేటుమీద, అచ్చతెలుగులో చక్కటి అక్షరాలతో ఎ పి. జి. అని వ్రాసివుంది. ఎ. పి. జి. తెలుగు అక్షరాలక్రింద తెలుగు అంకెలలో 26739, అని వున్నవి. తెలుగు అక్షరాలక్రింద, తెలుగు అంకెలకారు, ఆంధ్రప్రదేశ్‌లో అదొక్కటే కారుంది. ఇండి

యూనిఫారమ్ అనోన్క్ట్ చేసే కారుంది. ఆ కారు —

డిటెక్టివ్ యువరాజుది!! యువరాజు కారు నెంబరు ఎ. పి జి. 26739. అచ్చంగ తెలుగు అక్షరాలు, తెలుగు అంకెలు !!

ఆగిన కారునుండి యువరాజు, సూరీలు దిగారు. ఈశ్వర్ యింటివైపు నడిచారు తలుపు మూసివుంది. తట్టారు. సమాధానం రాలేదు. నెట్టారు. తలుపులు తెరుచుకున్నాయి. ఆశ్చర్యం—

ఈశ్వర్ అజీవంగా పడివున్నాడు! పైగా—

మోడర్న్ ఆర్ట్‌లో ఈశ్వర్ చిత్రం భయంకరంగా ఆ యిద్దరి డిటెక్టివ్‌లకు దర్శనమిచ్చింది. డిటెక్టివ్ లిరువురూ నిర్విణ్ణులై నిలబడిపోయారు.

తమకు ఆమాకీ తెలుపగల వారందరినీ ఊడూ మంత్రంతో యెందుకు చంపేస్తున్నారు? కారణం ఏమిటి? ఆ డిటెక్టివ్‌లు తికమకపడిపోయారు.

ఈశ్వర్ శవాన్ని, మోడర్న్ ఆర్ట్‌లోవున్న ఈశ్వర్ బొమ్మను పరీక్షించారు. వెంటనే—

ఇన్‌స్పెక్టర్ ధనార్జనరావుకు ఫోన్ చేశారు. ధనార్జనరావు హడావిడిగ వచ్చిచేరాడు.

శవాన్ని చూస్తూ, "ఎవరితను?" అడిగాడు ధనార్జనరావు.

"అది తెల్సుకోవడానికే మిమ్ములను పిలిపించింది!" చెప్పాడు యువరాజు.

"మీ పరిశోధన విశేషమేమిటో?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"సీతాపతి మరణం......"

"సీతాపతి అక్సిడెంట్ అయి మరణించాడు. హత్య కాదు! మేమెప్పుడో తీర్మానించాము" చెప్పాడు ధనార్జనరావు.

"అలాగే మేమూ అనుకున్నాం."

"మరి?"

ఈశ్వర్ మోడర్న్ ఆర్ట్‌ని చూపిస్తూ, "ఈ బొమ్మలాగ సీతాపతిది ఒకటి ఆయన శవం ప్రక్కనుంది!"

"ఆ బొమ్మకు, మరణానికి పొత్తేమిటి?"

"ఆ బొమ్మే మరణానికి కారణం" చెప్పాడు సూరి.

"నా కర్థం కావడం లేదు. వివరంగా చెప్పండి" అడిగాడు భార్గవరావు.

"ఊ. డూ మంత్రప్రయోగం!"

"మంత్రాలకు చింతకాయలు రాలవండీ కాలంలో!"

"అయితే, ఇతను చావడానికి కారణం?"

"పోస్టుమార్టంలో తేలుతుంది" అన్నాడు ఇన్‌స్పెక్టర్ గర్వంగా.

11

ఎ. పి. జి. 26733 ఇంపాలా కారు వేణూ ఇంటిముం దాగింది. యువరాజ్, సూరీలు దిగి యింటి తలుపు సమీపించారు. లోపల—

పాప ఏడుపు గీఁ పెట్టి యేడుస్తూంది! గుక్కపట్టి యేడుస్తూంది! యువరాజు తలుపు తట్టాడు. సమాధానం రాలేదు. సూరి తలుపు నెట్టాడు. తలుపు తెరుచుకుంది. అంతే—

ఆ యిద్దరు డిటెక్టివ్‌లు అక్కడి దృశ్యాన్ని చూడలేక అదిరిపడిపోయారు. భయపడి పోయారు. గడగడ వణికి పోయారు.

వేణూ వనజ కౌగిలిలో, వనజ వేణూ కౌగిలిలో అతి

భయంకరంగా నోరు, కళ్ళు తెరిచి ప్రాణాలు కోల్పోయి వున్నారు.

వేణూ, వనజ సమీపంలో మోడర్న్ ఆర్ట్ వుంది!! ఆ ఆర్ట్ చిత్రీకరణలో వేణూ, వనజ లిద్దరూ వున్నారు!!

అల్లంత దూరంలో పాప గిలగిల తన్నుకుంటూ, యేడుస్తూంది! సూరి పాపను ఎత్తుకొని సముదాయించాడు. ఓదార్చాడు, బుజ్జగించాడు.

ఆ దారుణాన్ని చూడలేక పోయాడు యువరాజ్! ఆ దంపతు లిరువురు ఒకరి కౌగిలిలో ఒకరు అసువులు బాసి వున్నారు.

వారిద్దరిని చిత్రించ బడిన మోడర్న్ ఆర్ట్ వెక్కిరిస్తూ వుంది!

(సశేషం)

— —

క్లాస్ చాల అల్లరిగా యుండి. అప్పుడు ఉపాధ్యాయుడు పిల్లలతో: ఈ క్లాస్ ఎప్పుడైన సైలెన్స్‌గా యుంటుం దాంట్రా?" అని ప్రశ్నించాడు.

వెంటనే ఓ అబ్బాయిలేచి, "స్కూల్ విడిచిపెట్టిన తర్వాత సార్" అని టక్కున సమాధానమిచ్చాడు.

—జి. వాసుదేవ్. బొంబాయి.

నమ్మలేని నగ్నసత్యాలు

—యుగంధరశ్రీ

10. విలపించిన విగ్రహం

మే నెల పదమూడవ తారీఖు, 1957 వ సంవత్సరం. యిటాలీ దేశంలో ఒక చిన్న గ్రామం 'రోకో కోర్నెట్టా' లో అతి విచిత్రమైన సంఘటన జరిగింది. ఆ గ్రామంలో చర్చి బయట ఉన్న ఒక పెద్ద 'మడోనా' ఆడ రాయి విగ్రహం అకస్మాత్తుగా ఏడ్వటం ప్రారంభించింది. కళ్ళల్లో నుండి చుక్కలు చుక్కలుగా నీళ్ళు కారటం చూసారు ప్రజలు. అందరూ ఆశ్చర్యపోయారు. రాయి విగ్రహంలో ప్రాణంలేని ఆ కళ్ళల్లోనుండి నీరెలా వస్తూందో అర్థం కాలేదు. కొందరు భయపడిపోయారు. మరికొందరు దేవతకు ఏదో అపచారం జరిగి వుంటుందనీ, ఆగ్రహించి విలపిస్తోందని భ్రమించి, పూజలు పునస్కారాలు ప్రారంభించారు

ఈ 'నమ్మలేని వార్త' అలా అలా పట్టణంలోకి ప్రాకిపోయింది. ఏదో 'దైవ మహత్తు' అని సరిపెట్టుకొనే మన సత్వం గ్రామస్థుల్లో లాగా పట్టణవాసులకు సాధారణంగా ఉండదు. ఎవరో 'యింజీనియస్' ఏదో 'ట్రిక్' చేసి యిలా అందర్నీ 'ఫూల్స్' చేస్తున్నాడని కొందరు ఆరోపించారు. ఎక్కడో మారుమూలవున్న 'రోకో కోర్నెట్టా' గ్రామం అందరి దృష్టిన పడి మంచి పేరు తెచ్చుకోవాలనే ఆశతో ఎవరో ఏదో సాధనాన్ని విగ్రహం లోపల అమర్చి అలా

నీళ్ళు తెప్పిస్తుండవచ్చని మరి కొందరన్నారు.

ఎవరు ఏమనుకుంటేం ఏం?

పదిమంది కలిసి ఆ విచిత్రం ఏమిటో, అందులోని రహస్యం ఏమిటో కనుక్కుందామని బయల్దేరారు. వీళ్ళముందే ఓరోజు ఆ విగ్రహం ఏడ్వటం ప్రారంభించింది. చూస్తూండగానే మనిషి ఏడుస్తున్నట్టు కళ్ళలోనుండి నీళ్ళు కారుతూంటే వచ్చిన 'విజిటర్స్' అందరూ ఆశ్చర్యపోయారు. ఆరోజు అలా ఒకగంటసేపు ధారాపాతంగా ఏడుస్తూనే ఉంది.

ఒకరు కారుతూన్న కన్నీటిని ఒక 'టెస్టుట్యూబ్' లో పట్టుకెళ్ళి పోలీసుల కిచ్చారు. రోమ్‌లో పోలీస్ పాథలాజికల్ లాబరేటరీలోని సైంటిస్టులు పోలీసులందించిన ఆ నీటిని రెండుగంటలు పరీక్ష చేసి మరో ఆశ్చర్యకరమైన వార్తను బయటపెట్టారు. ఆ నీళ్ళు అచ్చం కళ్ళనీళ్ళేనట! అంటే సాధారణంగా మనం దుఃఖిస్తే మన కళ్ళల్లో తిరిగే నీళ్ళు ఏయే రసాయనాల మిశ్రమంతో కనిపిస్తాయో అచ్చం అవే గుణాలతో ఉందట.

కొయ్యబొమ్మ ఏడ్వటమా? అదీ మనిషి కన్నీళ్ళతో?

ఈ వింత సంఘటన ప్రపంచంలో మేధావులందరికీ ఆశ్చర్యాన్ని కల్గించింది. జవాబులేని ప్రశ్న వేసింది. తగిన జవాబు కోసం, అసలు రహస్యంకోసం అందరూ తహతహలాడారు.

ఇటలీ ప్రభుత్వంకూడా 1960లో ఒక 'చర్చి కమీషన్'ను నియమించింది. వాళ్ళు ఆ గ్రామానికి వెళ్ళి ఆ కొయ్య విగ్రహాన్ని బయటకు తీసి ఎక్స్-రే తీయించి పరీక్షించారు. లోపల ఏమీ లేదు. కొయ్యలో ఉండవలసిన మామూలు 'స్ట్రక్చర్' తప్పితే లోపల ఎలాంటి రహస్యాలుగాని, సాధనాలుగాని కనిపించలేదు.

బయటకు తీసిన కొయ్యబొమ్మను 'డబుల్-లాక్‌డ్' గ్లాస్

కేస్‌లో అమర్చి బయట తాళం వేసారు. గోడకు ఆనించకుండా ఎటూ ఏ విధమైన సపోర్ట్ లేకుండా, గదిమధ్యన ఎత్తులో నిలబెట్టి, పటిష్టమైన అలారం - సిగ్నల్ ఏర్పాటు చేసి, గది నంతటినీ 'ఫ్లడ్ లైట్లు' తో పట్టపగలులా మార్చేసారు. దానికి తోడు సిద్ధంగా 'సినీ - కేమెరా' ను కూడా ఏర్పాటు చేసారు. యిద్దరు పోలీసు ఆఫీసర్లు కాపాలగా నిలబడ్డారు. ఎవరైనా ట్రిక్ చేస్తున్నా, కొయ్య బొమ్మతో ఆడుకుంటున్నా వాళ్ళ ప్రయత్నాలు యిక సాగవు. ఈ కట్టుబాట్లు మాని బెదిరి పారిపోవాలని 'కమీషన్' ఆలోచన.

నిజమే నేమో. ఆరు రోజులు మౌనంగా గడిచిపోయాయి. ఆ కొయ్యబొమ్మనుండి ఒక్క చుక్కయినా రాలేదు. ఆఫీసర్లు కాస్త కుదుట బడ్డారు.

పదవరోజు సగం గడిచిపోయింది. అకస్మాత్తుగా పోలీసాఫీసర్లు చూస్తూండగనే మెల్లగా మళ్ళీ ఆ చూపుల్లేని కళ్ళల్లో నీళ్ళు తిరగసాగాయి. వెంటనే ఆఫీసర్లు సినీ-కమేరాను ఆన్ చేసారు విగ్రహం ఆరోజు రెండు గంటలు ఏడుస్తూనే వుంది. అది అబద్ధం కాదని నిరూపించడానికి తగిన ఆధారంగా సినీ కెమెరా ప్రక్కనే వుంది. అంతటితో అసలు అర్థం తెలుసుకోలేని 'కమీషన్' వెనక్కు వచ్చేసింది?

ఆ బొమ్మను చేసిన కొయ్యలో ఎక్కడో తడి వుంటుందనీ, అప్పుడప్పుడు అలా కళ్ళనీళ్ళలా బయట పడుతోందేమోనని కొందరు వాదించినా పరీక్షల్లో ఆ కొయ్య 300 సంవత్సరాల నాటిదనీ, బాగా ఎండిపోయిందనీ, తేమకు ఆస్కారమే లేదని బయట పడింది.

అయితే ఏమిటీ 'మిస్టరీ?'

ఆ తరువాత ఎంతోమంది స్వయంగా ఆ గ్రామానికి వచ్చి ఆ కొయ్యబొమ్మను దాని అద్భుతాన్ని కళ్ళారా తిలకించి

వెళ్ళడం ప్రారంభించారు.

ఈ మిస్టరీ తేల్చిన వ్యక్తికిగానీ, సంస్థకుగానీ మంచి బహుమానంకూడా ప్రభుత్వం ప్రకటించింది.

గత తొమ్మిది సంవత్సరాలుగా దాని రహస్యం కనుక్కోవడానికి శతవిధాలుగా ప్రయత్నాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ మధ్యకాలంలో విగ్రహం కనీసం రెండు వందలసార్లయినా పిలపించి ఉంటుంది.

కొయ్య విగ్రహంలో ఈ కన్నీళ్ళు ఎక్కడినుండి ఎలా వస్తోంది? మానవాతీతమైన అద్భుతం కాదంటే మరి దీన్నేమనాలి?

మానవుల్లో ఒక చెడ్డగుణం వుంది.

ఓ నమ్మలేని నగ్నసత్యాన్ని చెప్పి, అదేం కట్టుకథ కాదనీ, కళ్ళముందు ఆ నిజాన్ని ఆధారాలతో సహా చూపెట్టినా కొందరు నమ్మరు. అన్నీ తెలిసీ, ఓడిపోతున్నామని తెలిసీ సమర్థించుకోడానికి మార్గాలు అన్వేషిస్తూ వుంటారు. అంతవరకు యిది 'మిస్టరీ' గానే వుండిపోతుంది.

అన్నట్టు మీలో ఎవరైనా పైదానికి సరియైన సమాధానం చెప్పగలరా?

* * *

11. ప్రాణం కాపాడిన పాప

రాత్రి పది గంటలు. చిన్నచిన్న చినుకులతో ప్రారంభమైన వాన అంతకంతకు ఉధృతమై కుండపోతగా కురవడం ప్రారంభించింది. దానికి తోడు ఈదురుగాలి. డాక్టర్ యూల్

రిచ్‌కు కారు నడపడం కష్టమైపోయింది. అనవసర శ్రమ పడటం కన్నా ఆ రాత్రికి అక్కడే ఆగటం మంచిదనిపించింది. పెన్సిల్వేనియాకు యింకా 20 మైళ్ళు వుంది; ఈ రాత్రిలో, వానలో ఎలా వెళ్ళడం?

దగ్గరలోనే కనిపించిన "గెస్టుహౌస్" లో ఒక గది తీసుకొని విశ్రమించాడు. నడిరాత్రి, ఒంటిగంట దాటింది. ఎవరో "డాక్టర్! డాక్టర్!" అని పిలుస్తూ తలుపు తట్టిన చప్పుడు వినిపించడంతో డాక్టర్ ఉలిక్కిపడి లేచాడు. ఎవరో అమ్మాయి. ఎనిమిదేళ్ళుంటాయి. "డాక్టర్!...నాన్నకు... నాన్నకు మందు కావాలి డాక్టర్!" అంటూ ఏడ్వటం మొదలు పెట్టింది. పాపం వాళ్ళ నాన్నకు జ్వరంగా వుందేమో! డాక్టర్ గబగబా దుస్తులు మార్చుకొని, అమ్మాయిని సముదాయించి మెడిసిన్ ఛెస్టు తీసుకొని ఆ పాప వెంట వెళ్ళాడు.

ఆ పాప డాక్టర్‌ను ఆ ప్రక్కనే ఉన్న ఒక చిన్న యింట్లోకి తీసుకెళ్ళింది. లోపల ఓ గదిలో పడకమీద నడివయస్కుడు అచేతనంగా పడివున్నాడు. కాలిపోతున్న జ్వరం. ఉదయం వరకు యిలాగే మందూ మాకూ లేకుండా ఉంటే ప్రాణాలు పోతాయి.

డాక్టర్ వెంటనే పని ప్రారంభించాడు. తన దగ్గరే ఉన్న మందులు, యింజక్షన్లు యిచ్చాడు. వంటింట్లో తనే స్వయంగా స్టవ్ వెలిగించి వేన్నీళ్ళు కాసి రోగికి సపర్యలు చేశాడు. ఆ రాత్రంతా కంటికి రెప్పలా కాపాడుతూ కూర్చొన్నాడు. ఆ పసిపాపకూడా హాల్లో ఉన్న కుర్చీలో కూర్చొని అలాగే కన్ను మూసింది. ఉదయం తెలతెలవారుతుండగా రోగి మెల్లగా కళ్ళు తెరిచాడు. అప్పటికే ఎంతో కోలుకున్నాడు. డాక్టరు ఆయనతో తన వివరాలన్నీ చెప్పి, "థాంక్ గాడ్!

ప్రాణాలతో బయట పడ్డారు. మీ అమ్మాయి సాహసం గొప్పది. అంత రాత్రివేళకూడా భయపడక నన్ను తీసుకొచ్చింది. పాపికలేకపోతే మీరు నిజంగా వెలుగు చూడక పోయేవారు" అన్నాడు

ఆ మాటలు వృద్ధుడికి వింతగా తోచాయేమో, విషాదంగా నవ్వాడు. గద్గదస్వరంతో, "తమాషా చేస్తున్నారా డాక్టర్? ఎవరి అమ్మాయి మీరంటున్నది? నాకున్న ఒక్కగా నొక్క బంగారు తల్లిని ఆ మహమ్మారి కలరా ఎప్పుడో పొట్టన పెట్టుకుంది. నా కెవ్వరూ లేరు. డాక్టర్...నా కెవ్వరూ లేరు...అదిగో నా తల్లి! నన్ను చూసి ఎలా ఏడుస్తోందో చూడండి!" అంటూ గోడకు వ్రేలాడుతున్న ఫోటో చూపించి బావురు మన్నాడు.

ఫోటోను చూడ్డంతోటే డాక్టర్ అవాక్కయిపోయాడు. క్షణంపాటు ఏమీ తోచలేదు. ఫోటోలో వున్న అమ్మాయే రాత్రి తనను యిక్కడకు తీసుకొచ్చింది! మరైతే ఈ ముసలాయన అంటున్నదేమిటి? డాక్టర్ హాల్లోకి పరుగెత్తాడు. ఆ అమ్మాయి పడుకున్న సోఫా కాళీగా వుంది! యిల్లంతా వెదికాడు. వేసిన తలుపులు వేసినట్లే ఉన్నాయి. ఎక్కడా లేదు. మరేమైనట్లు? ఏమిటీ మిస్టరీ?

అయితే ఆ అమ్మాయి తనను యిక్కడకు తీసుకురాలేదా? తనే స్వయంగా యిక్కడకు ఎలా వస్తాడు?

భ్రమపడటానికి తనేం పసివాడు కాదు. ఎన్నో డిగ్రీలు పొందిన డాక్టర్. స్టేట్ మెడికల్ డిపార్టుమెంట్ డైరెక్టర్.

రాత్రి ఆ అమ్మాయి నిద్రలేపడం. యిక్కడకు తీసుకు రావడం అన్నీ జరిగినవే. అయితే యిప్పుడేమనుకోవాలి.

ఎప్పుడో చనిపోయిన కూతురు తన తండ్రిప్రాణాలు

కాపాడుకోటానికి దెయ్యమై తిరిగి వచ్చిందా? అయితే చిన్న పిల్లలుకూడా దెయ్యాలవుతారా?

డాక్టర్‌కు సమస్య తేలలేదు.

దెయ్యాలు లేవని ఒకప్పుడు వాదించే తను యిప్పుడు ఉంటాయని నమ్మవలసి వచ్చింది.

ఈ వింత అనుభవాన్ని తన డైరీలో వ్రాసుకొని భద్ర పరచుకున్నాడు డాక్టర్ యుల్‌రిచ్.

* * *

12. మారువేషాలు

ఎందరో వింత వింత వేషాలువేసి ప్రజల్ని మోసం చేస్తుం టారు. దినపత్రికల్లో మనం అప్పుడప్పుడు చూస్తూనే వుం టాము. ఒక్కసారి ఇన్‌స్పెక్టర్ల వేషంలో వెళ్ళి హోటళ్ళలో తినిరావటం, సినిమాలు ఫ్రీగా చూసిరావటం, సారాదుకా ణాల్లో ప్రవేశించి, బెదిరించి డబ్బు తీసుకెళ్ళటం లాంటివి మనం వింటూనే వుంటాము. కొందరు నేరం ఏమీ చేయక పోయినా మారువేషాల్లో తిరుగుతూంటారు. అయితే యిలా ఎందుకు చేస్తున్నట్టు?

ఒకసారి లైసెన్సులేకుండా, ఎలాంటి మెడికల్ డిగ్రీలు లేకుండానే విలియమ్ మైక్లాడ్ అనే అతను ఏడు సంవత్స రాలు న్యూయార్క్, న్యూజెర్సీ, కనెక్టికట్ పట్టణాలలోని తొమ్మిది పెద్ద హాస్పిటల్లో 'రెసిడెంట్ ఫిజిసియన్'గా పనిచేసి మంచి పేరు పొందాడు. ఆ ఏడు సంవత్సరాలలోనూ అతనొక్కడే 34 ఆపరేషన్లు జయప్రదంగా ముగించాడు. చివ రకు ఓసారి ఏదో కంపెనీకి డబ్బు కట్టకపోవడంతో యిన్నా

రిమ్సుకంపెనీ అతని పుట్టుపూర్వోత్తరాలు తిరగవేయగా, అతను కేవలం కాలేజీలో కూడా చదువుకోలేదని బయట పడింది. దొంగ సర్టిఫికేట్లతో, ఫోర్జరీ చేసిన నకిలీ సంతకాలతో ఎలాగో ఉద్యోగం సంపాదించుకోగలిగాడు. ఈ వివరాలను ప్రజలకు తెలియచేస్తూ, 'న్యూయార్క్ అకాడమీ ఆఫ్ మెడిసన్' కూడా అతని ధైర్యానికి, పవిత్రానికి, ఆపరేషన్లలో అతను తీసుకున్న మెళకువలకు అభినందించకుండా ఉండలేకపోయింది.

ఎర్నెస్టు హిమింగ్వే ప్రఖ్యాత ఫ్రెంచి రచయిత. ఆయన రచనలను ప్రపంచం అంతా ఆదరిస్తుంది. క్రొత్తపుస్తకం వెలువడిన మొదటి వారంలోనే వేలకొద్దీ కాపీలు అమ్ముడై పోతాయి. ఓసారి 'ఫార్ హూమ్ ది బెల్ టోల్స్' అనే నవల విడుదలయింది. ఆనాడు 'ఫిలాడెల్ఫియా' లో ఒకతను తనే హెమింగ్వేనని చెప్పుకొని ఆరోజంతా అందరికీ 'ఆటోగ్రాఫ్స్' [పుస్తకాలమీద, కాగితాల మీద సంతకాలు చేయటం] యిస్తూ విందుచేసుకున్నాడట. హిమ్మింగ్వే అసలు పేరులో "హిమింగ్వే" అని ఉంటుంది. అయితే నకిలీ మనిషి "హిమ్మింగ్వే" అని చేయడంతో అతను అసలు మనిషి కాదని నెల తరువాత బయట పడింది!

అయితే వీటన్నిటిని మించిన మరో అద్భుతమైన విషయం 1945 డిసెంబర్‌లో బయటపడింది.

కాలిఫోర్నియా జిల్లాలో ఆక్స్‌నార్డ్ టౌన్‌లో, మేడమ్ లూసీ హైక్స్ బాగా పేరుపడ్డ ధనవంతురాలు. ఆమె అందానికి రెండవ క్లియోపాత్రలా, కాలిఫోర్నియా జిల్లా మొత్తానికే "క్వీన్ ఆఫ్ రెడ్ లైట్" అని పేరుపొందింది. ఆమె ఏ వార్త అందించినా, ఎక్కడ ప్రసంగించినా ఆ వివరాలన్నీ స్థానిక వార్తాపత్రికలు ప్రముఖంగా ప్రకటించేవి.

చివరకు అప్పటి ప్రెసిడెంట్ ఫ్రాంక్లిన్ డి. రూజ్వెల్టు చనిపోయినప్పుడు, ఆ సందర్భంలో సానుభూతి తెలియజేసిన పురప్రముఖులలో ఈమె కూడా ఒకతిగా పరిగణింపబడింది. ఆ సంవత్సరం డిసెంబర్లో అకస్మాత్తుగా, ఆ జిల్లాలో ఏదో ఒక భయంకరమైన అంటువ్యాధి విరివిగా వ్యాపించింది. చాలామంది చనిపోయారు ప్రభుత్వం 'మెడికల్ చెకప్' ప్రారంభించింది. డాక్టర్లు పౌరులందరినీ విడివిడిగా పరీక్షించి చూడసాగారు. మేడమ్ లూసీనికూడా పరీక్షించాలని డాక్టర్లు ప్రయత్నించారు. లూసీ అందుకు ఒప్పుకోలేదు. డాక్టర్లు పట్టుబట్టారు. మేడమ్ లూసీ బెదిరించినాకూడా లెక్కచేయక ప్రభుత్వాదేశం ప్రకారం ఆవిడ శరీరారోగ్యాన్నీ పరీక్షించనిదే వీళ్ళు వీలులేదని బలవంతంమీద ఆమెను పరీక్షించారు.

ఆ తరువాత డాక్టర్లు అందించిన రిపోర్టు ఒక్క ఆక్స్నార్డ సిటీనే కాక, మొత్తం అమెరికానే ఆశ్చర్యంలో ముంచెత్తింది.

యిరవై ఏళ్ళుగా, అపరక్లియోపాత్రాలా, 'క్వీన్ ఆఫ్ రెడ్ లైట్' అని పేరుపొందిన మేడమ్ లూసీ హైక్స్ నిజానికి ఒక మగవాడని బయట పడింది.

* * *

ఒకడు: మీ ఆఫీసులో ఏమన్నా ఖాళీలున్నాయా సార్?

మేనేజరు: వరండా ఖాళీగా ఉంది.

—'జోకర్', విశాఖపట్నం.

'అపరాధ పరిశోధన' పాఠకులకు బహుళ ప్రయోజనకారి!

ఉచిత చందా పథకం

(డిపాజిట్టు రు. 60-00 లు మాత్రమే)

'ఉచిత చందా పథకం' లో మీ సొమ్ముకు పూర్తి భద్రత వుండటమే గాకుండా, ఇంచుమించు ప్రతి సంవత్సరము మీకు రు. 30-00 లు విలువగల పుస్తకాలు ఉచితంగా లభిస్తాయి.

1. 'ఉచిత చందా పథకం'లో చేరడానికి మీరు చేయవలసింధల్లా రు 60-00 డిపాజిట్టు చెల్లించడమే.

2 మీరు డిపాజిట్టు కట్టిన తర్వాత నెలనుండి మీకు 'అపరాధ పరిశోధన' సచిత్ర డిటెక్టివ్ మాసపత్రిక ఉచితంగా పంపడం ప్రారంభించబడుతుంది.

3. అంతేగాక, ప్రతిసంవత్సరము చందాదారులకు ఇవ్వబడే బహుమతి పుస్తకాలు తప్పనిసరిగా మీకూ లభిస్తాయి. వీటన్నిటికీ పోస్టు ఖర్చులు మేమే భరిస్తాము.

4 ఈ డిపాజిట్టుపై మీకు వడ్డీ చెల్లించబడదు. డిపాజిట్టు విరమించుకున్ననాడు తిరిగి మీకు మొత్తం సొమ్ము రు. 60-00 లు అందజేయబడుతుంది.

5. డిపాజిట్టు విరమించుకోవడానికి కనీస కాలపరిమితి ఒక సంవత్సరము. ఆలోపుగానే డిపాజిట్టుసొమ్ము వాపసు కోరితే, అంతవరకు మీకు పంపిన పుస్తకాల ఖరీదు, పోస్టేజి డిపాజిట్టులో మినహాయించుకో బడుతుంది.

6. మీరు తిరిగి డిపాజిట్టు విరమించుకోవడానికి ఒక నెల ముందుగా మాకు ఆ విషయం తెలియజేయాలి.

7. యీ స్కీమ్‌లో, కొద్ది కాపీలు తెప్పించుకునే చిన్న చిన్న ఏజెంట్లుకూడా పాల్గొనవచ్చును.

జాక్‌పాట్
ఏ.వి. మోహన్రావ్

సీరియల్

[జరిగినకథ: రత్నమాల, రాజారావు భార్య. ఆమె ఒక రోజు విలువైన వజ్రాలు, నగలు తీసుకొని ఎవరితోనో లేచి పోయింది. విశాఖపట్నంలో మకాం పెట్టినట్లు మృణాళినీ దేవిద్వారా తెలుసుకున్న రాజారావు, ఆమెను పట్టుకోవ టానికి డిటెక్టివ్ సుధాకర్‌ను నియమించాడు. సుధాకర్ విశాఖపట్నం వెళ్ళేసరికి మృణాళినీ హత్యచేయబడింది. రత్నమాల, మరోవ్యక్తి సుధాకర్‌ను కలుసుకున్నారు.

—ఇకచదవండి.]

(గత సంచిక తరువాయి)

"మీకు మృణాళినీదేవి తెలుసా ?" ప్రశ్నించాడు సుధాకర్.

"ఆమెను గురించి విన్నాను. రాజారావుకామె పాత ప్రియు రాలని వినికిడి." చెప్పింది రత్నమాల.

"రాత్రి ఆమెను దారుణంగా హత్యచేశారు. నన్నామె కలుసుకోమని కోరింది. ఎన్నో విషయాలు నాకు చెప్పాలని ఆదుర్దాపడింది. నాకు సమాచారం అందకుండా ఎవరో ముందే జాగ్రత్తపడ్డారు. వాళ్ళెవరో ముందు తెల్సుకోవాలి." సుధాకర్ రత్నమాల ముఖకవళికలను జాగ్రత్తగా పరిశీ లించాడు. ఆమెలో ఏవిధమైన తొట్రుపాటు కనిపించలేదు.

"పాపం! హత్య ఎవరుచేసివుంటారు?" ఎదురుప్రశ్న వేసింది సానుభూతిసూచించే కంఠస్వరంతో.

"హంతకులు నాచేతినుండి తప్పించుకోవడం అసాధ్యం. వారిని ఉరికంభ మెక్కించనిదే నేనీవూరినుండి నిష్క్ర మించదలుచుకోలేదు."

"ఒకవేళ యీహత్య రాజారావే చేయించాడేమో?" తన అనుమానాన్ని వ్యక్తంచేసింది రత్నమాల.

"అసంభవం! మద్రాసునుంచి మీరు పారిపోయివచ్చాక మిమ్మల్ని యీవూళ్ళో చూసి, వెంటనే ఆవిషయాన్ని టెలిఫోన్ ద్వారా మృణాళినీదేవి రాజారావుకందజేసింది. అంత సాయంచేసిన షాతస్నేహితురాల్ని హత్యచేయించే అవసరం ఆయనకేముంటుంది?"

"రాజారావుసంగతి తెలియక మీరలామాట్లాడుతున్నారు. అతను తేనెపూసినకత్తి. డబ్బుకోసం ఎంత నీచానికైనా పాల్పడేవాడు. ఎంతఘోరం చేసేందుకైనా వెనుదీయడు. నన్ను స్వర్గసుఖాల్లో ముంచితేలుస్తానని మాటిచ్చి పెళ్ళాడాడు. మోజుతీరగానే యింటికిపట్టిన బూజులా నన్ను దులిపి దూరంగా పారేశాడు. ఆస్తి హారించుకొనిపోయి తలనిండా అప్పుల్లో మునిగివున్నాడు. అందులోంచి బైటపడేందుకు యిప్పుడు మరో అడ్డదారిపట్టాడు. అందులో పావుగా మిమ్మల్ని ఉపయోగించుకోనేందుకు చూస్తున్నాడు" ఆమెమాటల్లో కసి, క్రోధం, ప్రస్ఫుటంగా ధ్వనించాయి.

"ఏమిటా అడ్డదారి?" అడిగాడు సుధాకర్.

"దాదాపు ఇరవైసంవత్సరాలనాటిమాట. విశాఖపట్నంలోని స్టేట్ బ్యాంక్ లోని యాభైలక్షల రూపాయల విలువచేసే బంగారాన్ని ఇద్దరు దొంగలు దోచుకున్నారు. అక్కడ్నించి దాన్ని తీసుకొనిపోయి ఒక రహస్యస్థావరంలో పెట్టి తిరిగివచ్చారు. వారిద్దరిలో ఒకతను ప్రమాదవశాత్తు మరణించాడు. రెండవవ్యక్తిని హత్యానేరంక్రింద పట్టుకొని ఆజన్మ ఖైదుశిక్ష విధించారు. పదహారుసంవత్సరాలకాలం చెరసాలలో

ప్రగ్గి వెం.కటసుకవచ్చిన ఆవ్యక్తిని రాజారావు చేరదీశాడు. వారిద్దరూ కలసి యిప్పుడా బంగారాన్ని తిరిగిపొందేందుకు ప్రయాసపడుతున్నారు. వాళ్ళమీద పైపోటీగా నేనూ యింకొందరి వ్యక్తులతో కలసి ప్రయత్నం చేస్తున్నాను. అందుకే నేను యీవూరొచ్చాను. నన్నేదో విధంగా జైలుకు పంపించి తన అడ్డంకు తొలగించుకోవాలని చూస్తున్నాడు రాజారావు. నామీద అనవసరంగా నగలు అపహరించానన్న నేరంమోపి, అవి తిరిగిసాధించాలనే నెపంతో మిమ్మల్ని నియోగించాడు." చెప్తూ ఆగింది రత్నమాల.

"ఏదో కట్టుకథలల్లి నన్ను తప్పుదారి పట్టించాలని ప్రయత్నంచెయ్యకండి. ఇరవైసంవత్సరాలనాడు దొంగతనం జరిగిందని చెప్తున్నారు. ఆ దొంగల్లో బ్రతికివున్నతనికి పదహారుసంవత్సరాల జైలుశిక్ష పడింది. అంటే, అతను విడుదలయి నాలుగు సంవత్సరాలవుతూంది. ఇన్నేళ్ళు తాను దాచుకొన్న డబ్బును ప్రయత్నించకుండా ఎందుకుండిపోయాడు. అతనికి తిండి ఎవరు పెడుతున్నారు? యీ విశాలవిశ్వంలో మరెవ్వరూ లేక రాజారావుదగ్గరకే ఎందుకు రావలసివచ్చింది. ఆ దొంగపేరేమిటి? నాయీ సందేహాలన్నింటినీ నివృత్తిచెయ్యాలి." కుర్చీలో సర్దుకునికూర్చుంటూ చెప్పాడు సుధాకర్.

"వివరాలన్నీ చెప్పేందుకుముందు మీరు రాజారావు కేసులో పనిచెయ్యటం మానుకొని మాతో చేతులుకలపాలి. రాజారావు యిచ్చేదానికన్నా ఎక్కువ ముట్టచెప్తాం. ఆలోచించుకోండి!"

"ఎక్కువంటే ఎంత?"

"ఆ యాభైలక్షలు మాచేతికిదొరికితే నాలుగోవంతు అంటే పన్నెండులక్షలా యాభైవేలరూపాయలు మీకిస్తాము."

"దొరక్కుంటే......"

"మాకూ లేదు! మీకూ లేదు!" అంది రత్నమాల నవ్వుతూ.

అంటే జాక్‌పాట్ టికెట్ లాంటిదన్నమాట. మూడు రేసుల్లో మనం అనుకున్న గుర్రాలు గెలిస్తే లక్ష లొస్తుంది. లేకుంటే మనం కట్టినడబ్బు పోతూందన్నమాట!" అన్నాడు సుధాకర్.

"ఇక్కడ మీరు కష్టపడేదికూడా ఏమీవుండదు. మాతోడుగా ఉండి, మాకు అవసరమైన సహాయం చెయ్యవల్సివుంటుంది."

"అంటే అవసరమైనప్పుడు హత్యలుకూడా నాతో చేయిస్తారా?"

"అవన్నీ మాట్లాడుకునేముందు మీరు మాలో చేరేందుకు ఒప్పుకోవాలి. ఆతర్వాత మనమందరంకలసి మాట్లాడుకోవచ్చు" చెప్పింది రత్నమాల, జారిపోయిన పైటకొంగును తిరిగి సర్దుకోనే ప్రయత్నం చేయకుండానే.

"మీరు...అంటే మొత్తం ఎంతమంది?"

"మేము మొత్తం ముగ్గురంమాత్రమే!"

"నేను ఆలోచించుకోనేందుకు కొంత వ్యవధి కావాలి. నానిర్ణయాన్ని మీకు రేపు ఉదయం తెలియజేస్తాను!" చెప్పాడు సుధాకర్.

"నేను ఫోన్ చేస్తాను. అప్పుడుచెప్పండి మీనిర్ణయం" అంటూ లేచింది రత్నమాల.

"ఆల్ రైట్!" అన్నాడు సుధాకర్.

4

సుధాకర్ రివాల్వర్ తీసి పాంటుజేబులో వేసుకున్నాడు. గదితలుపుమూసి తాళంపెట్టి, లిఫ్ట్‌లో క్రిందికిదిగాడు. టాక్సీ చేసుకొని, రాజారావును కలుసుకునేందుకు, అతను బసచేసిన హోటల్ పేరుచెప్పి పోనిమ్మన్నాడు.

అతని మస్తిష్కంలో ఆలోచనలు మృణాళిదేవి హత్య చుట్టూ తిరుగసారంభించాయి. ఎన్నో ముఖ్యమైన విషయాలు తెలుసుకునే అవకాశం అతనికి లేకుండా ఎవరో ముందుగానే జాగ్రత్తపడి ఆమెను దారుణంగా హత్యచేశారు. హంతకు డెవరయివుంటాడు? సుధాకర్ కణతలు ఎడతెగని ఆలోచన లతో వేడెక్కిపోయాయి.

టాక్సీ హోటల్ పోర్టికోలో ఆగింది. దిగి తిన్నగా కౌంటర్ముందుకు నడిచాడుసుధాకర్. రాజారావు నాలుగు వందలామూడు నంబరుగదిలో బసచేశాడని రిసెప్షనిస్టు చెప్పింది. లిఫ్ట్ఎక్కి మూడోఅంతస్తులోవున్న రాజారావు గదిని వెతుక్కుంటూ వెళ్ళాడు. గదితలుపులు మూసివున్నాయి. తలుపులవద్ద చెవిపెట్టివిన్నాడు. ఎవరో యిద్దరువ్యక్తులు మాట్లాడుతున్నట్లు లీలగా వినిపించింది. క్షణంఆగి, చిన్నగా తలుపులుతట్టాడు. వెంటనే తెరచుకోలేదు, రెండు నిముషాల తర్వాత తెరచుకున్నాయి. గళ్ళపైజామా, షర్టు వేసుకొన్న రాజారావు నోట్లోవున్న సిగరెట్ చేతిలోకి తీసుకుని, "ఓ! మీరా! రండి!" అంటూ సుధాకర్ని ఆహ్వానించాడు. సుధాకర్ గదిలోకి చేరాడు. చుట్టూ చూశాడు. ఎవ్వరూ కనుపించ లేదు. విస్తుపోయాడు. అంతకుముందే ఇద్దరువ్యక్తులు చర్చించు కొంటున్నట్లు అతను విన్నవిషయం తలపుకొచ్చింది.

"కూర్చోండి!" సోఫాచూపిస్తూ చెప్పాడు రాజారావు.

సుధాకర్ కూర్చుని, సిగరెట్ వెలిగించుకుంటూ "ఏమి టిలా మీరు హడావుడిగా కరుగెత్తుకొచ్చారు?" అడిగాడు

"మీ వెంట నేనుకూడావుంటే మీపని సులభంగా పూర్తవుతుందని అభిప్రాయపడ్డాను. అందుకే వచ్చాను."

"ఎప్పుడొచ్చారు?" తెలియనట్లే అడిగాడు.

"నిన్నరాత్రి వచ్చాను."

"అంటే, మృణాళినీదేవి హత్యకాకముందే యీవూరు చేరుకున్నారా? లేక హత్యజరిగాక వచ్చారా?"

"ఏమిటి! మృణాళినిని హత్యచేశారా? ఎవరు? ఎప్పుడు?" ఆత్రంగా అడిగాడు రాజారావు, కుర్చీలో ముందుకు వంగి కూర్చుని.

"ఎవరుచేసిందీ యింకా తెలీలేదు! ఎప్పుడుచేసిందిమాత్రం చెప్పగలను. రాత్రి ఎనిమిదిగంటలప్రాంతంలో జరిగివుంటుంది."

"నాన్సెన్స్! నేను యీవూరు రాగానే రాత్రి ఫోన్‌లో ఆమెతో మాట్లాడాను. అప్పుడు గంట 8-20 అయివుంటుంది. ఎనిమిదింటికే హత్యకాబడితే ఆమె నాతో ఎలామాట్లాడింది." తన అనుమానాన్ని వ్యక్తపరిచాడు రాజారావు.

"మీరు మాట్లాడింది మృణాళినీదేవితో కాదు! ఆమెతో మాట్లాడేందుకు ఆమె ఆహ్వానాన్ని పురస్కరించుకొని అక్కడికి వెళ్ళినవాతో" చెప్పాడు సుధాకర్.

"నిజంగానా?"

"ముమ్మాటికీ నిజం!"

"అయితే, ఆమెను ఎవరు హత్యచేశారు?" ఆయోమయంగా చూస్తూ అడిగాడు రాజారావు.

"ఆమెను హత్యచేయవలసిన అవసరం అందరికన్నా ఎక్కువ మీకేవుందని యిక్కడ పోలీసులు అనుమానపడు తున్నట్లు నాకు సమాచారం అందింది. ముందు నన్ను వూరు పంపి, నావెనుకనే పరుగెత్తుకొచ్చి, ఆమెను ఎట్టుచప్పుడు కాకుండా హత్యచేసి, ఆనేరాన్ని నామీద త్రోసివేద్దామని ప్లానువేశారు. అవునా?" కోపంగా అడిగాడు సుధాకర్.

"మిస్టర్ సుధాకర్! మీకేమన్నా మతిపోయిందా? ఆమె నాకు చిరపరచితురాలు. పారిపోయివచ్చిన నా భార్యకుని

తెలుసుకోని నాకు చెప్పింది. అంత సాయం చేసిన అబలను హత్యచేసేనంత నీచుణ్ణని అనుకున్నారా?" అడిగాడు రాజారావు

"తోటిభాగస్తుణ్ణి హత్యచేసి అతని ఆస్తిపాస్తులు కాజేయ గలిగిన పెద్దమనుషులకు యిదొక పెద్దవిషయమని నేను అభిప్రాయపడటంలేదు!" చెప్పాడు సుధాకర్.

"నాగురించి మీ కెవరో అవాకులు, చెవాకులు నూరిపోసి నట్లుంది. నా గతచరిత్ర గురించి మీకు అనవసరం. మీకు నేను డబ్బిచ్చాను. నేచెప్పినపని చెయ్యటం మీ కర్తవ్యం" గంభీరంగా చూస్తూ చెప్పాడు రాజారావు.

"మీరు చెప్పినపని చేసేముందు, నా అనుమానాలు తీర్చి, నన్ను ఒప్పించాల్సిన అగత్యంకూడా మీకుంది" కోపంగా చూస్తూ అన్నాడు సుధాకర్.

"మీ కిచ్చిన డబ్బుగాక మరో ఐదువేలు యిస్తాను. రత్నమాల యీవూరువిడిచి వెంటనే వెళ్ళిపోయేట్లు చూడండి. కావాలంటే ఆమెకు కూడా పదివేలు యిస్తాను."

"నావల్ల కాదు. స్వతంత్ర భారతదేశంలో, సర్వస్వతంత్రాలు కలిగిన ఆమె, ఏవూళ్ళోనైనా వుండేందుకు హక్కుంది. కాదనటానికి మీ రెవ్వరు పొమ్మని చెప్పటానికి నాకేం పట్టింది?"

"నాడబ్బుతిని, నాకు ద్రోహంచేస్తున్నారన్నమాట!"

"అనవసరంగా మాటలు పెంచడం మర్యాదస్తుల లక్షణం కాదు. మీరిచ్చిన డబ్బుకు యిప్పుడే చెక్కురాసిస్తాను." అంటూ గబగబ కోటుజేబులోంచి చెక్కుబుక్కుతీసి, రాజారావు పేర వెయ్యిరూపాయలకు చెక్కురాసి, అందించాడు సుధాకర్.

రాజారావు చెక్ అందుకొంటూ "మిస్టర్ సుధాకర్! చాలా సంతోషం. నీవెంతత్వరగా మీరీవూరు వదలివెళ్ళటం మంచిది. వెళ్ళనని మొండికేస్తే మిమ్మల్ని బలవంతంగా పంపించాల్సివుంటుంది." బెదరిస్తున్నట్లు చెప్పాడు రాజారావు

"చూద్దాం! ఎవరు ఎవర్ని ఎక్కడకుపంపిస్తారో?" అంటూ లేచాడు సుధాకర్, అక్కడ్నుంచి నిష్క్రమించేందుకు సన్నద్ధమౌతూ.

హోటల్ వెలుపల తనకోసం వేచివున్న టాక్సీ ఎక్కి తిన్నగా, తను మకాంచేసిన హోటల్ కు బయలుదేరాడు. పదినిముషాలు ప్రయాణంచేసినతర్వాత టాక్సీ హోటల్ చేరింది. టాక్సీదిగి డబ్బులిచ్చి గదికేసినడిచాడు. తలుపులు తెరచి, లోనికి ప్రవేశించాడు. బట్టలు మార్చుకుని, దినపత్రిక చదివేందుకుప్రక్రమించాడు. అతనికి తెలీకుండానే కాలం ముందుకు పరుగెత్తిపోయింది కడుపులో ప్రేవులు అల్లరిచెయ్యటంతో, ఆకలవుతున్నట్లు గుర్తించాడు. క్రిందికి వెళ్ళి భోజనం చేసిరావాలనే తలంపుతో షర్టువేసుకొని బటన్లు పెట్టుకుంటూండగా, ఎవరో తలుపుతట్టిన శబ్దమైంది. ఎవరయివుంటారా, అని ఆలోచిస్తూ రివాల్వరు ఎడంచేత్తో వెనగ్గా పెట్టుకుని, కుడిచేత్తో తలుపుగొళ్ళెం తీసిచూశాడు. నల్లగా పొడుగ్గా యూనిఫారంలోవున్న ఒకపోలీసు ఆఫీసరు ప్రత్యక్షమైనాడు.

"గుడ్ మార్నింగ్! మిస్టర్ సుధాకర్ అంటే మీరేనా?" అడిగాడు పోలీస్ ఇన్స్పెక్టర్.

"అవును. దయచేసి లోనికొచ్చి కూర్చోండి!" అంటూ ప్రక్కకు తప్పుకున్నాడు సుధాకర్. పోలీస్ ఇన్స్పెక్టర్ వెళ్ళి సోఫాలోకూర్చుని చేతిలోవున్న చిన్నలాఠీని టీపాయిపైన పెట్టాడు. కళ్ళజోడుతీసి జేబురుమాలుతో మెరుగుపెడుతూ గదిచుట్టూ కలయచూశాడు. సుధాకర్ రివాల్వరును టేబుల్

సొరుగులో పెట్టి, తిన్నగావచ్చి ఇన్‌స్పెక్టర్ కెదురుగా కూర్చుని, "ఏమిటిలా నన్ను వెతుక్కుంటూ వచ్చారు?" అడిగాడు.

"మీరీవూరుకు రావటం ఇదే మొదటిపర్యాయమా?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"అవును!" తలూపుతూ చెప్పాడు సుధాకర్.

"ఇక్కడెలావుంది?" కుశలప్రశ్నలు వేయటం ప్రారంభించాడు ఇన్‌స్పెక్టర్.

"చాలా బావుంది. కానీ సాయంత్రంపూట లైఫ్ చాలా డల్‌గావుంటూంది. చెప్పుకోదగ్గ వినోదాలుకాని, మానసిక ఉల్లాసాలుగానీ లేకపోవటం విచారించదగ్గవిషయం!"

"ఈవూళ్ళో చూడగలసినవి చాలావున్నాయి. హిందుస్థాన్‌షిప్‌యార్డు, డాల్ఫిన్స్‌నోస్ కొండలు, సింహాచలం వున్న దేవాలయం, కాల్టెక్సుకంపెనీవాళ్ళ రిఫైనరీలాంటి వెన్నో వున్నాయి."

"ఐ. సీ. మీకు యిక్కడెవరూ బంధువులుగానీ, స్నేహితులుగానీ లేరా?" కుర్చీలో కొంచెం ముందుకుజరిగికూర్చుని నింపాదిగా ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్.

"లేరు." చెప్పాడు సుధాకర్.

"మీకు ప్రయివేటు డిటెక్టివ్ లైసెన్సు వుందనుకుంటాను. ఏదన్నా కేసులో పనిచేస్తూ, ఆపనిమీద యీవూరు వచ్చారా?"

"లేదు! వూరకే చూసిపోదామని వచ్చాను."

"నిన్నరాత్రి యీవూళ్ళో ఒకదారుణమైన హత్యజరిగింది. దానివివరాలు యీపాటికి పేపర్లో మీరుచూసివుంటారనుకుంటాను. హత్యకాబడిన మృణాళినీదేవిని బహుశా మీకు

తెలిసివుండవచ్చుననుకొంటాను!" అంటూ ప్రశ్నార్థకంగా చూశాడు సుధాకర్ కళ్ళల్లోకి ఇన్‌స్పెక్టర్.

"ఆమె ఎవరో నాకూ తెలీదు! పేపర్లో చదివాను! అంతే!"

"బాగా ఆలోచించుకొని చెప్పండి! మీ గదినుండి ఆమె యింటికి నిన్న సాయంత్రం టెలిఫోన్ కనెక్షను ఇచ్చినట్లు తనకు బాగా గుర్తుందని, యీ హోటల్లో వున్న రిసెప్షనిస్టు చెప్పింది. ఒకవేళ ఆమె పొరపాటుపడి వుంటుందేమోనని అనుకున్నాను. కానీ ఆమె మీరు, మృణాళినీదేవితో మాట్లాడిన మాటలుకూడా విన్నదట. మిమ్మల్ని తనయింటికి రమ్మనీ, మీతో చాలా విషయాలు చెప్పాలనీ, ఎనిమిదిగంటల ప్రాంతంలో రావల్సిందనీ కోరిందట. అందుకు తగినట్లు ఎనిమిది ప్రాంతంలో మీరు గదితలుపులు తాళంవేసి వెలుపలకు వెళ్ళటంకూడా కౌంటర్‌లోవున్న రిసెప్షనిస్టు చూశానని చెప్తోంది. పోస్టుమార్టమ్ రిపోర్టునుబట్టి ఆమె ఏడుగంటలనలభై నిముషాలకు హత్యకాబడింది. మీరు వెళ్ళి ఆమెను హత్య చేసయినావుండివుండొచ్చు, లేక మీరు వెళ్ళేసరికి ఆమె హత్యకాబడి వుండవచ్చు. ఇందులో ఏదినిజమో తెలుసుకోనేందుకు ప్రయత్నిస్తున్నాను" అన్నాడు ఇన్‌స్పెక్టర్.

"మీ ప్రశ్న నన్ను కాస్త తికమక పెట్టినమాట నిజం. నాకు మృణాళినీదేవి తెలీదు. ఆమెతో నాకు పరిచయం లేదు. కానీ నిన్న ఆమెకు ఫోన్ చేశాను. ఆమె స్నేహితుడు, రాజారావని పెద్ద నౌకా వ్యాపారి. నేను యిక్కడకు వచ్చేముందు కలసి, యిక్కడకు చేరాక ఓమారు ఫోన్ చేసి ఆమె క్షేమసమాచారాలు కనుక్కోమని కోరాడు" తను చెప్పిన మాటల్ని సర్దుకుంటూ చెప్పాడు సుధాకర్.

"మీరు ఎన్నిగంటలకు ఫోన్ చేశారు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"దాదాపు అయిదు గంటలా నలభై నిమిషాల ప్రాంతంలో వచ్చుంటాను. మృణాలినీదేవి ఫోన్ ఎత్తగానే, ఆమె స్నేహితుడి విషయం చెప్పాను. తను సౌఖ్యంగా వున్నానని తిరిగి వెళ్ళేముందు వీలయితే ఒకమారు కలుసుకోమని చెప్పింది అలాగేనని చెప్పాను. అంతకుమించి నాకేమీ తెలీదు. నేను ఆమెను కలుసుకొనేందుకు వెళ్ళలేదు" చెప్పిందే తిరిగి చెప్పాడు సుధాకర్.

జేబురుమాలుతో కళ్ళజోడు శుభ్రంగా తుడిచి పెట్టుకున్నాడు ఇన్స్పెక్టర్. జేబురుమాలు మడతపెట్టి పాంటు జేబులోకి తోస్తూ, "యిందులో ఏదో పెద్ద రహస్యం యిమిడి వున్నట్టుంది. రాత్రి మీరు ఎక్కడికి వెళ్ళారో చెప్పగలరా?" అడిగాడు ఇన్స్పెక్టర్.

"హోటల్ ప్యారడైజ్ లో అందాల భరిణ 'మిస్ లావణ్య' నృత్యం చూచేందుకు వెళ్ళాను. సాక్ష్యం కావాలా?" కోపంగా అడిగాడు సుధాకర్.

"ఐయామ్ సారీ! నన్ను అపార్థం చేసుకున్నట్టున్నారు. మీరు మంచివాళ్ళనీ, మర్యాదస్తులనీ నాకు తెలుసు. మీ మాటమీద నాకు నమ్మకముంది, కానీ యిది హత్యకు సంబంధించిన గొడవ కావటంవల్ల మిమ్మల్ని ఇలా బాధ పెట్టవలసి వచ్చింది. చాలా థాంక్స్ అవసరమయితే మళ్ళీ కలుసుకుంటాను" అంటూ కుర్చీలోంచి లేచాడు ఇన్స్పెక్టర్.

"ఆల్ రైట్! అలాగే!!" సుధాకర్ కూడా అతన్ని సాగనంపేందుకు లేచి నిలబడ్డాడు.

"మృణాలినీదేవి స్నేహితుడు ఎవరో రాజారావు, మిమ్మల్ని ఆమె క్షేమసమాచారాలు తెలుసుకోమని చెప్పాడని కదూ అన్నారు. అతని అడ్రసు తెలుసా?"

"నేను వచ్చిన రెండు గంటల తర్వాతే అతను యిక్కడి కొచ్చాడు. యిక్కడే ఏదో హోటల్లో వున్నానని చెప్పాడు" అన్నాడు సుధాకర్.

"థాంక్స్! అతన్ని నేను కలుసుకొని మాట్లాడుతాను" అంటూ వడివడిగా ద్వారానికేసి నడిచాడు. తలుపులు మూసుకునేందుకు సుధాకర్ అతన్ని అనుసరించాడు.

"మిస్టర్ సుధాకర్! అయామ్ సారీ! నా పేరు మూర్తి! మీరింకా ఎన్నిరోజులు యిక్కడ వుండదలచుకొన్నారు" ప్రశ్నించాడు ఇన్‌స్పెక్టర్

"చెప్పలేను. మరో పదిరోజులన్నా వుండొచ్చు. లేదా, యిప్పుడే వెళ్ళిపోవచ్చు."

"మీరో వారంరోజుల పాటు యిక్కడుండాలి" అన్నాడు. అతను చెప్పేతీరులో అధికారం నిండుకొంది. ఇన్‌స్పెక్టర్ అభిప్రాయాన్ని అర్థంచేసుకొన్న సుధాకర్ "అలాగే! వుంటాను!" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ బూట్లు చప్పుడు చేసుకుంటూ చకచక ముందుకు వెళ్ళాడు. ఆవులిస్తే ప్రేవులు లెక్కించగల మూర్తి నేర్పును తలచుకొని విస్తుపోయాడు సుధాకర్. ఆ పగలంతా అక్కడక్కడా కాలుకాలిన పిల్లిలా తిరిగాడు. చిన్నదనుకొన్న కేసు కాస్తా ఊబిలా తయారయింది. అందులో అడుగు పెట్టడమా, మానడమా అని ఆలోచించాడు. చివరకు రంగంలో దూకేందుకే నిశ్చయించుకొన్నాడు.

5

మసక చీకట్లు ఆకాశాన్ని ముసురుకున్నాయి. ప్రశాంతంగా వున్న వాతావరణం నిముషంలో భీభత్సంగా తయారయింది. గాలిలో తేమ ఎక్కువై జిల్లుమని వీచసాగింది.

వర్షం వచ్చే సూచనలు కనుపించసాగాయి. టాక్సీ నొకదాన్ని పిలిచి, ఎక్కి కూర్చుని "హోటల్ ప్యారడైజ్ కు పోనివ్," అని చెప్పి సీట్లో వెనక్కు వ్రాలి కూర్చున్నాడు సుధాకర్. పాంటు జేబులో పెట్టుకున్న రివాల్వరును ఓమారు తడుముకుని తృప్తి జెందాడు. ఇరవై నిముషాలు ప్రయాణించిన టాక్సీ ప్యారడైజ్ హోటల్ ముందాగింది. అంతకు ముందురోజు చూసి వుండటంవల్ల, తిన్నగా దిగి, వెనకవైపునున్న మెయిన్ డోర్ కేసి నడిచాడు. లోనికి ప్రవేశించాడు. టేబుళ్ళవద్ద జనం చెదురుమదురుగా వున్నారు. కొందరు విదేశస్తులుకూడా కనుపించారు. మధుర పానీయ సేవనంతో మత్తెక్కివున్న యువతులు, సహచరులైన పురుషులు మాట్లాడే ప్రతిమాటకు వెకిలిగా పెద్దగా నవ్వుతూండటం స్పష్టంగా కనిపించింది.

"గుడ్ మార్నింగ్ సార్!" సర్వరు వచ్చి సెల్యూట్ చేశాడు.

"స్ట్రాంగ్ కాఫీ, బిస్కెట్లు తీసుకురా!" చెప్పాడు సుధాకర్.

"క్షమించండి సార్! మీరు లావణ్యను కలుసుకోవాలన్న విషయం ఆమెకు చెప్పాను. ఆమె ఎంతో ఉత్సాహపడింది. కానీ మా బాస్ చెప్పాకోలేదు. ఆ తర్వాత ఆయన మీతో ఏదో మాట్లాడటంకూడా గమనించాను. మీరెక్కడుంటున్నదీ ఆమెకు చెప్పాను. రాత్రి మీవద్దకు రావాలని ప్రయత్నించింది. కానీ మా బాస్ పసిగట్టి, గోడ దూకుతున్న లావణ్యను పట్టుకొని, తిట్టి, నిర్దాక్షిణ్యంగా కొట్టి, గదిలో త్రోసి తాళంవేశాడు. పాపం ఆ అమ్మాయి ఏడుస్తూనే నిద్ర పోయింది. ఇవిగోనండి మీరిచ్చిన పదిరూపాయలు." అంటూ అందించాడు సర్వరు.

సుధాకర్ అతనికళ్ళలోకి ఓసారి చూసి "ఎందుకలా ఆమెను నిర్బంధంలో వుంచుతున్నారు?" ప్రశ్నించాడు. డబ్బులందుకోనే ప్రయత్నం చెయ్యకుండానే.

"తెలీదు సార్!"

"పోనీ ఆమె పుట్టినస్థలమేదో తెలుసా?" అడిగాడు సుధాకర్.

"తెలుసు! అండమాన్ దీవుల్లో, సముద్రపుఒడ్డుకేవున్న చిన్న గ్రామంలో పెరిగింది. వాళ్ళనాన్న సైన్యంలో చిన్న ఆఫీసరుగా పనిచేసేవాడు. యుద్ధంలో చనిపోయాడు. ఆమె తల్లి కష్టపడి యీ అమ్మాయిని పెంచింది. మాబాస్ అండమాన్ దీవులకు రెండు సంవత్సరాలముందు వ్యాపారం పనిమీద వెళ్లాడు అప్పుడే లావణ్యను వెంటబెట్టుకొచ్చాడు!!"

"ఐ సీ. ఆమె నెలాగైనా కలుసుకోవాలి! ఆ డబ్బు నువ్వేవుంచుకో. ముందు నాకు కాఫీ పట్రా!" చెప్పి పురమాయించాడు సుధాకర్. జేబులోని సిగరెట్ పాకెట్ లోంచి ఒక సిగరెట్ తీసి ముట్టించుకొని ఘట్టిగా దమ్ములాగాడు.

దగ్గర్లోవున్న కుర్చీ నెవరో దబ్బున లాగినశబ్దమైంది. తల త్రిప్పిచూశాడు సుధాకర్. ఆరడుగులఎత్తున లావుగావున్న ఆకారం కనుపించింది. నల్లటిసూటులో పొడవైన అతని మొహంలో కుడికంటి క్రింద రెండంగుళాల పొడవున కత్తి గాటు కొట్టొచ్చినట్లు కనుపిస్తూంది.

"నాపేరు సింహాద్రి!!!" తనపేరు తనేచెప్పుకొని లాగిన కుర్చీపైన కూర్చున్నాడు, సుధాకర్ కేసిచూస్తూ.

"నీపేరేమిటో నేనడగలేదు! నాకవసరంలేదు!" తాపీగా సిగరెట్ కాలుస్తూ చెప్పాడు సుధాకర్.

"నాకు అవసరంవుంది. నిన్ను కత్తికొకకండగా నరికి,

కాకులకు గ్రద్దలకు వేస్తేగాని నాపగతీరదు. కోపంచల్లారదు.” చెప్పాడు సింహాద్రి.

“నేనెవరో నీకు తెలుసా?” అడిగాడు సుధాకర్ అతని మాటలకు ఆశ్చర్యపోతూ.

“తెలుసు! మద్రాసునుండివచ్చిన ప్రముఖ డిటెక్టివ్ సుధాకర్వు.”

“అయితే నన్నెందుకు హత్యచెయ్యడం!”

“నా ప్రియురాల్ని నువ్వు హత్యచేసినందుకు?”

“ఎవరామె!”

“తెలీదా! నువ్వు నిర్దాక్షిణ్యంగా చంపిన మృణాళినీ దేవిని అప్పుడే మరచిపోయావా! ఆమె నీకేంద్రోహం చేసింది. ఎందుకు హత్యచేశావ్!” అంటూనే సుధాకర్ కోటును పిడికిట్లో చిక్కినమేరకు పట్టుకొని తనవైపు వంచుకొన్నాడు సింహాద్రి.

“ముందు కోటువదలు! తర్వాత మాట్లాడుకుందాం!” చెప్పాడు సుధాకర్.

“వదలను!” పట్టుగట్టిచేసుకుంటూ చెప్పాడు సింహాద్రి.

ఒక్కక్షణం తటపటాయిస్తూ చుట్టూ చూశాడు. ఎడంచేతి పిడికిలిబిగించి, శరీరంలోని బలాన్నంతా కూడగట్టుకొని ఒక దెబ్బ మెడమీద గడ్డంక్రింద వేశాడు సుధాకర్.

“అమ్మా!” అంటూ వెల్లకిలాపడ్డాడు. కుర్చీకూడ బోర్లపడింది. సుధాకర్ లేచి అతన్ని పైకిలేవదీసి మళ్ళీ కుర్చీలో కూర్చుండబెట్టాడు.

“మిస్టర్ సింహాద్రీ! నేను అహింసావాదిని కానీ అవతలివాళ్ళు హింసకుపూనుకుంటే చేతులుకట్టుకొనిమాత్రం కూర్చునే

తత్వంలేదు మృణాళినీదేవిని హత్యచేశానని నీకెవరు చెప్పారు. నువ్వెలానమ్మావ్. మీఅనుమానాలకు ఆస్కారమేమిటి?" అడిగాడు సుధాకర్.

"రాస్కెల్! హోటల్ గాబట్టి బ్రతికిపోయావ్. నిన్నేం చేస్తానో చూడు. యీరాత్రికి నిన్ను సఫాచేసితీరుతాను." అంటూ వెనక్కు తిరిగిచూడకుండా వడివడిగా ముందుకు పరుగెట్టాడు. సుధాకర్ కూడా అతని వెనకనే పరుగెత్తాడు. హోటల్ వెలుపలవున్న కారులోకి ఎగిరిదూకాడు సింహాద్రి. మరునిముషంలోనే రయ్ మని గేటులోనుండి దూసుకొని రోడ్డెక్కిందికారు. అచేతనంగా అవాక్కయిచూస్తూ నిలుచున్నాడు క్షణం సుధాకర్. ప్రక్కనే ఎవరిదో కారు పార్కు చేసివుంది. అదృష్టవశాత్తూ ఇగ్నీషన్ కీకూడా దాని స్థానంలోవుంది. కాలం వృధా చెయ్యకుండా దాన్లోకిదూకి, స్టార్టుచేశాడు. సింహాద్రి కారును వెతుక్కుంటూ వేగంగా ముందుకుసాగాడు. పదినిముషాలతర్వాత కాల్టెక్స్ రిఫైనరీకి వెళ్ళేరోడ్డుపై కనుపించింది కారు. స్పీడు హెచ్చించి సింహాద్రి కారుకు పదిగజాలదూరంలో ప్రయాణంచెయ్యటం మొదలెట్టాడు. తనప్రాణం తీస్తానని బెదరించినవ్యక్తికి ఘట్టిగా బుద్ధిచెప్పాలన్న ఉద్దేశ్యమే అతన్ని సాహసానికి పురికొల్పింది. కార్లు రెండూ డాల్ఫిన్స్‌నోస్ కొండఅంచునున్న రోడ్డుపైకి చేరాయి. ఆరోడ్డు అలా మెలికలుతిరుగుతూ ముందుకు పోతూనే కొండపైభాగానికి వెడుతుంది. రోడ్డుకు ఒకప్రక్క అగాధమైనలోయ. మరోవైపున ఎత్తయిన కొండచెరియ. వెనక్కి త్రిప్పుకోవాలన్నా కష్టమే. అనుభవంవున్న డ్రైవరు అతిప్రయాసమీదగాని కారును రివర్సుచెయ్యడం కష్టం. సింహాద్రికారు వేగం తగ్గింది. సుధాకర్ కూడా కారువేగం

తగ్గించాడు. రియర్ వ్యూ మిర్రర్ లో తన కారు వెనుక మరో కారు తరుముకొస్తున్నట్లు గమనించాడు. ఆ కారులో ఇద్దరు వ్యక్తులున్నారు. సింహాద్రి వేసిన వలలో పక్షిలా చిక్కుకున్న విషయం సులభంగా అర్థమైంది సుధాకర్ కు. తన్నెలాగైనా హత్యచేసేందుకు నిర్ణయించుకున్నారు. తప్పించుకోవాలన్నా వీలుకాని స్థలంలో, ముందూ వెనుకా శత్రువులమధ్య చిక్కుకున్నాడు. అనవసరంగా తాను తొందరపడ్డానేమోననిపించింది సుధాకర్ కు.

ముందున్న సింహాద్రి కారు ఆగింది. సుధాకర్ కూడా దానికి పదిగజాల వెనుకగా తన కారు ఆపి ఇంజన్ ఆఫ్ చేశాడు. వెనుక నుండి తరుముకొనివస్తున్న కారుకూడా ఆగింది. దూరంగా తీరాన్ని బలంగా తాకుతూ, ఎగిరి పడిపోతున్న పెద్ద పెద్ద సముద్రపు అలలు పెడుతున్న హోరుతప్ప మరేవిధమైనశబ్దం లేదు. పాంటు జేబులోవున్న రివాల్వరు తీసి, జేబురుమాలుతో తుడిచి సిద్ధంగా పట్టుకొన్నాడు. కారుతలుపులు తీసి మూసిన శబ్దమౌతుందేమోనని చెవులు రిక్కించుకొనివినడం ప్రారంభించాడు. తనను చంపేందుకు రావాలంటే ముందున్న సింహాద్రిగానీ, వెనకవున్న అతని అనుచరులుకానీ, కారుదిగి తన కారువద్దకు రావాలి. ఆ అవకాశం వాళ్ళకులేకుండా తను కారుతలుపు తీసినశబ్దం వినిపించగానే రివాల్వరు పేల్చాలి. సుధాకర్ దృష్టి ముందున్న సింహాద్రి కారుపై వుంది. చెవులు మాత్రం వెనకవైపున్న కారుకేసి రిక్కించివుంచాడు.

(సశేషం)

హమేషా హంగామా

1. ప్లీజ్-నన్ను చంపకండి!

రచన: వాసిరాజు హనుమంతరావు.

అయిపోయింది. చేతిలోవున్న చాకును ఒక్కసారి పరిశీలించాను. అది అంతా రక్తం అంటుకుని వుంది.

ఎదురుగా చూసాను. ఎదురుగా ఓ శవం పడుంది. అతన్ని నేనే చంపాను. ఎందుకా? ఇన్ని రోజులు మేము దొంగ బంగారాన్ని చేరవేస్తున్నాము. ఇంతవరకూ మమ్మల్ని ఎవ్వరూ కనిపెట్టలేదు. ప్రక్కకి తిరిగాను. సుందర్, మోహన్‌లు నిలబడి వున్నారు.

"పని పూర్తయిందా గోపాల్" అడిగారు.

"ఆఁ! మనల్ని వెంటాడిన సి. ఐ. డి పని పూర్తయింది" అన్నాను.

ప్రక్కగా కట్టేసిన మా గుర్రాలని అధిరోహించాము.

మూడు గుర్రాలు ఒకదాని ప్రక్కగా ఒకటిపోతున్నాయి. రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది.

టయిమ్ అర్ధరాత్రి 12 గంటలయింది.

రోడ్డుమీద నిశ్శబ్దంగా దూసుకు పోతున్నాయి గుర్రాలు.

"అది ఏమిటో గమనించండి" అన్నాను నేను. సన్నగా ఎక్కడనుండో శబ్దం వస్తూంది. అది ఇంకా దగ్గర అవుసాగింది.

"ఫట్...ఫట్...ఫట్."

"అది మోటార్ సైకిల్ శబ్దం" అన్నాడు సుందర్ మోహన్ లు.

వెనక్కి తిరిగి చూసాను.
దగ్గరౌతోంది మోటార్ సైకిల్.
మా గుర్రాలు వేగంగా పోతున్నాయి.
మమ్మల్ని వెంటాడుతోంది మోటార్ సైకిల్.

చేతిలో వున్న కర్రతో గుర్రం కాళ్ళమీద కొట్టాను. అంతే. "రాకెట్ లా" దూసుకుపోతూంది. వెనక్కి తిరిగి నా ఫ్రెండ్స్‌ని హెచ్చరించాను. వాళ్ళుకూడా నన్ను కలుసుకున్నారు.

ఎవరతను? సి. ఐ. డి. యా? అయితే నేను హత్య చేయటం చూసాడా? మా దగ్గర బంగారం ఉన్న సంగతి తెలుసా?

"ఫట్...ఫట్...ఫట్."

ఉలిక్కి పడ్డాము.

దగ్గరగా వచ్చేస్తోంది, మోటార్ సైకిల్. దానిమీదున్నాడు ఒకతను. అతను బ్లాక్ సూట్ లో వున్నాడు. తలకు హ్యాట్. కళ్ళకి నల్లని అద్దాలు. ఎవ్వరతను? ఎంత ఆలోచించినా అర్థం కాలేదు. అతని మొహం చూస్తుంటే సి. ఐ. డి. లాగా కన్పించడం లేదు.

"టక...టక...టక" మని గుర్రాలు దూసుకుపోతున్నాయి.

ముగ్గురు చేతుల్లోను సంచులున్నాయి. అందులో బంగారముంది.

గుర్రాలు మలుపు తిరిగాయి.

వెనకనున్న మోటార్ సైకిల్ మమ్మల్ని కలుసుకోవాలని ఎన్నో విధాల ప్రయత్నం చేస్తోంది.

దాని ప్రయత్నాలని ఫలించకుండా మేము దూసుకు పోతున్నాము.

గుర్రాలు "ఆబిద్" రోడ్డు-సెంటర్ కి వచ్చాయి.
నా చేతినున్న గడియారంవంక చూసాను.
రెండున్నర అయింది.

"ఆబిద్" రోడ్డుపైన గుర్రాలు నిశ్శబ్దంగా దూసుకు పోతున్నాయి.

అతను మమ్మల్ని ఇంకా అనుసరిస్తున్నాడు.
అతను ఎందుకు మమ్మల్ని అనుసరిస్తున్నాడో అర్థంకాలేదు.
గుర్రాలు "టాంక్ బండ్" వైపు తిరిగాయి.
ముందు గుర్రాలు.
వెనక మోటార్ సైకిల్.

వాయువేగంతో దూసుకు పోతున్నాయి.
ఇప్పుడు మేము టాంక్ బండ్ మీదుగా పోతున్నాము.
నాకో ఐడియా వచ్చింది.
"మోహన్, సుందర్ గుర్రాలు ఆపండి" అరిచాను.

"వొద్దు గోపాల్! ఎవరో వాడు. ఆగితే మనల్ని ఏమైనా చెయ్యగలడు" అన్నారు.

గుర్రాలు ఆగకుండా పరుగిడుతున్నాయి.
వెనక్కి తిరిగి చూసాను.

మరుక్షణం చిన్నగా ఉలిక్కి పడ్డాను. అతని చేతిలో పిస్తోలుంది.

గుర్రాల వేగం హెచ్చించాము.

వెనక మోటార్ సైకిల్ వేగంకూడా హెచ్చింది.

"ఢన్...ఢన్" మంది పిస్తోలు.

తెలివిగా నడిపాను గుర్రాన్ని.

ప్రక్కనుండి దూసుకుపోయింది గుండు.

మళ్ళీ అతను గురిపెట్టాడు.

"ఢన్" మని గర్జించింది.

ఈసారి మోహన్ ప్రక్కనుంచి దూసుకు పోయింది గుండు.

"గుర్రాలాపండి" అన్నాను.

"ఎందుకు?" అంటూనే ఆపారు గుర్రాల్ని.

బర్రు...ర్...ర్ మని శబ్దం చేస్తూ, వెనక మోటార్ సైకిల్ ఆగింది. దాని మీదనుండి దిగాడు సూటువాలా.

అతని చేతిలో పిస్తోలుంది.

హఠాత్తుగా మా చేతులు బిగుసుకున్నాయి.

అతను దగ్గరికివచ్చేస్తే చావగొట్టి "మమ్మల్ని ఎందుకు వెంటాడుతున్నావు?" అని అడగాలని నా ఆయిడియా.

అతను అడుగులు గంభీరంగా వేస్తున్నాడు.

మేము ఊపిరి బిగబట్టాము.

అతను మాకు గజం దూరంలో ఉన్నాడు.

ముగ్గురం కూడ బలుక్కున్నాము.

అంతే!

హఠాత్తుగా ఎగిరాం అతనిమీదికి.

గుర్రాలు భయంకరంగా సకిలించాయి.

అతని చేతిలోని పిస్తోలు క్రిందబడింది.

అతను వెల్లకిల్లా రోడ్డుపైన బడిపోయాడు.

నేనో "బ్లో" ఇచ్చాను.

మూలిగాడతను

మోహన్ కత్తి తీసాడు.

"వద్దు" హెచ్చరించాను.

చేతులు పైకెత్తాను.

"ప్లీజ్!...నన్ను కొట్టకండి" అన్నాడను.

సుందర్ అతని వీపుమీద తన్నాడు.

చిన్నగా మూలిగాడతను.

"చెప్పు మమ్మల్ని ఎందుకు వెంటాడుతున్నావు" అడిగాను.

"............"

పిడికిలి బిగించాను.

అది గమనించాడతను.

"ప్లీజ్...నన్ను చంపకండి!" అన్నాడతను.

నేనో గుద్దు గుద్దాను.

"బాబోయ్, చచ్చాను" మూలిగా డతను.

"నన్ను చంపకండి" అతను చేతులెత్తి దణ్ణం పెట్టాడు.

ఒకరి మొహాలు ఒకరం చూసుకున్నాము.

అతని నోట్లోంచి నెత్తురు కారుతోంది.

"సుందర్ నీళ్ళు. అర్జెంట్" అన్నాను.

కాసేపటికి అతని నోరు కడిగాము.

కానీని నీళ్ళు త్రాగాడు.

మాటువాలా తేచాడు.

అతను మా దగ్గరికి వచ్చి "సారీ! ఫ్రండ్స్! మీరు నన్ను తప్పుగా అర్థం చేసుకున్నారు. నేను మీకు హాని చేయడానికి

రాలేదు నేను మొదట మిమ్మల్ని చూసి దొంగలనుకున్నా నం. ఇప్పుడు మీ సహాయం కోరుతున్నాను. మిమ్మల్ని చూసాక నా ఊహ తప్పని అర్థమయింది. వేరే ఎవ్వరినయినా సహాయం అడుగుదామంటే రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉన్నాయి." ఆగాడతను.

అతన్ని కొట్టినందుకు బాధపడ్డాను.

"జరిగింది ఏదో జరిగింది. మీకు కావాల్సిన సహాయం ఏమిటో చెప్పండి" అన్నాను.

"చాలా థాంక్స్" అబిడ్ రోడ్డుదగ్గర ఒక లారీ వుంది. అందులో బియ్యం వున్నాయి. నిన్న ఎవరో హెచ్చరించారు. ఈరాత్రి లారీలో ఉన్న బియ్యాన్ని ధ్వంసం చేస్తామని, దయచేసి నాకు సహాయం చేయండి. మనిషికి నూరు రూపాయలిస్తాను" అన్నాడతను.

"ఇప్పటికే లారీలోని బియ్యం వాళ్ళు ధ్వంసం చేసి ఉండచ్చుగా?" నవ్వాడతను.

"వాళ్ళు సరిగా రాణీగంజ్ దగ్గర ఎదురు చూస్తామన్నారు."

"సరే" ముగ్గురం గుర్రాలెక్కాము.

రెండు నిమిషాలు ఆలోచించాను.

సుందర్, మోహన్‌లకి సంజ్ఞచేసాను. వారు తమ వద్దనున్న సంచులని ఒక మూలగా పడేశారు.

* * *

లారీ నిశ్శబ్దంగా ముందుకు దూసుకు పోతూంది. దాని వెనుక గుర్రాలు, లారీముందు మోటారు సైకిల్.

వాహనాలన్నీ నిశ్శబ్దంగా పోతున్నాయి.

"రాణీగంజ్" వచ్చాము.

ఎంతదూరం పోయినా, ఎవ్వరూ అడ్డగించలేదు మమ్మల్ని. కాని గాణీగంజ్‌లో ఎదురుగా కన్పించింది ఓ దృశ్యం.

ఎదురుగా పోలీసులు.

"స్టాప్" అరిచాడు కానిస్టేబుల్.

లారీ ఆగింది.

"ఏమిటివి?" అడిగాడు.

"బియ్యం" సమాధాన మిచ్చాడు నూటువాల.

లారీ ముందుకు కదిలింది.

దాని వెనక మోటార్ సైకిల్.

మా గుర్రాల్ని కూడా కదిలించాము.

అంతలో "ఆగండి...ఆగండి" అరిచాడు కానిస్టేబుల్.

"మీ రెందుకు గుర్రాలమీద వస్తున్నారు" అడిగాడు.

"అర్థంలేని ప్రశ్న. అతనికి సహాయంగా వస్తున్నాము." అన్నాను.

"అతనికేనా?" అడిగాడు.

"అవును అతనికే." నొక్కి సమాధానం చెప్పాను.

"అయితే మిమ్మల్ని 'అరెస్టు' చేస్తున్నాను" అన్నాడు.

ఉలిక్కి పడ్డాను.

"ఎందుకు?" అడిగాము.

"అతని లారీలో దొంగ బంగారం దొరికింది. మీరు కూడా అతనికి సహాయం చేసారు. నేరస్తులకి సహాయం చేయటం కూడా నేరమే" అన్నాడు.

అయితే నూటువాలా కూడ మా వృత్తిలో కాలు పెట్టిన వాడన్నమాట.

ముందుకు నడిచాం.

రోడ్డు మలుపు దగ్గర లారీ ఆగింది. అక్కడ పోలీసులు

ఇన్ స్పెక్టర్స్ నిలబడి ఉన్నారు. సూట్ వాలా "బేడీలు" తొడిగించుకుని ప్రక్కన నిలబడి ఉన్నాడు.

పళ్ళు "పటపట" కొరికాను.

ఎంత అమాయకుడిలా కన్పించాడు వీడు.

అప్పుడే చంపేయాల్సింది. ఇప్పటికి అయినా మించి పోయింది ఏమీ లేదు. చుట్టూ చూశాను. ఎవరి పనుల్లో వారున్నారు. ఒక్క దెబ్బతో చంపేయాలి. చేతులు బిగించాను.

నా ప్రయత్నాన్ని కనిపెట్టిన ఇన్ స్పెక్టర్ నా ప్రక్కకు వచ్చి నిలబడ్డాడు. ఒక నేరంమీద కాకపోయినా ఇంకో నేరంమీద అరెస్టు కాబడ్డాము.

* * *

2. ప్రతి ఫలము

రచన: టి. వి. ఎల్. మృత్యుంజయరావు.

"మిస్టర్ విశ్వనాథం!

నాలుగు సంవత్సరముల క్రిందట ఒక హాస్పటల్ లో ఒక అబ్బాయిని కంటివ్యాధివలన జాయిన్ చేసారు. ఆ వ్యాధి తగ్గదని కళ్ళు తీసెయ్యాలని, కళ్ళు తీయకపోతే ఆ వ్యాధి శరీరమంతటా వ్యాపించి కొద్దిరోజులలోనే చనిపోతాడని, డాక్టర్ అబద్ధము ఆడాడు. అప్పుడు ఆ అబ్బాయి తల్లి దండ్రులు విధిలేక ఆ అబ్బాయి కళ్ళు తీయడానికి ఒప్పుకున్నారు. ఆ డాక్టరు ఎందుకు మోసము చేసాడు? నాకు తెలుసు. ఆ కళ్ళు డాక్టరుకు కావాలి ఆ డాక్టరు ఆకళ్ళను యింకొకరికి అమ్మాలి. వాళ్లు డబ్బు యిస్తామన్నారు. అందువలన ఆ డాక్టరు మోసముచేసి కళ్లు తీసుకున్నాడు. ఇప్పటికేనా గుర్తు వచ్చిందా ఆనాటి సంగతి. ఆ డాక్టరు

ఎవరో తెలుసా! నువ్వే!! ఆ హాస్పటల్ నీదే. ఆ అబ్బాయి అన్నయ్యనే నేను.

నేను విదేశములలో ఉండగా ఈ ఘోరము జరిగింది. నేనూ నేత్ర వైద్యుడనే. మిస్టర్ విశ్వనాథం! బాగా విను. రేపు నా హాస్పటల్ కు రా. నీవు చేసిన మోసాలను చూచిన నీ అమూల్యమైన నేత్రాలు మర్యాదగా నాకు యిచ్చేయి. అవి నా తమ్ముడికి అమర్చాలి. రేపే ఆ శుభదినము. నీ నేత్రాలే నాకు కావాలి. పోలీసులను పిలిచేవంటే నాపని నే చేసుకుంటా. అప్పటి సాక్ష్యాలు నాదగ్గర వున్నాయి. నీ నేత్రాలు నాకిచ్చి, నీవు వెళ్ళిపోవచ్చు. నీకు కీర్తి వస్తుంది. నా తమ్ముడికి కళ్ళు వస్తాయి. నా ప్రతీకారము తీరుతుంది. కావాలనుకుంటే నేత్ర దాతవని పేపర్లో వేయిస్తాను. నీ నేత్రాలు ఇవ్వకుండా తప్పించుకుంటే, యీ వేళనుండి సరిగ్గా మూడు రోజులలోపున నీ మరణం తప్పదు!

ఇట్లు

ప్రతీకారము కోరే,

డా. ప్రభాకర్."

ఉత్తరము చదువుతున్న నేత్రవైద్యుడు విశ్వనాథం భయపడి పోయేడు. పోలీసులకు చెపుదామంటే తను చేసిన మోసము బయట పడుతుంది. ఆనాడు లక్షరూపాయలకోరకు తను ఆ అబ్బాయి కళ్ళుతీసి ఒక అంధుడైన లక్షాధికారికి అమర్చేడు. ఆ మోసము యీ వేళ ఈ ప్రభాకర్ కు తెలిసింది. అప్పటి సాక్ష్యములుకూడా ఉన్నాయట. నాకళ్ళు యివ్వంటే ప్రభాకర్ శాంతించడు. మరల ఎవరినైనా మోసపుచ్చేనా, కోసియైనా నేను నేత్రాలు అమర్చుకోవచ్చు, అనుకుంటూ

చిట్టచివరకు తన కన్నులను డాక్టరు ప్రభాకర్‌కు యిచ్చుటకు నిశ్చయించుకొన్నాడు.

* * * * *

"పేరు ప్రఖ్యాతులు వహించిన నేత్రవైద్యుడు విశ్వనాథంగారు, బంధు మిత్రులు ఎంత చెప్పినా వినకుండా, తన నేత్రములను అంధుడైన ఒకబ్బాయికి సమర్పించారు. ఆ అబ్బాయి మీద జాలికలిగి తన నేత్రములనే త్యాగము చేసాడు" అని పేపరులో పడినవార్త అసిస్టెంట్ చదువుతుండగా విశ్వనాథము విన్నాడు. ప్రభాకర్ పేపరు చదివి నవ్వుకున్నాటు.

* * *

మరునాడు పేపరులో "నేత్రవైద్యుడు విశ్వనాథంగారు కళ్ళు లేనందున తన హాస్పటల్‌లో పనిచేయుటకు వీలు కలుగుట లేదని, రోగులు అవస్థపడుతున్నారని, మరల ఆయనకు నేత్రములు అమర్చుటకు, బంధుమిత్రులు నిశ్చయించుకొనగా విశ్వనాథంగారు అంగీకరించేరు" అన్న ప్రకటనను చూచి ప్రభాకర్ నవ్వుకున్నాడు. వెంటనే ఫోను దగ్గరకు వెళ్ళి ఒక నెంబరుకు ఫోన్ చేసాడు. అవతలనుంచి కంఠము పలికింది.

"విశ్వనాథం స్పీకింగ్."

"నేను ప్రభాకర్‌ను"

"మళ్ళీ ఏమి కావలసి వచ్చేయి. చేతులా? కాళ్ళా?"

"అవేం అక్కరలేదు విశ్వనాథం. నీ మోసాలిక సాగవు. మరల మోసముచేసి నేత్రములు సంపాదించుకుందామనుకున్నావేమో. పేపర్లో బంధు మిత్రులు, రోగులు బాధపడుతున్నారని ప్రకటించేవు. నేను చెప్పేది విను. నీ విక ఏ అమాయకులను మోసము చేసి నేత్రములు సంపాదించకుండ

ఉండుటకై నిన్ను శాశ్వత అంధుడిని చేశాను. నీకు ఏ నేత్రములు అమర్చినా కళ్ళు కనబడవు. ఏ డాక్టరు నీకు కళ్ళు ప్రసాదించలేడు. నా తమ్ముడిని నాలుగేళ్ళు అంధుడిగా చేసినందుకు అది నీకు ప్రతిఫలము గుడ్ బై" అంటూ ఫోన్ పెట్టేసేడు ప్రభాకర్.

ఎంత మోసము. నేను శాశ్వత అంధుడినా, అంటూ కుప్ప కూలిపోయేడు డాక్టరు విశ్వనాథం.

* * *

3. అత్తగారు-కొత్తకోడలు

రచన: విఠలానంద్.

మా అమ్మా, శ్రీమతీ అమ్మవారి గుడికి వెళ్ళి తిరిగొచ్చారు. వస్తూనే యిద్దరూ గొడవపడడం విని ఎంక్వయిరీ చేశాను. సారాంశం ఏమిటంటే, వాళ్ళు పట్టుకు వెళ్ళిన వంద రూపాయల నోటు వాళ్ళకు తెలియకుండానే మాయమైంది. మా అమ్మ అంటుంది "మీ ఆవిడే నోటు మాయం చేసి పుట్టింటికి చేరవేసి వుంటుంది" అని. "అత్తగారే దాన్ని కూతురికందజేసిందేమో కనుక్కోండి" అంటుంది శ్రీమతి.

"నోటు పోయిందీ - హాతోస్మి!" అనుకుంటూనే యిన్వెస్టిగేషన్ స్టార్ట్ చేశాను.

"అమ్మా! అసలు నోటెలా పోయిందీ, మీ రెక్కడికి వెళ్ళిందీ అంతా వివరంగా చెప్పండి" అన్నాను అలవాటుగా.

"ఎక్కడికీ వెళ్ళిందే! తిన్నగా గుడికి వెళ్ళి మళ్ళీ యింటికే వచ్చేశాం. అమ్మవారికి కొబ్బరికాయలు కొడుతున్నప్పుడు నోటువున్న పర్సు మీ ఆవిడ చేతికే యిచ్చాను. తిరిగి వస్తున్నప్పుడు చూసుకుంటే నోటు కనిపించందే" అంది అమ్మ ఓరగా శ్రీమతిని చూస్తూ.

"మీ యిద్దర్లో ఎవరైనా ఏదైనా కొన్నారేమో!" అన్నాను.

"లేదు." అన్నారిద్దరూ ఒక్కసారే.

"ఎవరికైనా బాకీ తీర్చారా పోనీ?"

"లేదు" అన్నారు మళ్ళీ.

"పర్సులో కన్నం వుందేమో!"

"లేదు-కొత్త పర్సు" అంది శ్రీమతి.

భయపడుతూనే అడగకూడని ప్రశ్న అడిగాను శ్రీమతిని. "లక్ష్మీ! నీదగ్గరే వుందేమో ఒక్కసారి బట్టల్లో - అంటే జాకెట్లో - అహాఁ! ఎందుకైనా మంచిది - అబ్బే, నువ్వలా దాస్తావని కాదు - అంటే, నా వుద్దేశం - ఎవరికైనా మతి మరుపు సహజం కదా!" ఒక్క మాటను శతవిధాల సర్దడానికి తాపత్రయ పడ్డాను.

శ్రీమతి తెల్లబోయింది. "ఎలా అయినా మీ పోలీసుబుద్ధి పోనిచ్చుకున్నారు కాదు." అంది ఏడవడానికి తయారై.

"అమ్మా! నువ్వుకూడా చూసుకోకూడదూ!- ఒకవేళ మర్చిపోయి - పొరపాటు ఎవరికైనా—" బెదురుతూనే అనేశాను.

అమ్మ నిర్ఘాంతపోయింది. మరుక్షణంలో, ముక్కుచీది కళ్ళొత్తుకోవడం మొదలు పెట్టింది.

ఇద్దరి దగ్గరా ఆ నోటు లేదని ఒకరినొకరు విట్నెస్ చేసుకున్నారు. అంటే పెర్చివారంటూ లేకుండానే ఒకర్నొకరు తనిఖీ చేసేసుకున్నారన్నమాట.

తక్షణం ఐడియా వచ్చిందినాకు. నా తెలివికి నేనే సంతోషిస్తూ "కొబ్బరికాయలు ఎక్కడివి మీకు?" అన్నాను

"నిన్ననే చిన్న తెచ్చాడు పూజసామాన్లన్నీ" అంది అమ్మ.

నాకు నీరసం వచ్చేంది. నా సర్వీసులో యింత చవట కేసు ఎప్పుడూ తగల్లేదు. ఇద్దర్లో ఎవరో ఒకరు అబద్ధం చెప్తున్నారు. నిజం ఎలా రాబట్టడం? ఒకరు తల్లి - మరొకరు పెళ్ళాం!!!

"వదినా! మీరు వెళ్ళేటప్పుడు పర్సులో నోటు కాక చిల్లర ఏమైనా వుందా?" అడిగాడు తమ్ముడు.

"వాడెయ్యాడూ - యింక నువ్వు మొదలు పెట్టు - యింట్లోనా మీ క్రాస్ పరీక్ష?" అంటూ అమ్మ కోపంగా లోపలికి వెళ్ళిపోయింది.

"చిల్లరేమీ లేదు చిన్నా!" అంది శ్రీమతి లోపలికి పోతూ.

వాడి ప్రశ్న అర్థంకాక, తెల్లబోయిన నన్ను చూసి నవ్వాడు వాడు. వాడి మొహంలో విజయచిహ్నాలు గోచరించాయి.

వంద ప్రశ్నలతో రాబట్టుకోలేని రహస్యం ఆ ఒక్క ప్రశ్నతో ఎలా విడిపోయిందో అని ఆశ్చర్యపోతూ "తెలిసిందిరా?" అని అడిగాను.

"మరి సినిమాకు డబ్బులిస్తావా?" అన్నాడు వాడు.

"ఓరి రాస్కెల్! నా దగ్గరే లంచమా?" అనుకున్నాను. పోలీసు ఇన్‌స్పెక్టర్నైనా నాకే తిప్పలు తప్పవందుకు విచారిస్తూనే "సరే" అన్నాను.

"అమ్మకో అలవాటుంది తెలుసా?" అడిగాడు వాడు.

"ఓరి వెధవ సస్పెన్సూ నువ్వూను. చెప్పరా ముందు" అన్నాను ఆతృతగా.

"అమ్మ ఎప్పుడు అమ్మవారి గుడికి వెళ్ళినా హుండీలో ఎంతో కొంత వేయకుండా రాదు. మరి పర్సులో వేరే చిల్లర

లేదంటే అమ్మ హుండీలో ఏం వేసినట్టు?" గర్వంగా మెరుస్తున్న కళ్ళతో నావైపు తలాడించాడు వాడు.

నాకు క్షణంలో అంతా అర్థమైపోయింది. కోడలి కడుపున కాయ కాసే సూచన కన్పిస్తే హుండీలో పదిరూపాయలు వేస్తానని అమ్మవారికి మొక్కుకుంది అమ్మ. ప్రియాకి మరి వేవిళ్ళని నిన్ననేగా తెల్సింది!

"అమ్మా, వదినా ఉదయం వంటింట్లో గొడవపడ్డారే — అందుకే వదినను నీచేత చీవాట్లు వేయించడానికి అమ్మ వేసిన ప్లాన్ యిది" అంటూన్న తమ్ముడు నేను సంతోషంగా వాడి మీదికి విసిరిన రెండు రూపాయలనోటు చూసి ఠక్కున నోరుమూసి దాన్నందుకుని తూనీగలా తుర్రుమన్నాడు రోడ్డు మీదికి.

***

4. ఒకే దెబ్బ-రెండు పిట్టలు

రచన: శ్యామల

"డియర్ అమ్ములూ,

నే నెవరో నీ కనవసరం. దీనితో పంపిన ఫోటోలు గుర్తించావనుకుంటాను. నీ ప్రియుడు సత్యంతో వుండగా తీసానవి. చాలా డీసెంట్ గా వచ్చాయి కదూ...నీ భర్త కూడా ఎప్రీషియేట్ చేస్తాడనుకుంటా...నీ కాపురం నిలవాలంటే, మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ పాతిక వేలు..."

ఇలాంటి ఉత్తరానికి సంతకం వుండదు...

కవరులో వున్న ఫోటోలు తను, సత్యంతో నగ్నంగా వున్నవి.

సత్యం వుద్యోగంకోసం తనింటికి వచ్చాడు. ఒక తీయని రాత్రి ఇద్దరూ ఒకటయ్యారు.

ఆరోజులు తలుచుకుంటూ కన్నులు మూసుకుంది.

ఇవి తన భర్తచేతిలో పడితే...

నయం. ఆయన తన కొచ్చే లెటర్సు చదవరు.

టెలిఫోన్ మ్రోగింది.

"శాంత ఆన్ దిస్ ఎండ్."

"అమ్మలూ! నా లెటర్ అందిందా?"

"అందింది."

"నీ డెసిషన్ "

............"

"సరే, నీ కాపురం నిలవాలంటే, పాతికవేలు తీసుకుని హోటల్ కి 'సుధ' రా."

"పాతిక వేలే..."

"ఏం, లక్షాధికారి పెళ్ళానివి."

అవతలవైపు ఫోన్ పెట్టేశాడు.

ఇనప్పెట్టె తాళాలు తన దగ్గిరే వుంటాయి. కాని, ఒక్కసారి పాతికవేలు! ఆయన తనేం ఖర్చు చేసినా అడగరు. కాని ఆయనకి తెలిస్తే? బ్లాక్ మెయిలింగ్ ఏనుగు దాహం లాటిది. దానికి అంతుండదు.

ఆలోచిస్తూ మంచంమీద వాలింది శాంత.

టెలిఫోన్ మ్రోగింది.

రిసీవర్ ఎత్తింది. అదే గొంతు.

"నీ డెసిషన్?"

"వస్తాను."

"గుడ్. మంచిపిల్లవి రూం నెంబరు 40. వచ్చి కూర్చో. పాతిక వేలు తీసుకోవడం, నీ ఫొటోలు నీకు ఇచ్చేయడం."

"అలాగే."

రిసీవర్ హుక్ కి తగిలించి, బాత్ రూంకేసి నడిచింది శాంత.

*　　　*　　　*

టబ్ లో నగ్నంగా గోరు వెచ్చని నీరు శరీరాన్ని తాకుతుంటే తీయగా...ఆనందంగా కన్నులు మూసుకుంది శాంత.

టెలిఫోన్ మ్రోగిన శబ్దంతో ఈ లోకంలో పడింది.

రూమ్ లోకి వచ్చి ఫోన్ ఎత్తింది. భర్త క్యాంప్ కి వెళ్తున్నాట్ట.

ఇంటికి రావడం వీలుపడదు. సామాను ఆఫీసుకి పంపమని చెప్పాడు.

ప్యూన్ చేత పంపించింది.

*　　　*　　　*

ఆరోజు ప్రత్యేక శ్రద్ధతో అలంకరించుకుంది శాంత.

లేతమబ్బు రంగుచీర. అదే రంగు జాకెట్.

సింగారం అయేసరికి ఆరయింది.

పాతిక వేలు తీసుకుని బ్యాగ్ లో పెట్టుకుంది.

బయటికి వచ్చి పోర్టికోలోని అంబాసిడర్ స్టార్ట్ చేసింది.

"హోటల్ సుధ" ముందు కారు ఆపి లోపలికి వెళ్ళింది.

నలభై నెంబరు రూంలో కెళ్ళి కూర్చుంది.

"ఓ! వచ్చావా? అయాం లేట్."

తలుపు మూస్తూ అన్నాడా యువకుడు.

"నీవా?" లేస్తూ ప్రశ్నించింది శాంత.

"అవును. నేనే! నీవు, సత్యం అల్లిన కథలతో ఇంటి లోంచి వెళ్ళగొట్టబడింది నేనే" నవ్వాడతను.

పాతికవేలూ తెచ్చావా?"

పాతికవేల నోట్లకట్ట చేతికి అందించింది.

"రా!" అతడామెని దగ్గిరికి లాక్కున్నాడు. గింజుకుంది ఆమె.

"దొరికిన దొంగపందులా పడితే నవటును కాను. అమ్మలూ. నీకేం ప్రతివ్రతవి కావు. ఒకరు కాకపోయిన తర్వాత, ఎందరయినా ఫర్వాలేదు."

నవ్వుతూ చీర కుచ్చిళ్ళు గుంజాడు. చీర వూడిపోయింది. బ్రాసియర్స్‌లో బంధించబడిన ఆమె వక్షసంపద అతన్ని వూరిస్తుంది.

బిగిగా కౌగలించుకున్నాడు. ఆమె ఎముకలు నలిగి పోతున్నాయి. బలంగా లాగేసాడు. ఆమెను తినేయాలన్నంత ఆత్రంగా ఆమెను ఆక్రమించుకున్నాడు.

* * *

తలుపులు బాదేస్తున్న చప్పుడులో మెలకువ వచ్చింది శాంతకి. పడకగదిలో డన్లప్పిల్లో పరుపుమీద వుంది. రాత్రి జరిగిన దానికి గుర్తుగా పాలిండ్లు సలుపుతున్నాయి.

లేచి నైట్ గౌన్ తొడుక్కుంది. తలుపు తీసింది.

ఎదురుగా ఇన్‌స్పెక్టర్.

"మిసెస్, శాంత! రాత్రిమీరు హోటల్ సుధకి వెళ్ళారా?"

"వెళ్ళాను. ఏం!"

"ఎందుకు వెళ్ళారు?"

"అది నా స్వవిషయం..." శాంతకి కోపం వచ్చింది.

"సారీ! మిసెస్ శాంతా! రఘుని హత్యచేసిన నేరానికి మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాను."

* * *

"ఇన్ స్పెక్టర్!"

"ఏమిటి?!"

"మా వారికి..."

"వైరిచ్చాం."

"ఇంకొక సహాయం కావాలి."

"ఏమిటి?"

"నా లాయర్ని పిలిపించాలి."

"ఎవరు మీ లాయరు?"

"మిసెస్ శ్యామలా రెడ్డి?

*   *   *

ఫియట్ కారు పోలీసు స్టేషన్ ముందు ఆగింది.

హుందాగా కారు దిగింది శ్యామల.

"రండి శ్యామలాజీ!" ఆహ్వానించాడు ఇన్ స్పెక్టర్.

"మా క్లయింటెక్కడ?"

"పిలిపిస్తాను."

శాంత వచ్చి శ్యామలని కౌగలించుకొని వెక్కి వెక్కి ఏడవ సాగింది.

"శాంతా! బేలవై పోతున్నావ్. ఏం జరిగింది? చెప్పు. నీవు ఏమీ చేయకపోతే, నిన్ను నిర్దోషిగా నిరూపించే పూచీ నాది."

"ఏం జరిగింది చెప్పనా?"

అంతా చెప్పింది.

"నీవు హోటల్ కి వెళ్ళేటప్పుడు నిన్నెవరయినా వెంబడించారా?"

"గమనించలేదు."

"హోటల్నుంచి వస్తుంటే ఏమయినా జరిగిందా?"

"అవును. ఇప్పుడు గుర్తు వస్తుంది. ఎవరో భారీ వ్యక్తి నన్ను రాచుకుంటూ వెళ్ళాడు."

"చాలు. నీవేమీ ఎరగనిపోతే నీవు నిశ్చింతగా వుండు. రేపీపాటికి నిన్ను నిర్దోషిగా నిరూపించే బాధ్యత నాది."

ఇన్‌స్పెక్టర్‌కి థాంక్స్ చెప్పి ఫియట్ ఎక్కింది శ్యామల. కారు హోటల్ సుధవైపు పరుగెత్తింది.

*   *   *

"హల్లో! శ్యామల హియర్."

టెలిఫోను ఎత్తింది శ్యామల.

"ట్రంకాల్ ఫ్రం నిజామాబాద్." ఆపరేటర్ గొంతు.

కనెక్షన్ వచ్చింది.

అంతా విన్నాక ఆమె కన్నులు ఆనందంతో మెరిసాయి.

బయటికి పరుగెత్తిందామె.

మరుక్షణంలో, ఫియట్ పోలీసు స్టేషన్‌కేసి పరుగెత్తింది.

*   *   *

"శ్యామలాజీ! మీ పరిశోధన ఎంతవరకు వచ్చింది. కాంతను అరెస్టుచేసి ఇరవైనాలుగ్గంటలు దాటింది. చార్జి ఫైల్ చెయ్యాలి" ఇన్‌స్పెక్టరన్నాడు.

"మిస్టర్, రాజేంద్రా! అరెస్టు నగేంద్ర. కాంత హాస్బెండ్."

"బాగుంది, శ్యామలాజీ! ఎలిబీ వున్నవాడిని..."

"ఇన్‌స్పెక్టర్! నగేంద్ర ఆరాత్రి నిజామాబాదు వెళ్ళలేదు. ఆమర్నాడు వెళ్ళాడని అతని కొలీగ్ సాక్ష్యం.

కాంతని బ్లాక్‌మెయిలర్ బెదిరించడం ఎందుకో ఇంటి కొచ్చిన నగేంద్ర విన్నాడు. తన భార్య కులటని తెలియగానే

కోపం హెచ్చింది. దాన్ని నరికేద్దామనుకున్నాడు. కాని, ఆలోచించి ఆ బ్లాక్ మెయిలర్ని చంపి ఆ నేరం కాంతమీదికి తోస్తే. అలాగే హత్యచేశాడు. కాంతమీద అత్యాచారం చేసిన బ్లాక్ మెయిలర్ ఆమెని పన్నెండు గంటలకి వదిలాడు. ఆమె కంగారుగా వెళ్ళుతుంటే, వస్తున్న నగేంద్ర ఆమెను రాచుకున్నాడు. కంగారు పడుతున్న కాంత, ఆ విషయం గుర్తించలేదు. నగేంద్ర, రఘుని మర్డర్ చేసాడు. పిట్ట ఎగరకుండానే వలవేయాలి. బైదిబై మా కాంతని విడుదల చెయ్యండి.?"

"ఓకే. మేడమ్" శ్యామల బయటికి నడిచింది.

* * * * *

శ్యామల, డిటెక్టివ్ రెడ్డి కౌగిలిలో వుంది. ఆమె పెదవులను తన పెదవులు అదిమి ముద్దుపెట్టుకున్నాడామెను. టెలిఫోన్ మ్రోగింది. ఆమెను వదలకుండానే ఫోనెత్తి "సీకే" అంటూ రిసీవర్ ఆమెకిచ్చాడు.

"ఇన్స్పెక్టర్ రాజేంద్ర హియర్. మీరు చెప్పిందే రైటు. మీరు చెప్పగానే పోలీసుల్ని పంపాను. ఏరోడ్రంకి వెళ్ళాడట. అంటే పారిపోయే యత్నం. వెంటనే ఏరోడ్రం పోలీసులని హెచ్చరించాం. వెంటనే వాళ్ళు కారవెల్లిలో ఎక్కుతున్న నగేంద్రని అరెస్టుచేసారు. నేరం ఒప్పుకున్నాడు. చార్జి ఫైల్ చెయ్యాలి. మీ స్నేహితురాల్ని విడుదల చేస్తున్నా"

"థాంక్యూ" రిసీవర్ రెస్టుమీద వుంచింది శ్యామల.

ఆమెని మరింత దగ్గరికి లాక్కున్నాడు రెడ్డి.

గదిలో దీపం ఆరిపోయింది.

* * *

వాసవదత్త

రచన

వెంటాడిన నీడ

ఉస్సూరంటూ నిట్టూర్చి వ్రాస్తున్న ఎకౌంట్స్‌ని మూసి టేబుల్ మీద పడేసి వెనక్కి వాలేడు రామారావు. ఏవేవో ఆలోచనలు అతడి మస్తిష్కాన్ని దొలిచేస్తున్నాయి.

"మిస్టర్ రామ్రావ్" ఉన్నట్టుండి గంభీరంగా వినిపించింది. ఉలిక్కిపడి లేచి నిటారుగా నిలబడ్డాడు రామారావు. ఎదురుగా బ్యాంక్ మేనేజరు నిలబడి వున్నాడు. 'తనకీమధ్య పరధ్యానం ఎక్కువైపోయింది ఇక చీవాట్లు తప్పవు.'

"మిస్టర్ రామ్రావ్!"

"యస్, సర్!"

"మీకీ మధ్య పరధ్యానం ఎక్కువవుతోంది."

"యస్—నో సర్... నేను... నేను" తడుముకుంటూ అన్నాడు.

"మీరు వ్రాస్తున్న ఎకౌంట్స్‌లో తప్పులు విపరీతంగా దొర్లుతున్నాయి మొన్న ఎవరికో ఇరవై రూపాయలనోట్లకి బదులు, వందరూపాయలనోట్లు లెక్కబెట్టి యిచ్చేరు. సమయానికి మన ఏజంట్ పక్కన ఉండి; మిమ్మల్ని హెచ్చరించబట్టి సరిపోయింది ఇవన్నీ మీ పరధ్యానం వల్ల కాకపోతే, ఎలా జరిగేయంటారు?" గద్దించేడు మేనేజర్.

"నిజమే సార్," వణుకుతూ జవాబిచ్చాడు.

"మీకీ మధ్య నీరసం, చిరాకు కూడ ఎక్కువయ్యేయి. రెగ్యులర్‌గా వచ్చే కస్టమర్స్ దగ్గర్నుండి రోజూ కంప్లయింట్స్ వస్తున్నాయి. ఎవరైనా సైకాలజిస్టుని సంప్రదించండి. కావలసిన ఖర్చులని మెడికల్ ఎలవెన్సు క్రింద బ్యాంక్ భరిస్తుంది."

"అనవసరం సార్. నేను మానసికంగా ఆరోగ్యంగా ఉన్నాను."

"ఆల్ రైట్. మీరు మెంటల్‌గా పరిపూర్ణ ఆరోగ్యవంతు లని సర్టిఫికెట్ తెచ్చి సబ్మిట్ చెయ్యండి బై ది బై. అచ్యుత నగర్, ఫోర్తు క్రాస్‌రోడ్‌లో హెచ్. జి. వామ్ అనే సైకాలజిస్టు ఉన్నాడు. ఎక్సలెంట్ సైకాలజిస్టు. అతడు సర్టిఫై చేస్తే మాకు ఏవిధమైన అభ్యంతరమూ వుండదు. ఇవాళ మీడ్యూటీ అవగానే అతన్ని కన్సల్టు చెయ్యండి. ఇప్పటికి మీపని మీరు చూసుకోండి ఇతర ఆలోచనలు పెట్టుకోకండి గుడ్ ఆఫ్టర్‌నూన్ టు యు."

మేనేజర్ వెళ్ళిపోయేడు.

చాలా నైస్‌గా చీవాట్లు పెట్టేడనుకుంటూ నిట్టూర్చి, ఫైల్స్ ఓపెన్ చేసేడు రామారావు.

* * *

ప్రొఫెసర్ వామ్ రివాల్వింగ్ చెయిర్‌లో ఆసీనులై ఉన్నారు. ఆయనకి నలభయ్యేళ్ళుంటాయి. మనిషి భారీగా, పొడుగ్గా ఉన్నాడు. ప్రశాంతమైన ముఖం, విశాలమైన నుదురు, రిమ్‌లెస్ కళ్ళద్దాల వెనుక జ్యోతుల్లాంటి కళ్ళు మెరుస్తూ శాంతరసాన్ని చిలికిస్తున్నాయి.

"కమాన్ బాయ్, టేక్ యువర్ సీట్" అన్నారాయన.

"నమస్తే సర్, మీరు...ప్రొఫెసర్ వామ్ అనుకుంటాను" అన్నాడు రామారావు.

"నమస్తే...యస్ నేనే వామ్‌ని; మీ పేరు?"

"రామారావు."

"వచ్చిన కారణం?"

రామారావు పరిస్థితి టూకీగా వివరించేడు.

"అయితే, రామారావ్! మీకు చిరాకు, మనోవ్యథ, నర్వస్‌నెస్ ఎందుకు కలుగుతున్నాయో, చూచాయగా నైనా చెప్పగలరా?" అడిగేరు వామ్.

రామారావు కాస్సేపు తటపటాయించి, చివరికన్నాడు. "నన్ను... ఎవరో నీడలా వెంటాడుతున్నారు దాదాపు నెలరోజులున్నాడీ అతను వెంబడిస్తున్నాడు. అదే బలమైన కారణమని చెప్పొచ్చు" అప్రయత్నంగా అతని దృష్టి ఎదురుగా ఉన్న గోడగడియారం మీద పడింది. "అరె. ఎనిమిది కావస్తోంది ప్రొఫెసర్. క్విక్!... నేను ఇంటికి వెళ్ళాలి. అతడొచ్చే టైమయింది. వాడి అంతు తేల్చాలి. మీరుకూడా వస్తే బాగుంటుంది" ఆవేశంగా అంటూ కుర్చీలోంచి లేచాడు.

"తొందరపడకు రావ్. నింపాదిగా కూర్చుని విపులంగా చెప్పు" శాంతంగా అన్నారు వామ్.

"సారీ ప్రొఫెసర్, టైమ్ లేదు. మిమ్మల్ని తర్వాత తీరిగ్గా కలుస్తాను" అంటూ వెనుదిరగబోయేడు రామారావు.

"ఆల్ రైట్ నేనుకూడా వస్తాను. అన్నట్టు వాన పడుతున్నట్టుంది" అంటూ లోనికి వెళ్ళి రామారావుకి ఓ గొడుగు నందించి, తను రెయిన్ కోటు ధరించేరు. "ఓ. క. ఇక మనం బయలుదేరుదాం," అన్నారు వామ్ కేప్ నంచుకుంటూ.

* * *

ఉండపోతగా వర్షం కురుస్తోంది. గాలి రివ్వున వీచింది. గాలితోపాటు జల్లుకూడ తెరలు తెరలుగా వచ్చి రామారావు పట్టుకున్న గొడుగును తాకింది. ప్రొఫెసర్ వామ్ తొడుక్కున్న రెయిన్ కోటు మీద వర్షపునీరు పడి నిశ్శబ్దంగా క్రిందకు జారి పోతోంది. కాళ్ళకు తొడుక్కున్న నల్లటి రబ్బరుబూట్లు మెరుస్తున్నాయి. ఇద్దరూ కొన్ని క్షణాలసేపు ఇంటి గుమ్మంముందె నిలబడ్డారు. రామారావు జేబులోంచి తాళంచెవిని తీసి తాళం తీసేడు. గదిలో వెలుగుతున్న ట్యూబ్ లైట్ కాంతి పాదరసంలా ప్రాకి ఇంటిముందు పరిస

రాత్రి కూడా కాంతివంతంగా చేసింది. తిరిగి వెంటనే తలుపు మూసివేసేడు రామారావు ఇద్దరూ కుమ్మం బయటే ఉండి పోయేరు

"ప్రొఫెసర్, ఇంకో క్షణంలో అతను వస్తాడు. చూడండి" అన్నారు రామారావు ఆదుర్దాతో.

"దూరంగా అతను నక్కివుంటే. తలుపు తెరిచి చూసుకొనేంతలో లైటు కాంతిలో మనం ఒకసారి కనిపించి అదృశ్యమవుతాం. మనం లోనికి వెళ్ళి తలుపు వేసుకున్నామని అతడనుకుంటాడు. అదేగా నువ్వాలోచించింది." అన్నారు వామ్ గంభీరంగా.

"అవును సర్. మొన్న రాత్రి తలుపు తెరవకుండా చీకట్లో నిలబడి చాలసేపు వెయిట్ చేసేను. అతను కనిపించలేదు. తలుపు తెరిచి మూసేసేను. మరుక్షణంలో అతడు ప్రత్యక్షమయ్యాడు."

"అలాగా" అంటూ తల పంకించేరు వామ్.

ఇద్దరూ కొంతసేపు మౌనంగా నిలబడ్డారు. వర్షపు జల్లు సన్‌షేడ్స్ మీద పడి లయబద్ధంగా శబ్దం చేస్తోంది. కొంతసేపటికి తిరిగి రామారావే ఆదుర్దాతో అన్నాడు. "ప్రొఫెసర్, ఏ కారణం లేకుండా ఒక వ్యక్తి మరొక వ్యక్తిని వెంటాడితే, అది అపరాధం క్రింద వస్తుందా, రావా?"

"మిస్టర్ రామారావ్, సలహా ఇవ్వడానికి నేనేం లాయర్ని కాను. అయినా... వెంటాడితే కేసు పెట్టవచ్చుననుకుంటాను అతడే విధంగా వెంటాడడానికి మీరేదో విధంగా బాధ్యులై యుండాలి... ఎందుకు వెంటాడుతున్నాడో బహుశ, మీకు తెలిసే ఉండాలి."

"లేదు... ఏ కారణమూ లేదు" వినమ్రంగా అన్నాడు రావు. ప్రొఫెసర్ చిన్నగా నవ్వేడు.

రామారావు తటపటాయించాడు. కొన్ని క్షణాలు మౌనంగా ఉండి అన్నాడు. "మీరు...మీరు...అది తెలుసుకుంటే ఏదో విధంగా నాకు హెల్ప్ చెయ్యగలరని అనుకుంటున్నాను."

"అదే అనుకుంటున్నాను. అయినా నువ్వు చెప్పేది పూర్తిగా వింటేనే కాని నేను నిర్ధారణగా ఏ విషయమూ చెప్పలేను. నీ మనస్సులో మెదులుతున్న విషయానికీ, ఈ నీడతో ఏ విధమైన సంబంధమూ ఉండకపోవచ్చు."

రామారావు కొంతసేపు మౌనంగా వుండి అన్నాడు.

"అది...అది...ఒక శానిటోరియమ్" ప్రొఫెసర్ తన దృష్టిని వీధిమీంచి రామారావు మీదికి మళ్ళించేరు.

"బహుశా, విమలానగర్ శానిటోరియమ్ కాదు కదా!"

"నేనన్నది అనుపమా శానిటోరియమ్ గురించి"

"ఐసీ" అంటూ నుదురు చిట్లించి "చూడు రామారావ్, నువ్వు ఎవరినైనా ఆ ప్రైవేట్ శానిటోరియమ్‌లో చేర్పించేవా? అడిగారు వారు.

రామారావు క్షణంసేపు తొట్రుపడి తిరిగి సర్దుకున్నాడు.

"లేదు... నా ఫ్రెండ్... ఒకరు ఆ శానిటోరియమ్‌లో చేర్పబడ్డారు. మే మిద్దరం మొన్న ఏకాంతం కోసం శానిటోరియమ్ నుండి టాక్సీలో బయలుదేరేం."

"జస్టు ఎ మినిట్. ఈ ఫ్రెండ్ బహుశా, నీ గర్ల్ ఫ్రెండ్ అనుకుంటాను."

"ఒకవేళ నా ఫ్రెండ్ మగాడైతే అతని రూమ్‌లో కూర్చుని మాట్లాడే వాడిని. టాక్సీలో బయటికి వెళ్ళే అవసరం ఉండేది కాదు" విసుగ్గా అన్నాడు రామారావు.

"నువ్వన్నది నిజమే. ఆమెను చాలా కాలం నుండి ఎరుగుదువు కాబోలు."

"మేం చిన్నప్పటి నుండి కలిసి మెలిసి తిరిగేము."

"ఓహో చిన్నప్పటినుండి కలిసి మెలిసి తిరిగేరు... అంటే, ఆమె స్వస్థలం గూడూరన్నమాట. ఆశ్చర్య పడకు మై బోయ్! నీ ఉచ్చారణను బట్టి, నీది గూడూరని గ్రహించేను. ఇద్దరూ చిన్ననాటి స్నేహితులు కాబట్టి, ఆమెది కూడా గూడూరే అయ్యుండాలి." అని ఆగి పైప్ పీల్చేరు వామ్ కాని వర్షానికి అది ఎప్పుడో ఆరిపోయింది. పైప్‌ని రెండు వేళ్ళమధ్య పట్టుకుని తిప్పుతూ, "అయితే రామారావ్, ఇంతకీ ఆ యువతి తల్లి దండ్రులు ఏకోవకు చెందిన వారు. ఐ మీన్, వారి సంసార ఆర్థిక పరిస్థితి..."

"మధ్య తరగతికి చెందినవారు" పూర్తి చేసేడు రామారావు.

ప్రొఫెసర్ వామ్ తల పంకించేరు.

"అయితే, ఆమెకు ధనికుడైన వ్యక్తితో వివాహం జరిగి ఉండాలి"

"మీరా అభిప్రాయాని కెందుకొచ్చారు?"

"మిస్టర్, రావ్! అన్నిటికీ మూలకారణం డబ్బు. అనువమా ప్రైవేట్ శానిటోరియమ్‌లో ఒక వ్యక్తిని చేర్పించడమంటే, సామాన్యుల కందుబాటులో లేని విషయం! ఆ యువతి మధ్య తరగతికి చెందినది కాబట్టి, తన స్వంత ధనంతో అయితే ఏ గవర్నమెంట్ శానిటోరియమ్‌లోనో చేరి ఉండేది. ఇవా పోతే, ఆమెకు ధనం భర్తనుండి రావాలి."

రామారావు ఆశ్చర్య పోయేడు.

"ప్రొఫెసర్! మీరు విడమరుస్తుంటే ఎంత సింపుల్‌గా ఉంది. ఒకదాన్నొకటి ఆధారంగా చేసుకుని ఆలోచిస్తే—?"

"వెరీ సింపుల్ మిస్టర్ రావ్." అన్నారు వామ్ చిరు మందహాసం చేస్తూ "అవును గాని... ఇందాక... నువ్వావిడను టాక్సీలో ఎక్కడికో తీసుకెళ్ళేనని అన్నావు. ఆమె పేరు?"

"సునీల, మిసెస్ సునీలా విక్రమ్‌సింహ."

"మిసెస్ సునీల నీతో టాక్సీలో శానిటోరియమ్ వదలి వచ్చింది... ఎవరో వ్యక్తి నిన్ను నీడలా వెంటాడుతున్నాడని అంతకు ముందు అన్నావు. అతడు నిన్ను ఎందుకు వెంటాడాలి? వెంటాడుతున్నాడనుకుందాం అలా అయితే అతనికి శానిటోరియమ్‌తో సంబంధం ఉండాలి కాని నాకు తెలీ కడుగుతాను. నిన్ను శానిటోరియమ్ వారు వెంటాడాల్సిన అవసరమేమొచ్చింది" అన్నారు వామ్ ప్రతిమాటను తూచి తూచి మాట్లాడుతూ.

రామారావు గాఢంగా నిట్టూర్పు వదిలేడు.

"మీకంతా చెబుతాను వినండి ప్రొఫెసర్. మేమిద్దరం కలిసి టాక్సీలో బయలుదేరేము. కాని, తిరిగి ఇద్దరం శానిటోరియమ్‌కు కలిసి వెళ్ళలేక పోయేము."

"అంటే సునీలను ఒంటరిగా శానిటోరియమ్‌కు పంపించేవా?"

"లేదు నేను, ఒక్కడినే శానిటోరియమ్‌కు మరలి వెళ్ళేను."

"ఆమెను తిరిగి శానిటోరియమ్‌లో వదలాలికదా మరి?" ఆలోచించసాగేరు ప్రొఫెసర్.

"ఆమె మధ్యదారిలో మాయమయింది" అన్నాడు రామారావు.

"వ్హాట్! ఆమె మధ్య దారిలో నిన్ను టాక్సీలో వదిలి దిగిపోయిందా?"

"అలా జరగలేదు ప్రొఫెసర్. అలా అయితే సునీల మాయ

మయిందని ఎందు కంటాను? ఆమె ఉన్నట్టుండి మాయమయింది" రామారావు కొంతసేపు మౌనంగా ఉండి అన్నాడు.

"అసలేం జరిగిందంటే, సగం దారిలో వచ్చేసరికి నా అగ్గిపెట్టెలో పుల్లలు అయిపోయేయి. టాక్సీని ఆపి దగ్గరలో ఉన్న సిగార్ స్టోర్స్‌కి వెళ్ళి సిగరెట్ పాకెట్, అగ్గిపెట్టె కొని వెనక్కి తిరిగేను. బహుశ, రెండు నిముషాలకంటె ఎక్కువ సేపు ఆగలేను. వెనక్కి తిరిగేసరికి రోడ్డు కవతలి ప్రక్కన ఇరవై గజాల దూరంలో ఉన్న టాక్సీ సునీల, డ్రైవర్‌లతో సహా మాయమయింది."

"నువ్వేం చేసేవు?"

"శానిటోరియమ్‌కు ఫోన్ చేసేను. వారు నన్ను ఒక పర్యాయం ఇంటర్వ్యూ కోసం రమ్మన్నారు."

"వారి ఆహ్వానం మీద నువ్వు వెళ్ళేవు. తర్వాత" ప్రోత్సహిస్తూ అన్నారు ప్రొఫెసర్.

"శానిటోరియమ్ వారికి జరిగినది జరిగినట్లుగా చెప్పేసేను."

"మరి సునీలేమైందో అణుమాత్రమయినా నీ ఊహకందదంటేనా?"

"తెలీదు ప్రొఫెసర్" నిస్పృహతో అన్నాడు.

వర్షం ధారగా పడుతోంది. మెర్క్యురీ దీపాల కాంతిలో వానచినుకులు ముత్యాల్లా మెరుస్తున్నాయి.

ఉన్నట్టుండి ప్రొఫెసర్ అడిగేరు. "మిస్టర్ రావ్! సునీలకి సిగరెట్లు తాగే అలవాటుండికదూ?" రామారావు కంగారుగా తనలో ఎటువంటి తొట్రుపాటు కనుపించనియ్యకుండా ఉండడానికి ప్రయత్నించి [illegible]య్యేడు. ప్రొఫెసర్ నవ్వుతూ రామారావు భుజమ్మీద తట్టి సిగ్గుపడకు మైబాయ్.

నీ గర్ల్ ఫ్రెండ్ సిగరెట్లు తాగితే నువ్వు సిగ్గుపడ నక్కర లేదు."

"ప్రొఫెసర్ ఇంతకీ మీ రలా కనిపెట్టేరు!?"

"అదంత కష్టం కాదు. ఆమె అడగడం వల్లనే నువ్వు టాక్సీలాపి రావడానికి వెళ్ళేవు. ఆమెకు మనశ్శాంతి లేక పోవడంచేత, ధనికులైన స్నేహితుల సమాజంలో తిరగడం చేత, ఆమె సిగరెట్లు అలవాటు చేసుకునుంటుంది. మనశ్శాంతి లేకపోవడం, సిగరెట్లు అలవాటు ఆమెని టి.బి. పేషంట్‌గా మార్చి వేసాయి."

"ఆ వెధవ, విక్రమ్‌సింగుగాడు బలవంతంగా సిగరెట్లు త్రాగడం నేర్పేడు. ఆ సిగరెట్లే ఆమెని టి.బి. పేషంట్‌గా మార్చేయి." రామారావు అక్కసునంతా వెళ్ళబోస్తూ అన్నాడు.

"మై డియర్ రావ్! ఇప్పుడు చెప్పు...ఆమె నిన్ను అగ్గి పెట్టె తెమ్మని అడిగిందా? లేక నువ్వే వెళ్ళేవా?"

"ఆమే ... నన్ను ... తెమ్మని ప్రోత్సహించింది" చెప్పాడు.

రామారావు దృష్టి దూరాన ఎక్కడో కేంద్రీకృతమై ఉంది. ఉన్నట్టుండి ప్రొఫెసర్ చేతిని పట్టుకుని, "ప్రొఫెసర్! అదిగో అతను...ఆనీడ...అక్కడ నిలబడ్డాడు." అన్నాడు ఆత్రుతగా.

ఇద్దరూ నిశ్శబ్దంగా నిలబడి ఆ నిశీధిలో తమ దృష్టిని సారించేరు. వాన తెరలు తెరలుగా పడుతూ దూరంగా నిలబడ్డ వ్యక్తి ఎవరైనదీ స్పష్టంగా తెలియడం లేదు.

"రోజూ అత నక్కడ నిలబడి ఏం చేసేవాడు?" అడి

గేరు ప్రొఫెసర్ మందస్వరంతో.

"ఏమీ చెయ్యడు. ఊరికే అలా నిలబడి నా ఇంటివైపు చూస్తూ ఉంటాడు. నెల రోజులున్నంది అతని కదే పని" జవాబిచ్చేడు రామారావు

"సునీల నెక్కడో దాచేవో కనుగొనడానికి ప్రయత్ని స్తున్నాడు కాబోలు."

"డామిట్, అతడు అపోహ పడుతున్నాడు" అసహ నంగా అన్నాడు రామారావు.

"చూడు, రామారావ్! అతడు సునీల కోసం వెతికితే నిన్నతడు అనుక్షణం వెన్నాడుతుండవలసింది. అతడు రోజూ నీ ఇంటిని గమనిస్తున్నాడంటే...?"

"సునీలను నా రూమ్‌లో దాచేనని అతడనుకుంటున్నాడు. అతేనా మీ రసేది."

"అయితే, సునీలని నీ రూమ్‌లో దాచలేదంటావ్?"

"ప్రొఫెసర్. మీకెలా చెప్పాలో నా కర్థం కావటం లేదు. ఒక సామాన్య బ్యాంక్ క్లర్కు ఎంతకాలం ఇలాంటి రూమ్‌లో ఒక స్త్రీ ఉనికిని ఇతరులకు తెలియకుండా దాచ గలడు. ఆ వెంటాడుతున్న వాడెవడో పిచ్చివెధవై యుం డాలి" కసిగా అన్నాడు రామారావు.

"అంతే అయుండొచ్చు...అరె, అతడు మనవైపే వస్తు న్నాడు. టార్చి వెలిగించి ఇంటి నెంబరు వెతుకుతున్నాడు."

"ప్రొఫెసర్ ఇతడు ఆ వ్యక్తి కాదు. నన్ను వెంటాడే వతను పొడుగ్గా, భారీగా మీ అంత భారీగా ఉంటాడు. ఇత డెవరో సన్నగా, పీలగా ఉన్నాడు" అన్నాడు రామారావు తేలిగ్గా శ్వాసవిడుస్తూ.

వర్షాన్ని చీల్చుకుంటూ ఆ సన్నటివ్యక్తి వస్తున్నాడు.

వానతాకిడికి అతడి చేతిలో గొడుగు వూగిసలాడుతోంది. రెండో చేతిలో టార్చి వెలుగుతోంది. టార్చి వెలుతురులో కోటు, పాంటు, తలమీద ఈవెనింగ్ కాప్ కనిపిస్తున్నాయి. అంతకుమించి అతడి స్వరూపం కనిపించలేదు.

గొడుగు పట్టుకున్న వ్యక్తి వారి సమీపానికి రావడం గమ నించి ఇద్దరూ మౌనంగా నిలబడ్డారు. టార్చి వెలుగులో అతడు వీరిని గమనించి, వీరున్న దగ్గరికి వచ్చి "మిస్టర్, దయచేసి నెం. 215 ఇల్లు ఎక్కడుందో చెప్పగలరా?" అన్నాడు.

రామారావు ముందుకి వచ్చేడు "నెం. 215 ఇల్లు ఇదే" నంటూ.

"రామారావు మీరేనా?" అడిగేడా వ్యక్తి.

"నేనే రామారావ్ని."

"థాంక్ గాడ్, రామారావ్ మీరేనన్నమాట. మీకు కోర్టునుండి సమన్స్ వచ్చేయి" అంటూ, అతడు కోటుజేబు నుండి కొన్ని కాగితాలు బయటికి తీసి టార్చి వెలుగులో పరీక్షించ సాగేడు. "విక్రమ్‌సింహ వర్సస్ సునీలా దేవి, యస్, ఉండండి, మీకు చదివి చెపుతాను" అంటూ అతడు కాగితాల మడతలు విప్ప నారంభించేడు.

రామారావు గొంతు తడారిపోయింది.

"నాకు సునీల గురించి ఏమీ తెలీదు. అయినా నాకు సమన్స్ ఎందుకు ఇస్తున్నారో తెలియడం లేదు" అన్నాడు కంగారుగా.

"మిస్టర్, రామారావ్! నేను కోర్టువారి లాయర్ని. నాకు మీ గొడవలు ఏమీ తెలియవని మీకు తెల్సు. నాపని, మీకు సమన్లు అందజేయడం. ఇంతటితో నాపని పూర్తయింది.

నేను వెళుతున్నాను" అంటూ ఆ వ్యక్తి రామారావుకి కాగితాలు అందజేసి వెనుదిరిగేడు. కొన్ని క్షణాలపాటు ప్రొఫెసర్, రామారావు లిద్దరూ చీకట్లో అతను వెళ్ళినవైపే చూస్తూ మౌనంగా ఉండిపోయేరు.

"మిస్టర్ రావ్! నువ్వతని ఆగమనాన్ని ముందే ఊహించేవా?"

"లేదు, లేదు ప్రొఫెసర్. ఇలా జరుగుతుందని కల్లో కూడా ఊహించలేదు" చేతులు నలుపుకుంటూ అన్నాడు, వానలో పచార్లుచేస్తూ. వాననీరు వేడెక్కిన అతడి మస్తిష్కాన్ని చల్లబరచ సాగింది.

ప్రొఫెసర్ ఏదో ఆలోచిస్తూ తల పంకించేడు. రామారావు చేతిలో గొడుగుని మడిచి తలుపు తెరుస్తూ అన్నాడు. "ప్రొఫెసర్, మనం ఇక్కడ నిలబడి చేసేదేమీ లేదు. ఆ వ్యక్తి ఇవాల్టికిక రాడు. లోనికి రండి. మాట్లాడుకుందాం."

"ఆల్ రైట్. ఆల్ రైట్" అంటూ ప్రొఫెసర్, రామారావు ననుసరించేడు.

ప్రొఫెసర్ని సోఫాలో ఆసీనుల్ని గావించి డ్రెస్ మార్చుకో సాగేడు రామారావు.

"మిస్టర్, రావ్! సునీలను అగ్గిపెట్టె తేవడానికి వెళ్ళే వంటూ నువ్వా కథని ఎందుకు సృష్టించినట్టు?" అని అడిగాడు ప్రొఫెసర్, రామారావు ముఖంలోకి చూస్తూ.

రామారావు ప్రొఫెసర్ని తదేకంగా చూసి "నేను చెప్పిన కథ యదార్థమే. సృష్టించినది కాదు" అన్నాడు.

"హాస్పిటల్ వారితో చెప్పడానికి నువ్వు, సునీల, ఇద్దరూ కలసి కూడబలుక్కుని కల్పించేరా కథని" ప్రశ్నార్థకంగా చూసేరు ప్రొఫెసర్.

"కాని, ఆమె నిజంగా టాక్సీతో సహా మాయమైంది" తను చెప్పేది నమ్ముతున్నట్లు చూసేడు రామారావు ప్రాధేయ పూర్వకంగా.

"ఆ సంగతి నాకు తెల్సు. కాని మీ రిద్దరూ అనుకున్న ప్లాన్ ప్రకారం చేసేరు. నువు టాక్సీ దిగి సిగార్ స్టాల్ దగ్గరికి వెళ్ళగానే — మీ ప్లాన్ ప్రకారం; ఒకవేళ నిజంగా నువ్వు సిగార్ స్టాల్ దగ్గరికి వెళ్ళితే — సునీల మాయ మయింది.

మైడియర్ బాయ్, నువ్వు కన్ఫ్యూజ్ అయి, నన్ను కూడా కన్ఫ్యూజ్ చేయడానికి ప్రయత్నించకు. సునీల టాక్సీతో మాయమైందని నన్ను నమ్మించడానికి అల్లినకథ చాలా ఇంట్రెస్టింగ్ గా, అన్ నాచురల్ గా ఉంది. అందులో కొన్ని పాయింట్లు అసందర్భంగా ఉన్నాయి. ఒకటి: టాక్సీని సరాసరి సిగరెట్ల దుకాణంవద్ద ఆపి కొనవచ్చు. రెండు: పోనీ, రోడ్ కి ఎడమప్రక్క టాక్సీనాపి కుడివైపు ఇరవైగజాల దూరంలో నున్న సిగరెట్ల దుకాణానికి వెళ్ళేవన్నావు ఇరవై గజాలదూరంలో ఉన్న టాక్సీ కదిలిన చప్పుడు నీకు వినిపించలేదంటే నాకు కొద్దిగా ఆశ్చర్యం వేస్తూంది. మూడు: సునీలకోసం అగ్గిపెట్టె కొన్నానని చెప్పే ఆమె మీద ప్రేమతో అలా చేసేవని నమ్మేందుకు ఆస్కారముంటుందని, ఆమెకు సిగరెట్లు త్రాగే అలవాటుండని అన్నావు నువ్వలా అంటావో, అనవోనని, ఆమెకి సిగరెట్లు త్రాగే అలవాటుందా అని నేనడిగిన వెంటనే నువ్వు కంగారుపడడం, సిగ్గుపడవద్దని హెచ్చరించగానే, కంగారుని సిగ్గురూపంలో కనిపింపజేయడానికి నువ్వు చేసిన నటన అద్భుతం. కాని నిజంగా నువ్వు నర్వస్ గా ఉండటంచేత నటన సాధ్యం కాలేదు." అన్నారు ప్రొఫెసర్ కవ్వింపుగా.

రామారావుకి నిలువెల్లా ఆగ్రహం ముంచుకొచ్చింది.

"మీరు మాటికి మాటికీ అలా ఎందుకు తరచితరచి ప్రశ్నిస్తారు? సునీల నలాంటి అనారోగ్య పరిస్థితిలో ఎందుకు వెళ్ళనిస్తాను?" అన్నాడు.

చిలిపిగా భుజాలెగరేసి అన్నారు ప్రొఫెసర్. "ఇరువురూ కలిసి ఆ యింట్లో ప్రవేశించడము ఎవరికంటపడినా శ్రేయస్కరం కాదని, ముందు సునీలని ఆ యింటికి వెళ్ళనిచ్చి ఉంటావు"

"ఏ యిల్లు!" ఆశ్చర్య చకితుడై అన్నాడు రామారావు.

"ఆఫ్ కోర్స్, ఆమెకోసం నువ్వు ప్రత్యేకంగా తీసుకున్న యిల్లు" అన్నారు ప్రొఫెసర్ నింపాదిగా.

రామారావు క్వశ్చన్ మార్క్ ముఖం పెట్టేడు. ఎండిన పెదిమల్ని నాలికతో తడి చేసుకుని అన్నాడు.

"ఒకవేళ ఆమెకోసం ఓ యిల్లు ప్రత్యేకంగా తీసుకున్నానే అనుకోండి ఆమెతో కలిసి ఎందుకు ప్రవేశించకూడదు."

"దేర్ యు ఆర్. అది సాధారణంగా మీలాంటి బ్యాంక్ క్లర్క్ కి తట్టే ఆలోచన. ఇప్పుడు నీ వుంటున్న రూమ్ కి సునీలను తీసుకొస్తే ఇరుగుపొరుగువారు దురభిప్రాయపడవచ్చు. క్రొత్త యింటిలో అయితే, ముందు ఆమెని దిగనిచ్చి, ఆ చుట్టుపట్లు వారి కంట ఆమెని పడనిచ్చి, నాలుగైదు రోజుల తర్వాత నువు కూడా చేరి ఆమె భర్తగా ఇంట్రడ్యూస్ చేసుకుంటే, అలాంటి దురభిప్రాయాలకు తావుండదు" అన్నారు వామ్ కూల్ గా.

రామారావు ముఖం ఎర్రనయింది. తల దించుకుని అన్నాడు. "అఁ అవును. అలాంటి ప్లానొకటి వేసుకున్నాం."

ప్రొఫెసర్ తలపంకించి అన్నారు. "అది మీరు మొట్ట మొదట అనుకున్న ప్లాన్. కాని, ఎక్కడో మీ ప్లాన్ దెబ్బ తింది. అనుకున్న ప్రకారం సునీల ఆమె కోసం ప్రత్యేకించిన ఇంట్లో కనిపించలేదు."

రామారావు బాణం దెబ్బతిన్న పక్షిలా వణికిపోయేడు. "అంత నిర్ధారణగా ఎలా చెప్పగలుగుతున్నారు ప్రొఫెసర్?" అన్నాడు.

ప్రొఫెసర్ చిరునవ్వు నవ్వి, రామారావుని భుజంమీద తట్టుతూ "మై బోయ్, విడాకులు కావాలని విక్రమసింహ అందజేసిన సమన్స్ చూచి నువ్వు పొందిన దిగ్భ్రమే చెపుతోంది, సునీల ఇప్పుడెక్కడుందో నీకు తెలియదని. అసలు నువ్వామెతో టాక్సీలో వెళ్ళనే లేదు" అన్నారు.

రామారావు ఆదుర్దాగా ప్రొఫెసర్ చేతులు పట్టుకుని "సర్, సునీతెక్కడుందో మీకు తెలుసు. నామీద దయుంచి చెప్పండి. ఆమె కోసం నేను పడిన వ్యధకు అంతులేదు. ఓహ్! నా బుర్ర వేడెక్కిపోయింది" అన్నాడు. ఇప్పుడతని బుర్రలో తన్ను వెంటాడిన నీడని గురించిన ఆలోచన లేదు. మెదడంతా సునీలను గురించిన ఆలోచనల్తో నిండిపోయింది.

ప్రొఫెసర్ అతన్ని భుజమ్మీద తట్టి స్థిమిత పరుస్తూ, "మిస్టర్ రామారావ్, సునీతెక్కడికి కెళ్ళిందో చెప్పలేను. కాని ఒకటి మాత్రం చెప్పగలను. ఎప్పుడైతే ఆమె స్వేచ్ఛ పొందుతుందో అప్పుడు నీదగ్గరికి రాగలదు. ఆమె ఇప్పుడింకేదో ప్లాన్ మీదుంది" అన్నారు.

"కాని ఆమె నన్ను ప్రేమించింది ప్రొఫేసర్. ఆమె తన జీవితాన్ని అశాంతిగా గడుపుతోంది. విక్రంసింహాగాడు లోభిష్ఠి వెధవ. పైకి గొప్ప భాగ్యవంతుడిలా కనిపిస్తాడు.

అతడు ధనవంతుడని సునీలతన్ని పెళ్ళాడింది. ఆ పేదవ సునీలను సరిగా పోషించడు. లోకువేయనుకుంటారేమోనని కానిటోరియంలో చేర్పించేడు సునీలకి ఆ విషపూరిత వాతావరణం నచ్చక నా దగ్గరికి వద్దామనుకుంటున్నాది. తిరిగి ఆ వాతావరణంలోకి కోరి వెళ్ళదు" ఆవేదనతో అన్నాడు రామారావు

ప్రొఫెసర్ అతన్ని ఆపి అడిగేరు. "మీ రిరువురు పరస్పరం ఎలా సంప్రదించేవారు? ఐ మీన్ టెలిఫోన్ లేక లెటర్."

"ఒకరి కొకరం ఉత్తరాలు వ్రాసుకునేవారం" అన్నాడు రామారావు.

"ఆల్ రైట్. అయితే...ఆమె ఉత్తరాల్ని నువ్వు దాచే వుంటావు...ఎంతయిలా బ్యాంక్‌లో పనిచేస్తూండడంవలన నీకా జాగ్రత్త ఉంటుంది."

"ఉండండి. ఇప్పుడే తెస్తాను" అంటూ షెల్ఫు తెరిచి ఒక ఫైల్‌ని బయటికి తీసేడు. కుర్చీని టేబుల్ లైట్ కాంతి పడేట్లు దగ్గరికి లాగి కూర్చొని, ఎకౌంట్స్ రిజిష్టర్ని పరీక్షించినంత జాగ్రత్తగా ఒక్కొక్క లెటర్ని పరీక్షించసాగేడు. ఒక ఉత్తరాన్ని పైకి తీసి "ఇదిగో ప్రొఫెసర్, నాతో వచ్చేయడానికి ఇష్టపడుతున్నట్లు సునీల చూచాయగా తెలిపిన ఉత్తరాల్లో మొదటిది" అన్నాడు.

ప్రొఫెసర్ సాలోచనగా తల పంకించి "ఊఁ, ఇంతకీ ఆమె రాసిందన్న మాట." అన్నారు.

రామారావు చూపుడు వ్రేలితో కొట్టి చూపిస్తూ, "ఇదిగో ఈ ఉత్తరం రుజువుండిగా" అన్నాడు.

"ఆమె ఏం వ్రాసిందో, నేను చూడొచ్చా" అన్నారు.

రామారావు తటపటాయించాడు. చివరికి ఆ ఉత్తరాన్ని క్రిందా, మీదా మడిచి ఒక్క వాక్యం మాత్రమే కనబడేట్లు ప్రొఫెసర్‌కి చూపించాడు.

అందులో ఇలా ఉంది: "...ఇప్పటికి ఇలా గడిపివేద్దాం. రామం, నిన్న మద్రాసు వాతావరణం ఎలా మార్చి వేసిందో కాని, నాకు మట్టుకు, మనిద్దరం గూడూరుకి వెయ్యిమైళ్ళ దూరంలో ఉండాలనిపిస్తూంది."

ఆ వాక్యం చదివిన ప్రొఫెసర్ భ్రుకుటి ముడుతలు పడింది.

"ఇదేదో విచిత్రంగా వుంది" అన్నారు మెల్లగా.

"అందులో విచిత్రమైన విషయమేముంది?" అడిగాడు రామారావు

"ఒక స్త్రీ, ఒక యువతి నీతో చర్చిస్తావన్న విషయాన్ని సూచిస్తూ, మద్రాసు వాతావరణం నీ మనస్సు మార్చి వేసింది అంటూ మధ్యలో మాట్లాడుతూ వ్రాసింది. మిస్టర్ రావ్! ఒకవేళ ఈ ఉత్తరం నువ్వు సునీలకు వ్రాసిన దానికి కాపీ కాదు కదా?" అని ఆగి "ఊహుఁ, అలా అయి ఉండదు" అన్నారు తనలో తానే.

"అలా ఎందుకనుకుంటున్నారు?"

"ఎందుకంటే, సునీల నిన్న ప్రోత్సహిస్తూ, నీ మనసు మద్రాసు వాతావరణానికెలా మారిపోయిందో అంటూ మధ్యలో మార్చివేసింది—ఆ ఐడియా ఆమె మస్తిష్కంలో ఎలా ప్రవేశించి ఉంటుంది

ఒక విషయాన్ని సూచిస్తూ 'మధ్యలో మార్చివేయడం మగవారి కలవాటు. సునీల నిష్ఠురపూర్వకంగా అలా వ్రాసిందనుకుంటే మాటల పొందిక వేరే విధంగా వుండేది. నో అలా అయివుండదు" అన్నాడు తీవ్రంగా ఆలోచిస్తూ.

"కాని నిజానికి సునీతే అలా వ్రాసింది ప్రొఫెసర్" అన్నాడు రామారావు.

"ఊఁ, అలాగే కనిపిస్తోంది తర్వాత ఆమె మాయమైంది. తన ప్లాన్ పూర్తిగా కొనసాగకుండానే."

ప్రొఫెసర్ ఆ ఉత్తరంలోకి తదేకంగా చూడసాగేరు. కొంతసేపయాక రామారావుకేసి తిరిగి "మిస్టర్ రామారావ్, ఆమె వ్రాసిన ఉత్తరాలు ఇంకా వుంటే చూపించు. నేను చూడదగినవి మాత్రమే ఇయ్యి" అన్నారు.

రామారావు ఫైల్ నుండి నాలుగైదు ఉత్తరాల్ని వెదికి ప్రొఫెసర్ కందించాడు. అతను వాటిని టేబుల్ పైన పరిచి కొంతసేపు పరీక్షించి పెదవి విరిచేరు.

"రావ్, ఒకరి సంతకాన్ని వేరొకరు ఫోర్జరీ చెయ్యడ మన్నది కష్టమని నీకు తెలిసే వుంటుంది. ఒకరి వ్రాతను ఫోర్జరీ చెయ్యడమన్నది మరీ కష్టమయిన పని. ఈ రెండు పనులు శారీరికకృత్యం లేక మెకానికల్ విభాగంలోకి వస్తాయి. ఇవా పోతే, మానసికంగా చూస్తే ఒక పురుషుడు, ఒక స్త్రీ మనస్సులో కలిగే ఆలోచనల్ని డూప్లికేట్ చెయ్యడం, అసాధ్య మంటాను."

రామారావు టేబుల్ మీదికి వంగి "అయితే, మీకు చూపించిన ఉత్తరం ఫోర్జరీ చెయ్యబడిందంటారా?" అంటూ అడిగాడు ఆశ్చర్యంతో.

"సరిగ్గా అలాగే జరిగింది. ఎవరో పురుషుడు. సునీలచేత అలా వ్రాయించేడు." అన్నారు.

"కాని ఎవరలా చేసింది?"

"జ్ఞాపక ముంచుకో రామారావ్. సునీల వ్యవహారంలో అలా చేస్తే లాభించేవ్యక్తి ప్రపంచంలోకల్లా ఒక్కడే ఉన్నాడు" అన్నారు.

"ఎవరతను?"

"అఫ్‌కోర్స్ ఇంకెవరు? విక్రమ్ సింహా."

రామారావు నిశ్శేష్టుడై ఉండిపోయేడు. తడబడుతూ అన్నాడు "మీ రనేది...ఆమె భర్త...విక్రమ్ సింహా... తానే ఆమెచేత అలా వ్రాయించేడంటారా? నాతో లేచి పోవ్వాలనే ఐడియా ఆమె మస్తిష్కంలో ఉద్దీపింప జేసే డంటారా?"

"షర్టన్లీ. సునీల, నీతో లేచిపోతే అతనికి భరణమిచ్చే బెడద తప్పుతుంది. అతడామెకు తేలిగ్గా విడాకు లిచ్చెయ్య గలుగుతాడు."

"కాని, మేము పరస్పరం ఉత్తరాలు వ్రాసుకుంటామన్న సంగతి ఎలా తెలిసిందతనికి?"

"హాస్పిటల్ నర్సులు ద్వారా నీ ఉత్తరాల్ని చదివి ఉంటాడు. లేక నర్సులు చదివి చెప్పి వుంటారు."

"మీ స్నేహం తెలియక మొదట శానిటోరియంలో చేర్పించి ఉంటాడు. తెలిస్తే అప్పుడే విడాకులిచ్చేవాడు. ఇప్పుడు విడాకులిస్తే ట్రీట్‌మెంట్ కయ్యే ఖర్చు, నీతో లేచిపోతే, భరణం ఇవ్వనక్కరలేదు. ఇదీ విక్రమ్‌సింహ ప్లాన్" అన్నారు వామ్.

"అయితే, సునీలిప్పుడెక్కడుంది? విక్రమ్‌సింహ ఆమెను వెంటాడి ఆ యింటికి వెళ్ళి ప్రతీకారం చేసి వుంటాడా?"

"ఆ విషయమై నేనేమీ చెప్పలేను. అన్నట్టు మిస్టర్ రావ్, సునీల అందకత్తె అంటావా?"

రామారావు గాఢంగా ఊపిరి పీల్చి వదిలేడు.

"నేను చూచిన స్త్రీలందరిలో కల్లా అందమైదని చెప్ప గలను."

"వయస్సు?"

"ఇరవై ఆరు మొన్ననే నిండేయి. ఆమె భర్త దేశాడుం నాకు ఉత్తరం రాసింది."

"ఆమె ఫోటో ఉంటే చూపించగలవా?"

"ఉండండి జస్టు ఎమినిట్" అంటూ తిరిగి షెల్ఫు దగ్గరికి వెళ్ళి ఒక కాబినెట్ సైజ్ ఫోటోని తీసి ప్రొఫెసర్ వామ్ కందించేడు. ప్రొఫెసర్ దాన్నందుకుని పరీక్షించేడు. ఒక చక్కని అమ్మాయి చేతిలో పూలగుత్తి పట్టుకుని నిలబడి ఉంది. ఫోటో వెనుకకు తిప్పి చూచి పరీక్షించేడు.

"ఇది గూడూరులో చాలకాలం క్రితం తీయబడినట్లుంది."

"అవును సర్. ఆమె హైస్కూల్ చదువు అప్పటికి పూర్తి అయింది. మా స్కూల్ ఏన్యువల్ ప్రోగ్రామ్ సందర్భంలో ఆ ఫోటో తీయబడింది." అన్నాడు రామారావు

"బహుశా, ఆమె ఇలా ఉండదిప్పుడు. దీని తర్వాత తీయబడిన ఫోటోలుంటే ఓసారి చూపించు"

"ఇం లేవు" అంటూ రామారావు ఫోటో నందుకున్నాడు.

షెల్ఫులో ఉంచుతుండగా అతని కేదో జ్ఞాపక మొచ్చి "వెయిట్ ఎమినిట్ ప్లీజ్! ఈ మధ్యనే ఆమె తీయించుకున్న ఫోటో ఒకటి నాకిచ్చింది. కాని అది అంత బాగా లేదు" అంటూ డైరీలోంచి ఓ ఫోటో తీసి అందించేడు.

వామ్ ఆ ఫోటోని జాగ్రత్తగా పరికించేరు. ఫోటో సాదాగా ఉంది సునీల చాల చిక్కినట్లు కనిపిస్తోంది. అయినా చక్కదనానికి కొంచెమైనా లోటు కలగ లేదు. ఫోటోని చూస్తున్న ప్రొఫెసర్ దృష్టి నేదో ఆకర్షించింది.

"రామారావ్! సునీల నీ కోసం ఈ ఫోటో తీయించుకున్నట్టు లేదు. మిగతా కాపీలను ఏం చేసిందో నీకు చెప్పిందా?"

"నిజమే నాకోసం ప్రత్యేకంగా తీయించుకోలేదు. శాని టోరియంవారు ఆమెకు ఫోటో తీసేరు. అప్పుడు ఒక కాపీ నా కివ్వడానికని వారి నడిగి తీసుకుంది."

"శానిటోరియంవారు ఆమెకి ఫోటో తీయించేరా! నువ్వ నేది...శానిటోరియమ్ అథారిటీస్ ఆమె ఫోటో కావా లన్నారా!"

"యస్...అఫ్‌కోర్స్ అలా అని సునీల నాతో చెప్పింది."

"ఇలాటి ఫోటో కావాలని అథారిటీస్ అడిగినట్లు సునీల నీతో చెప్పిందా?"

"అవును" అన్నాడు రామారావు జ్ఞాపకం తెచ్చుకుంటూ. "శానిటోరియం రికార్డ్సులో ఎక్కుతున్న తను; ఫోటోలో ఎలా కనిపిస్తున్నానో చూడమని చెప్తూ ఈ ఫోటోని నా కిచ్చింది."

"శానిటోరియమ్ వారి రికార్డ్సు!?"

"అవును. శానిటోరియంలో చేరే ప్రతి వ్యక్తి ఫోటో వారి రికార్డ్సులో ఉంటుంది."

"కాని సునీల క్రొత్తగా జాయినవ్వటం లేదనుకుంటాను"

"ఆహాం, ఆమె చేరి ఇప్పటికి సంవత్సరంపైగా అయింది."

"అయితే చేరిన సంవత్సరానికి శానిటోరియం వారికి హాఠా త్తుగా ఆమె ఫోటో ఒకటి కావలసొచ్చిందా?"

"అవును. కొంచెం వింతగా వుంది ప్రొఫెసర్."

"ఉత్త వింత అని ఊరుకోవడం ముఖ్యమైన లింకు జార విడుచుకోవడమన్నమాట. ఏదో బలమైన కారణముండి ఉంటుంది"

"సర్, సునీల నాతో వచ్చేస్తున్నదనే విషయం శాని టోరియం వారికి తెలిసి పోలేదు కదా! పోలీసువారామెను

వెదకడానికి ఫొటో కావలసి వస్తుందని, ఫొటో తీయించి ఉండాలి" అన్నాడు పెదిమలు తడి చేసుకుంటూ.

వామ్ పెదవి విరిచి అన్నారు. "సునీల పారిపోతుందని వారికి తెలిస్తే, సునీలే స్వయంగా వారి అధీనంలో ఉండగా, ఆమె ఫొటోతో వారికి అవసర మేముంది? నో. ఫొటో తీయించడానికి కారణమది అయ్యుండదు."

"అది నిజమే." అంటూ తేలిగ్గా శ్వాస వదిలేడు రామారావు.

సైకాలజిస్టు వామ్, సునీల ఫొటోని చూస్తూ, టేబుల్ని మునివేళ్ళతో మీటుతూ ఆలోచించసాగేడు. ఉన్నట్టుండి ఆయన కళ్ళు ఆశ్చర్యంతో విప్పారేయి.

"మైగాడ్! వెదకబోయిన తీగను కళ్ళముందుంచుకుని తప్పు దారిన ప్రయాణిస్తున్నాం!" అన్నారు.

"వ్వాట్!"

వామ్ చూపుడు వేలితో ఫొటోని చూపిస్తూ "దీన్ని... శానిటోరియంవారు తమ రికార్డ్సులో వుంచేందుకు తీయించక పోతే—సునీల అదృశ్యకపోతే—ఇక కేవలం ఒకే ఒక్క ప్రయోజనార్థం నిర్దేశించబడింది" అన్నారు.

"మరి దేనికోసమంటారు?"

"అఫ్‌కోర్స్. పాస్‌పోర్ట్ కోసం ఫొటో పాస్‌పోర్టు సైజ్‌లో ఉంది. ఇది సరిగ్గా పాస్‌పోర్టు ఫినిషింగ్‌లో ఉంది."

"పాస్‌పోర్ట్!" ఆశ్చర్యంతో అరిచేడు రామారావు. అతని అరుపుకి గదంతా ప్రతిధ్వనించింది.

"షురర్లీ. ఆమె భర్త, విక్రమ్‌సింహా ఫొటో తీయించే ఏర్పాట్లు చేయించేడు. సునీల పేరుతో పాస్‌పోర్ట్ తీసేరు.

సునీల విదేశాలకు వెళ్ళి పోయింది." రామారావు జావకారి పోయేడు. రెండు చేతులమధ్య తల నిరికించుకుని "చివరికి నన్ను వదలి వెళ్ళిపోయిందన్నమాట" ఏడ్చినంతపని జేశాడు.

"నో. నో. ఆమె నిన్ను వదలి వెళ్ళలేదు. ఆ ఫొటో నీ కిచ్చిన తర్వాత అలా చేయదు."

"ఎలా అనుకుంటే ఏం? అతడు తన భార్యను తీసుకుని వెళ్ళిపోయేడన్నమాట" నిరాశగా అన్నాడు రామారావు.

"ప్లీజ్ నో. మీ రిద్దరూ వెళ్ళిపోయేందుకు వీలు కల్గించి, దానివల్ల భరణ మిచ్చే బెడద తప్పించుకున్న తర్వాత ఆమెను వెంటబెట్టుకుని వెళ్ళడు."

ఈ లాజిక్‌తో రామారావ్‌కి అంతా అయోమయంగా తయారయింది. ప్రొఫెసర్, రామారావ్‌ని పట్టించుకోకుండా తన ఆలోచనల్ని కొనసాగించేరు.

"విక్రమ్‌సింహ మొదటి ఐడియా ప్రకారం, అతడికి చాలా ధనం మిగుల్తుంది. తర్వాత అతడి బుర్రలో ఏదో దూరింది. అది, అదేమైనా కావచ్చు అతడికి ధనం వచ్చే మార్గమై యుంటుంది."

"ఎలా వస్తుందా ధనం?" అడిగేడు రామారావు.

"ఎప్పుడైతే — సునీలని ఒంటరిగా టాక్సీలో ఆ ఇంటికి వెళ్ళమని — నీవు రాసిన ఉత్తరంలో చదివాడో, తక్షణమే సునీల పేర్న పాస్‌పోర్టు తీయించి తద్వారా విదేశాలకు అమ్మేసి వుంటాడు."

"వ్హాట్!!!" కుర్చీలో అదిరిపడ్డాడు రామారావు.

"అవును. విక్రమ్‌సింహ ఆమెని కిడ్‌నాప్ చేసి, అమ్మేసి ఉంటాడు... అన్నట్లు సునీల మాయమైందెప్పుడు?"

"మొన్న మధ్యాహ్నం."

"మొన్నటి దినపత్రికలున్నాయా నీదగ్గర?"

రామారావు తటాలున లేచి వారం రోజులున్నుండి వచ్చిన డెయిలీస్‌ని వరసగా టేబుల్ మీద పరుస్తూ, "వారు తెలీ కడుగుతాను ప్రొఫెసర్. విక్రమ్‌సింహా ఆమె నెలా అమ్మ గలడు. సంతలో దొరికే వస్తువు నమ్మినట్లు...?"

ప్రొఫెసరతన్ని మధ్యలో వారించి "నా కాయాన కార్య క్రమాల లిస్టులు బయటికి తియ్యి...క్విక్...ఏయే షిప్‌లు మొన్నరాత్రి హార్బర్‌లో బయలుదేరడానికి సిద్ధంగా వున్నాయి?"

వామ్ చకచకా వెదికి, స్టీమర్స్ పేర్లని చదవ సాగేరు.

"మెగాంటిక్, జలరత్న, క్వీన్ ఆఫ్ ఇండియా. కేప్ ఆమెరికానా, మెజస్టీ ఆఫ్ కైరో, పెర్ల్ ఆఫ్ కైరో, నా అభిప్రాయప్రకారం సునీతని కైరో షిప్‌లో ఎక్కించి వుంటారు."

"ఏ ఆధారమ్మీద చెప్పగలుగుతున్నారు" అడిగేడు రామారావు.

"ఎందుకంటే యూరోప్ వారికి విదేశస్త్రీలను కొను క్కునే అగత్యం లేదు. కైరోలో స్త్రీల కొనుగోలు వ్యాపారం ఈ మధ్య ముమ్మరంగా సాగుతోంది. అన్నట్టు విక్రమ్‌సింహా వుండే దెక్కడ?"

"ఫిఫ్త్ క్రాస్ రోడ్‌లో ఏదో లాడ్జిలో ఉంటున్నాడు" అంటూ నుదురు కొట్టుకుంటూ లాడ్జి పేరుకోసం ఆలోచించ సాగేడు రామారావు.

"ఆల్‌రైట్. ఫిఫ్త్ క్రాస్‌రోడ్‌కి దగ్గర్లో వున్న టెలి గ్రాఫ్ ఆఫీస్‌నంబరు ... క్విక్" అంటూ డైరెక్టరీ అందుకుని నెంబరుకోసం వెదక సాగేరు వామ్.

"ఊఁ, దొరికింది" అంటూ చకచక డయిల్ చేసి "ఈజిట్ ఫిఫ్త్ క్రాస్‌రోడ్, టెలిగ్రాఫ్ ఆఫీస్...విక్రమ్‌సింహా స్పీకింగ్. నా పేర్న ఓ మెసేజ్ వస్తుంది...అరె!...నా అడ్రస్‌కి పంపించేరన్నమాట...థాంక్స్!...మెజస్టీ ఆఫ్ కైరోనుండి కాబోలు...వాట్?...పెర్ల్ ఆఫ్ కైరో నుంచా?...ఆల్ రైట్. ఈ మెసేజ్‌ని తీసుకోండి...టు ది కేప్టెన్, పెర్ల్ ఆఫ్ కైరో, మీషిప్‌లో ఒక యువతి, ఓ పురుషుడి కస్టడీలో వుంది. యువతి అనారోగ్యంగా వుంటుంది. పురుషుడు హాస్పిటల్ వారి తరఫునుండి వచ్చినట్లు చలామణీ అవుతున్నాడు. ఆమెపై మత్తుమందు ప్రయోగించబడి ఉంటుంది. ఆమెను విముక్తురాల్ని చేసి, అతడ్ని బంధించండి. ఈ ఆర్డర్‌ని కన్‌ఫర్మ్ చేస్తూ పోలీసువారినుండి మీకు ఇప్పుడే వైర్ రాగలదు. ఇట్లు-ప్రొఫెసర్ వామ్. యస్ దట్స్ కరెక్టు!...ప్రొఫెసర్ వామ్ అంటే అతనికి అర్ధమవుతుంది. థాంక్యూ ఆపరేటర్" ఫోన్‌ని క్రేడిల్ మీద వుంచి సోఫాలో వెనక్కి వాలేడు వామ్. రామారావు ఇంకా అయోమయ పరిస్థితిలో వున్నాడు. "మైగాడ్...హారిబుల్...సునీలని పశువునమ్మినట్లు అమ్మేసేడన్నమాట...రాస్కెల్!...ప్రొఫెసర్, మీరు బహుశా, తప్పుగా అంచనా వేయలేదు కదా!"

"నో...నా అంచనా తప్పదు. సునీల నీకా ఫొటోగ్రాఫ్ ఇచ్చివుంటే, ఆమె విదేశాలకు వెళ్ళుతున్న సంగతి ఆమెకు తెలియకుండా వుంటుంది. ఈ ఫొటో పాస్‌పోర్టుకోసమై నిర్దేశించబడింది కాబట్టి, సునీలకు తెలియకుండా పాస్‌పోర్టు ఫోర్జరీ కాబడింది. అంటే, సునీల కిడ్‌నాప్ చేయబడింది. విక్రమ్‌సింహా ఆమెని కిడ్‌నాప్ చేస్తే, అతడే ఆమెని అమ్మేసి వుంటాడు. ఇందులో అణుమాత్రమైనా సందేహంలేదు."

రామారావు నోటమాట లేకుండా వుండిపోయేడు.

వామ్ సోఫాలో వెనక్కి వాలి, నుదురు చిట్లించి రామా రావుకేసి చూస్తూ "ఇది విక్రమ్‌సింహా మొదటి నేరమై యుండదు ఇంతకు పూర్వం ఎంతమంది మాయమైన స్త్రీలకి విడాకు లిచ్చేడో అడిగి కనుక్కుంటాను." అంటూ రిసీవర్ని అందుకున్నారు.

రామారావు క్షణంసేపు ప్రొఫెసర్ని చూసి "మీరిప్పు డెవరికి ఫోన్ చేస్తున్నారు?" అని అడిగేడు.

"ఆఫ్‌కోర్స్ పోలీసు వారికి. విక్రమ్‌సింహా ఖాతా రికార్డుని తెమ్మని ఫోన్ చేస్తున్నాను" అంటూ డయల్ చెయ్య సారంభించేరు వామ్.

రామారావు గాఢంగా ఊపిరి పీల్చి వదిలేడు

వామ్ పోలీసులకు ఫోన్ చేసి, రామారావ్ కేసి తిరిగాడు.

"నువు మానసికంగా బాధ పడుతున్నావని, ట్రీట్‌మెంట్ కోసం నా దగ్గరికి వచ్చేవు. ఔనా?"

"ఆ... అవును."

"నువ్వెందుకు నర్వస్‌గా వున్నావో నేను కనిపెట్టేను. సునీలకోసం తీసుకున్న ఇంటిమీద, ఫర్నిచర్ కోసం, ఆమె కిచ్చిన ప్రెజంటేషన్ల కోసం చాలా ధనం-నీది కాని ధనం- ఖర్చుపెట్టేవు. నిజమేనా?" గుచ్చిగుచ్చి చూస్తూ అడిగేరు వామ్.

రామారావు గుటకపట్టి చూసేడు. "అంటే...అంటే... ఈ విషయం బ్యాంక్‌వారికి తెలిసి పోయిందన్న మాట. నన్ను వెంటాడిన నీడ బ్యాంక్ వారిచే నియోగింపబడ్డాదన్న మాట."

ప్రొఫెసర్ వామ్ చిన్నగా నవ్వి, "నన్ను బ్యాంక్‌వారు తమ స్టాఫ్ చేస్తున్న అవకతవకలలోని అంతరార్థం కనిపెట్టేం దుకు నియమిస్తారు. మిస్టర్ రామారావ్! నిన్ను వెంటాడిన నీడ ఎవరో కాదు... నేనే."

* * *

లీడర్స్ క్లబ్

—టెంపోనాథ్.

పోటీ నెం-2

(బహుమతి రు. 50/- లు.)

జయలక్ష్మీదేవిని సినీతార అనడం కన్నా ఎక్స్ సినీతార అనడం సబబు. రెండేళ్ళుగా సినిమాలలో ఎక్కువగా కని పించడం లేదు. ఆవిడకు ముప్ఫై ఏళ్ళుంటాయి. అందంగానే వుంటుంది. రెండు సంవత్సరాల క్రితమే ఎవరినో లక్షాధికారిని, రెండో పెళ్ళి చేసుకొంది. ఆయనకూడా సుమారు ఆరు నెలల క్రితం మరణించాడు. అప్పటినుండే చెడుతిరుగుళ్ళు తిరగడం ఎక్కువైందనీ, సినిమా రంగంలోని పెద్దమనుష్యులతోకూడా పోట్లాడి సినిమాల్లో నటించే అవకాశాన్ని దూరం చేసుకుం దనీ వినికిడి.

జయలక్ష్మీదేవి ఇంటిబయట లైట్లు దేదీప్యమానంగా వెలుగుతున్నాయి. గుమ్మందాటి లోనికి ప్రవేశించాను. ఇన్ స్పెక్టర్ భక్తవత్సలం ఎదురొచ్చి, నన్నులోనికి తీసుకెళ్ళాడు. హాలుపట్టపగలులా లైట్లతో వెలిగిపోతూ అందంగా వుంది. చక్కటి కలర్ పెయింటింగ్స్, అక్కడక్కడ సినీతార జయ లక్ష్మీదేవి రకరకాల ఫోజులు నిండుగా ఉన్నాయి.

ఒక ప్రక్కగా ఉన్న పడకగదిలోకి తీసుకెళ్ళాడు.

గుమ్మంబయట ఒక ముసలివ్యక్తి నిలబడి కళ్ళు వత్తుకుంటు

న్నాడు. ఇంటి నౌకరయ్యుండాలి. గదిలోపల ఒక ప్రక్కగా యిద్దరు మగాళ్ళు విచారంగా నిలబడి వున్నారు. మరో యువతి మంచం ప్రక్కగా కుర్చీలో కూర్చుని వెక్కి వెక్కి ఏడుస్తోంది.

మంచం వంక చూసాను. బెడ్ మీద జయలక్ష్మీదేవి నిర్జీవంగా పడి వుంది. అందమైన మొహం పాలిపోయింది.

మంచం క్రింద నేలమీద ఒక 'రైఫిల్' కనిపించింది. అందులో పేలిన తుపాకీగుండే ఆమె గుండెల్లోనుండి దూసుకుపోయుండాలి. రక్తం ధారగా కారి పరుపుమీద మడుగు కట్టింది. హత్యజరిగి కొద్దిసేపే అయ్యుండాలి. రక్తం తడిగా ఎర్రగా కనిపిస్తోంది. గాలిలో రక్తం వాసనకూడా కొద్దిగా కలసివుంది.

దగ్గరగా వెళ్ళి శవాన్ని నిశితంగా పరిశీలించాను.

గుండెల్లో, వక్షోజాల క్రిందుగా రెండు ఎర్రటిరంధ్రాలు. అంటే రెండు తూటాలు ఆమె శరీరంలోకి దిగుమతి చేయబడిందన్నమాట. పడుకొని వున్న మనిషి గుమ్మంవద్ద చప్పుడు విని కొద్దిగా తల పైకెత్తి వుండాలి. హంతకుడు ఆ క్షణంలో తుపాకీ పేల్చడంతో, ఆమె ఉన్నపాటున నేలకూలి యుండాలి. ఆశ్చర్యాన్ని, బాధను మిళితంచేసిన ఆమె మొహం ఒక ప్రక్కకు వాలిపోయి వుంది. గుండు తగిలిన అయిదారు నిముషాలకు ప్రాణం పోయిందేమో, ఆ దొరికిన సమయంలోనే అతి కష్టంమీద ఏదో చెప్పబోయి మాట మధ్యలోనే ఆగిపోయినట్టుంది. నోరు కొద్దిగా తెరచి వుంది.

వెనక్కు తిరిగి 'రైఫిల్' పడున్న స్థలంవద్దకు వచ్చాను. జేబులోనుండి నేనుపయోగించే భూతద్దం, సిగరెట్ పెట్టె లాంటి మరో చిన్నపెట్టె బయటకు తీసాను. గాయపడ్డ

వారికి ఫస్టు ఎయిడ్ బాక్స్‌లా క్రిమ్స్‌లో ఆన్-ది-స్పాట్ స్టడీ చేయుడానికీ, ప్రైమరీ పాయింట్స్ తెలుసుకోడానికి ఈ పెట్టెలోని వస్తువులు ఎంతో ఉపయోగపడతాయి. పెట్టె తెరిచి లోపల ఒక అరలో వున్న తెల్లటి పౌడర్‌ను చిన్న స్పూన్‌తో తీసి, రైఫిల్ 'బట్' మీద చల్లి భూతద్దంతో పరిశీలించాను. ఆ పౌడరు ఒక రకమైన కెమికల్ మిక్చర్. వేలి ముద్రలు అవీ తొందరగా చూపెడుతాయి.

ఇందులో నా కెలాటి వేలిముద్రలు కనిపించలేదు. రైఫిల్ అంతా సాఫీగా వుంది. అంటే హంతకు లెవరోగాని వేలి ముద్రలు పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్టుంది.

తుపాకీని చేతుల్లోకి తీసుకొని పరిశీలించాను. పాత మోడల్. కీ రిలీజ్ చేసి మాగజైన్ తెరిచి చూసాను. అందులో ఒకే బుల్లెట్ వుంది.

గదిని మళ్ళీ పరికించాను. ఎదురుగావున్న గోడలోకాని మరెక్కడా మరేవిధమైన చిహ్నాలు నాక్కనిపించలేదు. అంతా మననం చేసుకొని భక్తవత్సలం వంక చూసాను. "ఈ పాత రైఫిల్ ఎక్కడిదో, యిక్కడి కెలా వచ్చిందో కను క్కున్నారా" అని అడిగాను.

"ఆఁ!... యిదిగో, ఈ అమ్మాయికి శ్రీమతి జయలక్ష్మీ దేవి పినతల్లి అవుతుంది. లేట్ మిస్టర్ శంకర్ దివాకర్‌గారి మొదటి భార్య కూతురు మిసెస్ రాజామణి...ఈయన, ఆవిడభర్త మిస్టర్ మధుసూధన్...అతను ఈ యింటికి, ఎస్టేట్‌కు మానేజర్ మిస్టర్ రంగారావ్..." అని అంటూ అందరితోనూ పరిచయాలు చేయించాడు. రాజామణి కుర్చీలో కూర్చొని యింకా వెక్కి వెక్కి ఏడుస్తూనే వుంది. అందరి వంకా ఓసారి చూసి గది బయటకు వచ్చేసాను.

ఇన్‌స్పెక్టర్ భక్తవత్సలం చెప్పేదంతా జాగ్రత్తగా ఆలకించాను. దివాకర్ శంకర్‌గారు లక్షాధికారి. ఆయన మొదటి భార్య కూతురు రాజామణి రెండు సంవత్సరాల క్రితమే జయలక్ష్మీదేవిని వివాహమాడాడు. కొత్తభార్య మోజుల్లో పడి, ప్రేమకొద్దీ ఓసారి తన ఆస్తంతా ఆమె పేర వ్రాశాడు. కూతురును అశ్రద్ధ చేసాడు. ఆ అమ్మాయి తన కాలేజీ స్నేహితుడైన మధుసూధన్‌ను ప్రేమించి జయలక్ష్మీదేవి యిష్టానికి వ్యతిరేకంగా పెళ్ళిచేసుకుంది. అప్పటినుండీ ఆవిడకు రాజామణి అంటే కోపం. ఆర్నెల్లక్రితమే కట్టుకున్న భర్త కూడా మరణించాడు. ఆస్తి ఆవిడ వశమైంది. ఎంతో విచ్చలవిడిగా ప్రవర్తించింది. ఎందరితోనో సంబంధాలేర్పరుచుకొని అయినవాళ్ళను కాదంది సగం ఆస్తిని నాశనం చేసింది. అయినా రాజామణి పినతల్లి అనే గౌరవం కొద్దీ ఏమీ అనకుండా మౌనంగా సర్దుకుపోతోంది.

ఈరోజుకూడా మామూలుగా అందరూ ఎనిమిది గంటల ప్రాంతంలో భోజనాలు ముగించారు. అందరికీ ప్రత్యేకమైన గదులున్నాయి. రంగారావ్, రాజామణి, మధుసూధన్ వాళ్ళ గదులు పైన వున్నాయి. క్రింద ఒక్క జయలక్ష్మీదేవి మాత్రమే పడుకుంటుంది. ఈ నలుగురితోపాటే మరో యిద్దరు నౌకర్లుకూడా ఆ యింట్లో వున్నారు...వారిలో ఒకడు ఈ రోజే సాయంత్రం సినిమా కెళ్ళాడట.

సుమారు తొమ్మిది గంటల ప్రాంతంలో అకస్మాత్తుగా "ఢన్! ఢన్!" మని రెండుసార్లు తుపాకీ ప్రేలడం, కెవ్వున కేక వినిపించడంతో అందరూ ఒక్కసారిగా మేలుకొని భయపడుతూ క్రిందకు చేరుకున్నారు. వాళ్ళు వచ్చిన కాసేపటికే నౌఖరు వీరయ్యకూడా వచ్చాడు. కాని ఆపాటికే ప్రాంతకులు మాయమయ్యారు. పరుపుమీద తుపాకీ దెబ్బతో

చివరి ప్రాణాలతో జయలక్ష్మిదేవి కనిపించింది. అందరూ ఆవిడను చుట్టుముట్టారు. రాజామణి మెల్లగా ఆమెను ఒడిసి పట్టుకొనింది. ఆవిడేదో చెప్పబోయింది. బలవంతంతో నోరు పెకిలించి శూన్యంలోకి చూస్తూ, 'మ...మా' అంటూ ప్రాణాలు విడిచింది.

హత్యాయుధం ఆ యింటిలోనిదే. దివాకర్ శంకర్ గారు ముందు అప్పుడప్పుడు వేటకు వెళుతూండేవారట. వేటకు వెళ్ళినప్పుడల్లా ఆయన దాన్ని ఉపయోగించేవారు. ఆయన గారు పోయినప్పటినుండీ ఆ తుపాకీ హాలులోనే గోడమీద వ్రేలాడుతుండేది. దానితోపాటే మూడు తూటాలు వరుసగా పేర్చిన ఒక చక్కటి బెల్టుకూడా వుంది. హంతకు లెవరో అదే రైఫిల్ను, అవే తూటాలను ఉపయోగించారు. బెల్టులో మూడు తూటాలూ లేవు.

నౌకరు వీరయ్యకు ఆ రైఫిల్ను, బుల్లెట్ బెల్టును రోజూ సాయంత్రం 6 గంటలకు తుడవటం అలవాటు. ఈరోజు కూడా వాటిని శుభ్రపరిచాడట. చివరకు 8 గంటలకు భోజన వేళకూడా అవి యథాప్రకారంగానే వున్నాయని చెప్పాడు. అంటే 8 గంటల తరువాతే ఎవరో దాన్ని చేజిక్కించుకొని జయలక్ష్మిదేవిని హత్యజేసి పారిపోయుండాలి.

అంతా జాగ్రత్తగా విన్నాను.

సిగరెట్ ముట్టించి తీవ్రంగా ఆలోచించాను.

జయలక్ష్మిదేవి చనిపోతూ ఏదో చెప్పబోయి మాట మధ్యలో ఆగిపోయింది. "మ...మా" అంటే ఏమిటి? "మా మనిషే" అని చెప్పడానికి ప్రయత్నించిందా? అయినా యిక్కడున్న వాళ్ళందరూ ఆవిడ మనుషులే కాకపోతే

పరాయివాళ్ళా?

అయితే ఈ మిస్టరీ 'మా' ఎవరు?

ఆ యింట్లో వున్నదల్లా రంగారావ్, రాజామణి, మధుసూధన్, మరి యిద్దరు నౌకర్లు. వంటమనిషి వీరయ్య, తోట మాలి నర్సింగ్ రావ్. హత్యా సమయంలో చివరివాడు ప్రత్యక్షంగా హత్యాస్థలంలో లేడు. నౌకరు వీరయ్య ముసలి వ్యక్తి. పిస్టల్ గురి చూడటమే చేతగాదని ఇన్‌స్పెక్టర్ చెప్పాడు. తన యజమానురాలి చావువల్ల అతనికి ఒరిగేదేమీ లేదు. అనుమానితుల జాబితాలోనుండి అతన్ని నిస్సందేహంగా తీసేయవచ్చు.

మరైతే మిగిలిన ముగ్గురిలో దాగిన 'మ' ఎవరు?

రంగారావ్, రాజామణి, మధుసూధన్...మధు...మ...ధు...!

ఆశ్చర్యపోయాను. జయలక్ష్మీదేవి "మా...మధు" అని చెప్పబోయి ఆగిపోయిందా?

యింతలో మరో విషయం జ్ఞాపకం వచ్చింది. రంగారావ్ ఆ యింటి మానేజర్. జయలక్ష్మీదేవి అతన్ని "రంగారావ్" అని పిలవడం కన్నా "మానేజర్" అని పిలిచే అలవాటు వుండవచ్చు. చనిపోతూ "మా...మానేజర్" అని చెప్పబోయిందా? హంతకుడు మానేజర్ రంగారావేనా?... అలా అయితే మరో అనుమానం. యిందులో రాజామణికూడా హంతకురాలు కావడానికి అవకాశం వుంది. జయలక్ష్మీదేవి "మా...మణి" అని చెప్ప ప్రయత్నించి వుండవచ్చుకదా?

బావుంది! ఆలోచించే కొద్ది "మ" మరీ మిస్టరీని సృష్టిస్తోంది!

"మా మధు" "మా మానేజర్" "మా మణి"...మధు

మానేజర్, మణి.

నేరస్థు లెవరు? ఒక్కొక్కరినీ విడివిడిగా ప్రశ్నిస్తే ఏదైనా బయటు పడవచ్చు.

మొదట్లో రాజామణిని పిలిపించాను.

"క్షమించాలి. ఈ సమయంలో విసిగిస్తున్నందుకు. మీ పిన్నిగారిని ఎవరు చంపి వుంటారో మీ కేమైనా తెలుసా?"

"తెలియదు."

"మీ కెవరి మీదనైనా అనుమానంగా వుందా? మీకు రైఫిల్ ఉపయోగించడం తెలుసా?"

"లేదు... తెలుసు, కాలేజీలో నేను ఒక సంవత్సరం ఎన్.సి.సి. కడెట్‌ని."

"మ" తో ప్రారంభమయ్యే పేర్లలో మీ భర్త పేరు ఒక్కటే. చనిపోతూ మీ పిన్ని "మధు" అని చెప్ప బోయిందేమో" అన్నాను నింపాదిగా.

"లేదు. వారలాంటివారు కాదు. ప్లీజ్!" అంది ఏడ్చేస్తూ.

తరువాత మధుసూధన్‌ను పిలిపించాను.

రాజామణిని అడిగిన ప్రశ్నలే అడిగి,

"మిస్టర్ మధు! నిజం చెప్పండి. జయలక్ష్మీదేవి మీ భార్యను ఎన్నో విధాల బాధించింది. వాళ్ళ నాన్నగారి ఆస్తిని ఆమె కళ్ళముందే హరించింది. కోపం పట్టలేక మీ భార్యే హత్య చేసిందేమో మీ రాలోచించారా?" అన్నాను.

"మిస్టర్ జోక్స్‌బాండ్! అయాంసారీ! లేదు. నేను నమ్మను. నేనే ఎన్నోసార్లు ఆవిడమీద కోపగించి విసుక్కున్నా రాజామణి నాకు సర్ది చెప్పేది. యిలాంటి పని చేస్తుందంటే, ఐ కాంట్ బిలీవిట్" అన్నాడు.

"పోనీ, మా మేనేజర్ ఎలాంటి వాడు?...మీ కేమైనా అనుమానం వుందా?"

"అనుమానాలూ, అవీ నేను చెప్పను ఏ పుట్టలో యే పాముందో." అన్నాడు.

ఆ తరువాత రంగారావ్ వచ్చాడు.

అడగవలసినవి అడిగి, "మీ కెవరి మీదైనా అనుమానం వుందా?" అన్నాను.

"ఎవరినని చెప్పమంటారు? నిజం చెప్పాలంటే ఆవిడను మనఃపూర్వకంగా ప్రేమించిన వారెవరూ లేరిక్కడ... అందరూ అంతే!"

"అంటే ఆవిడను హత్య చేయడానికి మీతో సహా, అందరికీ అవకాశం వుందంటే ఒప్పుకుంటారా?"

మేనేజరు మొదలు బిత్తరపోయినా తమాయించుకొని, "ఆ! తప్పకుండా!" అన్నాడు.

రంగారావ్‌ను పరీక్షగా చూసాను. ఎర్రగా, భారీలో వున్నాడు. అతని మొహంలో ఎలాంటి భావాలు కాకగా పించలేదు. ఆలోచిస్తూ బయటకు వచ్చాను. యింత్కని బయట గుమ్మం నుండి అక్కడున్న పోలీసులను వింతగా చూసుకుంటూ ఎవరో యువకుడు లోనికి ప్రవేశించాడు.

రాజామణి వంక చూసి "యితనెవరు?" అని అడిగాను.

"అతనే, మా తోటమాలి" చెప్పింది.

వాళ్ళ తాతలనాటినుండి ఈ యింటి పట్టునే పడుండి, తోటపని చూసుకుంటున్నారని రంగారావు చెప్పాడు.

ఇన్‌స్పెక్టర్ భక్తవత్సలం, "మీ అమ్మగారి నెవరో హత్యచేశా" రని అతనికి చెప్పాడు.

అతను కొయ్యబారిపోయాడు.

అతన్ని దగ్గరకు పిలిచి "నీ పేరు?" అడిగాను.

"నర్సింగ్ రావ్ అంటారండి" అన్నాడు.

"సాయంత్రం ఎప్పుడు యింటినుండి బయలుదేరావ్?"

"ఆరు గంటలు దాటాయండి."

"మళ్ళీ యిక్కడికి రావటం?"

"ఆc!"

"యింత సేపు బయట ఏం చేస్తున్నట్లు?"

"సినిమాకు వెళ్ళివస్తున్నానండి."

"అమ్మగారిని చంపడానికి హాల్లో ఉండే తుపాకీ ఉప యోగించారు ఎవరో. తూటాలుకూడా అక్కడ వుండే వాటినే వాడారు. ఎవరైనా దాన్ని తియ్యటం నువ్ చూసావా?"

"లేదండి. అమ్మగారిని కాల్చడానికని హంతకుడే రైఫిల్, అక్కడున్న మూడూ తూటాలూ అపహరించి వుంటాడండి."

"నీ కెవరిమీదైనా అనుమానం ఉందా?"

"లేదండీ! ఈ గొడవలన్నీ నాకు తెలియవు. అయినా... మేనేజరు అంత మంచోడు కాదండీ నిన్న అమ్మగారితో ఘర్షణ పడుతూండడం నేను విన్నాను."

"సరే! నువ్వెళ్ళు" అన్నాను.

అందరూ చెప్పిన విషయాలూ నెమరు వేస్తూ అయిదు నిమి షాలు ఆలోచించాను. ఇన్‌స్పెక్టర్ భక్తవత్సలం, జరుగవలసిన యితర పనులు చూసుకుంటున్నాడు.

జయలక్ష్మీదేవి చెప్పడానికి ప్రయత్నించిన ఆ హంతకు లెవరో ఆధారం నా మదిలో తళుక్కున మెరిసింది. "హంత కుడు దొరికాడు" అరిచాను.

అంతా నావంక ఆశ్చర్యంతో తిరిగారు.

* * *

[ఇదీ కేసు. దీనిలో ఇంచుమించు ఎవరికీ జయలక్ష్మి దేవి మీద మంచి అభిప్రాయం లేదు. అవకాశాలు అందరికీ వున్నాయి. హంతకుడెవరో కనుక్కోండి. అతనేనని మీరెలా నిర్ణయించారో సకారణాయుత సమాధానాలు యీ నెల 15వ తేదీలోగా వ్రాసి పంపండి. మీ సమాధానంతో 20 పైసల పోస్టల్ స్టాంపు జతపరచాలి. పోస్టల్ స్టాంపులేని సమాధానాలు పరిశీలించబడవు. ఒకరు ఒక్క సమాధానం మాత్రమే వ్రాసి పంపాలి. అత్యుత్తమ పరిశోధన చేసిన పాఠకుడికి రు. 50/- లు విలువచేసే పుస్తకములు బహుమతిగా పంపుతాము యీ విషయంలో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపబడవు. తుదినిర్ణయం సంపాదకులదే. పోటీ ఫలితాలు వచ్చే సంచికలో చూడండి. —ఎడిటర్.]

పోటీ నెం-1 (ఫలితాలు)

"హల్లో, డియర్ రీడర్స్!

ఫజిల్ కింగ్, రాఘవయ్యగారి హత్యకేసులో హంతకుడెవరో కనుగొన్నారా?

రాఘవయ్య చనిపోతూ ఐరన్ సేఫ్‌లోని ఒక గడియారంలో టైమ్‌ను ఆరు అయిదు అంటే - చిన్నముల్లును ఆరు దగ్గర, పెద్ద ముల్లును ఒకటి దగ్గరకు, రెండో గడియారంలోని టైమ్‌ను ఎనిమిది యిరవై అంటే - చిన్న ముల్లు ఎనిమిది దగ్గర, పెద్దముల్లును నాలుగు దగ్గరకు మార్చాడన్నమాట.

1. 'ఆరు' లో 'ఒకటి' ఏది?......'ఆ'

2. 'ఎనిమిది' లో 'నాలుగు' ఏది?...'ది'

'ఆది' అంటే, తెలిసిందా?- ఆదినారాయణరావు అన్నమాట. రాఘవయ్యగారు, ఆదినారాయణరావును 'ఆది' అని

పిలుస్తారు. యీ 'ఆది' ని 'ఆదినారాయణరావు' అని దృఢం గా చెప్పడానికే చనిపోతూకూడా '8' అంకె వ్రాశారు. 'ఆది నారాయణరావు' లో ఎన్ని అక్షరాలు వున్నాయో గమనించండి. పాకెట్ వాచ్‌ను వెనుకకు నడిపించడంలో రాఘవయ్యగారి ఉద్దేశ్యము కేవలం, యీ గడియాలలో ఏదో రహస్యం దాగి వుందని డిటెక్టివ్‌లకు సూచించడమే.

అసలు ఆదినారాయణ రావుని నేను మొదటే అనుమానించాను. అంత విలువైన వజ్రాలను అమ్మకోగల శక్తి అతడొక్కడికే వుంది. అదీగాక, హత్య విషయం చెప్పగానే ఆది నారాయణరావు నేరుగా శవం వున్న గదిలోకి పరుగెత్తుకు వెళ్ళాడు. ఎవరికి లేని ఆదుర్దా అతని కెందుకు? అప్పుడే నా అనుమానం అతనిపై మరింత దృఢ పడింది.

హంతకుడు దొరికిపోయాడు కదూ! బై! బై!! సెలవు. వచ్చే నెల మళ్ళీ కలుసుకుందాం.

—మి, జోక్స్‌బాండ్.

* * *

[పోటీ నెం_1 కి మాకు వచ్చిన సమాధానాలలో యీ క్రింద పేర్కొన్న పాఠకుడి సమాధానం అత్యుత్తమంగా వున్నట్లు నిర్ణయించాము.

శ్రీ టి. వి. కమలాధరస్వామి,
పోస్టు: ముప్ కాల్,
వయా: కిసాన్ నగర్.
జిల్లా: నిజామాబాదు.

పై విజేతకు యీ నెలాఖరులోగా బహుమతి అందజేయబడుతుంది.

—ఎడిటర్.]

గూఢచారి
002
జి.వి.జి.

వ్యంగ్యరచన

[గూఢచారి 002—ద్వితీయ సాహసం]

'మిషన్ ఎల్' ముగిసి మూడు వారాలయిందో, లేదో—002 ను బాస్ పిలిచాడు.

"002! మన నగరంలోని పిచ్చాసుపత్రిలోకి కొత్తగా చేరే రోగుల సంఖ్య గత వారంలో హఠాత్తుగా పది పన్నెండు రెట్లకు పైగా పెరిగిందట. ఇలా విపరీతమైన పెరుగుదల అకస్మాత్తుగా ఎందుకు సంభవించిందో ఆరా తీయాలని కేంద్ర ప్రభుత్వం నించి ఆదేశం వచ్చింది. ఎవరో దుండగులు ఇలా కొందరికి పిచ్చి పట్టిస్తున్నారని కొందరు సేకరించిన అనధికార భోగట్టాలవల్ల తెలుస్తోంది. ఈ విద్రోహ చర్యల వెనుక రాజకీయ కారణాలుకూడా ఉండొచ్చు. ఆ ద్రోహులను పట్టుకొని, వాళ్ళ ఆటలు కట్టించడమే నీకు నేను అప్పగించే కొత్తబాధ్యత. దీనికి 'మిశన్ మాడ్' అని సంకేతం," అన్నాడు బాస్.

"థాంక్యూ సార్! ఈమారు చాలా ఇంటరెస్టింగ్ కేస్ నాకు అప్పగించబడింది. ఈ మిస్టరీని ఛేదించడంలో నేను ఒకరిద్దరిని చంపవలసి వచ్చినా—అందుకు అనుమతి ఇస్తారా?" 002 ప్రశ్నించాడు.

"నీకీ విషయంలో సలహాలనుగాని, సహకారాలనుగాని ఏజెంట్ 05 ఇస్తుంది. ఒకవేళ ఈ 'మిశన్ మాడ్'లో నీకూ పిచ్చి గనక పట్టితే సత్వరమే నీకు తగిన చికిత్స చేయడానికి ఇక్కడ వేరొక నర్సింగ్ హోమ్‌లో తగిన ఏర్పాట్లు ముందే చేసి ఉంచాం. 05 చాలా చురుకైన యువతి. అందేత నీకు

మరొకరి సహాయం అంతగా అవసరముండదు. అయినా, నీకు సహాయకులు మరెవరైనా కావలసి వచ్చినా ఏర్పాటు చేయగలం."

"ఏజెంట్ ఎక్స్, సార్! 'మిషన్ ఎల్' లో అతను నాకు ఆత్మీయుడయ్యాడు. అతన్ని బొంబాయినించి పిలిపించగలరా?"

"తప్పకుండా. ఈ మిషన్ ముగించడానికి నీకు ఎక్కువ రోజులు అవకాశం లేదు. నీకు పిచ్చిపట్టేలోగా నీ బాధ్యతను నెరవేర్చాలి."

"ఆల్ రైట్, సార్."

"విష్ యూ ది బెస్టు ఆఫ్ లక్, మై బాయ్!"

"మరి నాకు కొన్ని వివరాలు కావాలి!" అన్నాడు 002.

"ఐతే, పక్క గదిలోకి పద," అన్నాడు బాస్.

* * *

ఏజెంట్ 05 ఆకర్షణీయమైన యువతి. అంచేత 002 అత్యుత్సాహంతో రంగంలోకి దూకాడు. బొంబాయినించి ఏజెంట్ ఎక్స్ కూడా విమానంలో చేరుకున్నాడు.

ముగ్గురూ డాక్టర్లు మల్లే శ్వేత సమవస్త్రాలు (యూనిఫామ్‌లు) ధరించి, పిచ్చాసుపత్రిలోకి ప్రవేశించారు. అక్కడున్న వారిలో ఎవరు వైద్యులో, ఎవరు మతిహీనులో గుర్తించడం 002 కు పెద్ద సమస్య అయింది. వీళ్ళు ముగ్గురూ తాము స్పెషలిస్టులమని అక్కడో వున్నత వైద్యునికి పరిచయం చేసుకున్నాక ఒకరిద్దరు రోగులను విచారించడం చూసి విసుక్కున్నాడో బట్టతల డాక్టరు. అంచేత అతన్ని అనుమానించతగ్గ వ్యక్తిగా ఊహించి, ఆ విషయాన్ని రహస్యంగా 05, ఏజెంట్ ఎక్స్‌ల చెవుల్లో చెప్పాడు.

వెంటనే 05 పక్కకు వెళ్ళి, ఒక స్టాఫ్ నర్స్ ద్వారా ఆ బట్ట తల డాక్టరు ఇంటి అడ్రసు తెలుసుకుంది.

ఆ ఆస్పత్రిలో కొత్తగా చేరిన పిచ్చివాళ్ళందరూ నిన్ననో, మొన్ననో హేర్ కట్ చేసుకొని ఉన్నట్లు 002 గుర్తించాడు. వాళ్ళు ముగ్గురూ ఆ ఆస్పత్రిలో వున్న గంటలోనే మరో పదిమంది కొత్త పిచ్చివాళ్ళు అడ్మిట్ అయ్యారు. ఆ రోగులందరూ ఇటీవలే జుట్టు కత్తిరించుకున్నట్లుంది.

ఇంతలో బట్టతల డాక్టరు, వాళ్ళ దగ్గరగా వచ్చి, "మన నగరంలో ఇలాంటి పిచ్చాసుపత్రులు కనీసం ఇంకో అర డజన్ అయినా వుండాలి. ఈ విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తూందో నాకు బోధపడడం లేదు" అని బుర్ర గోక్కుంటూ, ఆ ఆస్పత్రిలోంచి బయటకు నడిచాడు. కాస్సేపాగి, ముగ్గురు ఏజెంట్లూ అతన్ని అనుసరించారు.

ఆ బట్టతల డాక్టర్ కారుని మన ఏజెంట్లు కారు వెంబడించింది. మరో పావుగంటలో ఆ డాక్టర్ తన బంగళాకు చేరుకున్నాడు. దానికి కొంత దూరంలోనే కారును ఆపిన మన ఏజెంట్లు, బంగళా గేటుకు తగిలించబడిన "డాక్టర్ బృహస్పతి, యం.బి.బి.యస్. (యం. ఎ. డి.) అనే బోర్డు. దానికి దిగువ "శ్రీమతి ఛాయా బృహస్పతి, ఆఫ్టర్ షేవ్ లోషన్ ఏజెంట్" అనే బోర్డు చూశారు. ముగ్గురూ కారులోంచి దిగారు.

"ఓహో! ఈ లోషన్‌కు, ఆ మతి చాంచల్యానికి ఏదో సంబంధం ఉండాలి." అంది 05.

"కరెక్ట్! సరిగ్గా ఊహించావు ఈ ఆఫ్టర్ షేవ్ లోషన్‌ను సెలూన్‌లలోని వారుకొని వుపయోగించిన వెంటనే, కష్ట

మన్స మతి కోల్పోతూ ఉండాలి," అన్నాడు 002

"వీళ్ళ ఇంటి ముందు కొందర్ని కాపలా వుండే ఏర్పాట్లు చేయాలి," అన్నాడు ఏజెంట్ ఎక్స్.

"గుడ్ గాడ్! తోటి మానవాళిని మతిభ్రష్టులను చేయాలనే భీకరమైన తలంపు ఈ డాక్టర్ బృహస్పతికి ఎందుకు కలిగిందో కదా?" అని 05 అంటూండగా ఎక్కడ్నించో రివ్వున ఓ సీసావచ్చి ఆమె వీపుకు తగిలి, నేలమీద పడింది.

ఆ సీసా ఏమిటో చూడడానికి వొంగిన ఏజెంట్ ఎక్స్ వీపుకుకూడా ఎక్కడ్నించో మరో సీసా వచ్చి తగిలి, పడిపోయింది.

"ఏజెంట్ ఎక్స్...ఇలా నాతోరా...ఈ సీసాలను ఎవరు విసిరేశారో మనం ఇప్పుడే శోధించాలి." అంటూ 002 కొంత దూరం ముందుకు నడిచాడో లేదో – రాకెట్ వేగంతో ఒక కారు ప్రక్కనున్న షెడ్‌లోంచి దూసుకు వచ్చింది. అందులోంచి ఓ అజానుబాహుడు హఠాత్తుగా బయటకు ఉరికి, 05 ను అమాంతంగా ఎత్తుకొని, ఆ కారులో పరారయ్యాడు.

002, ఏజెంట్ ఎక్స్ వెంటనే వెనుతిరిగి వచ్చి, కారులో కూర్చొని, ఆ దుష్టుని కారును వెంబడించ సాగారు. 002 పిస్టల్‌ను బయటకు తీసి, ఎదుటి కారువంక గురిపెట్టి పేల్చబోగా – ఏజెంట్ ఎక్స్ అడ్డొస్తూ. "ఇది ట్రాఫిక్ రోడ్డు. పొరబాటున తూటా గురి తప్పి మరే కారుకైనా తగిలిందో– మీ తుపాకి లైసెన్సుతోపాటు, కారు డ్రైవింగ్ లైసెన్సును కూడా రద్దు చేసేస్తారు జాగ్రత్త!" అని హెచ్చరించాడు. 002 నిరాశతో పిస్టల్‌ను కోటు జేబులో భద్రపరిచాడు. ఇంతలో ఒక హెలికాప్టర్ రివ్వున వచ్చి, ముందు కారు ప్రక్కగా ఆగడ మేమి, ఆ కారులోంచి అజానుబాహుడు

ఏజెంట్ 05 తో దిగి, ఆ హెలికాప్టర్‌లో ఆమెతో వెళ్ళి పోవడమేమి, క్షణాలలో జరిగి పోయాయి. ఆ వదిలిన కారు దగ్గర 002 తన కారును ఆపాడు. "మన కారును ఇక్కడే రోడ్డు ప్రక్కగా ఆపి, ఆ కారులో వెంబడిద్దాం" అన్నాడు ఇద్దరూ అలాగే ఆ దుష్టుడు వదలివెళ్ళిన కారులో కూర్చొని స్టార్ట్ చేశారు "అన్నట్టు 05 దగ్గర హేర్ పిన్ ట్రాన్స్మిటర్ రిసీవర్ వుందికదూ? నా టైపిన్‌లోని మైక్ ద్వారా 05 ను కాంటాక్టు చేయనా?" అన్నాడు 002.

"ఎలా కాంటాక్టు చేస్తావ్? విరోధుల సమక్షంలో ఆమె ఎలా మనతో మాట్లాడగలదు?" అన్నాడు ఏజెంట్ ఎక్స్.

"ఐతే, ఇలా మనం ఎంతదూరం వెళ్ళడం?" అన్నాడు 002.

"ఇదో - ప్రక్కన ఏదో హోటల్ ఉన్నట్టుంది. అక్కడికెళ్ళి చుక్కెడు కాఫీ గొంతులో పోసుకుంటేగాని, బుర్ర పనిచేసేలా లేదు," అన్నాడు ఏజెంట్ ఎక్స్.

ఇద్దరూ ఆ విరోధి కారును, పేవ్‌మెంట్ ప్రక్కగా ఆపి, ఆ హోటల్ దగ్గరికి వెళ్ళారో, లేదో ఆ కారు బ్రహ్మాండమైన శబ్దంతో పేలిపోయింది.

"అందులో ఆ దుర్మార్గుడు టైమ్‌బాంబ్‌ను ఉంచినట్లుంది. భగవంతుడు మన పాలిట ఉండబట్టి బతికిపోయాం" అన్నాడు 002.

"ఐతే, ఇక్కడ జనం గుమికూడేలోగా మనం వెనుతిరిగి వెళ్ళి, మన కారులో బయలుదేరుదాం," అన్నాడు ఏజెంట్ ఎక్స్.

ఇద్దరూ కాఫీ మాట మరిచి, కాళ్ళీడ్చుకుంటూ నడక సాగించారు.

"అసలా హడావిడిలో డాక్టర్ బృహస్పతి వద్ద మన మీదికి విసిరివేయబడ్డ సీసాలను మనం పరీక్షించలేదు. కాని, అవి ఆఫ్టర్ షేవ్ లోషన్ బాటిల్స్ అయి వుండాలి. ఇప్పటికీ మించిపోయిందేమీ లేదు ముందు వెళ్ళి ఆసీసాలను పరిశీలిద్దామా?" అన్నాడు 002

"భలే వారే! ఆ సీసాలు ఇంకా అక్కడే మనకోసం పడుంటాయా?... ముందు మన 05 ను ఆ శత్రువుల బారినించి రక్షించాలి" అన్నాడు ఎక్స్

ఇంతలో ఇద్దరూ కారు దగ్గరికి చేరుకున్నారు. ఫ్రంట్ సీట్ తలుపులు తెరిచి, చెరో పక్కనించి వచ్చి, కారులో కూర్చున్నారు. అంతే, వెనుక వైపునించి వాళ్ళిద్దరి తలలమీద ఢన్ మని ఎవరో బలంగా బాదారు ఇద్దరూ స్పృహ తప్పి పడిపోయారు

* * *

ఇద్దరికీ స్పృహ వచ్చేసరికి ఒక విశాలమైన హాలులో కుర్చీలకు తమ చేతులు వెనక్కి విరిచి కట్టబడినట్లు గుర్తించారు. ఓమూల ఏవేవో గొట్టాలు, సీసాలు, పెట్టెలు, పరికరాలు ఉన్నాయి. వాటిని చూస్తే, ఆఫ్టర్ షేవ్ లోషన్ తయారు చేసే కార్ఖానా అదే అని 002 కు స్ఫురించింది. ఇంతలో నల్లని యూనిఫామ్‌లో ఉన్న నలుగురు ముసుగు వ్యక్తులు వాళ్ళిద్దరి దగ్గరికి వచ్చి, ఏవేవో ప్రశ్నలడిగారు. వాటికి ఇద్దరూ సరియైన సమాధానాలివ్వలేదు.

"వీళ్ళకు ఎలెక్ట్రిక్ షాక్ ఇవ్వండి" అని ఒక ముసుగు మనిషి అనగానే, తతిమ్మా ముగ్గురూ రెండు ఇనుపటోపీలు తెచ్చి, 002, ఏజెంట్ ఎక్స్‌ల తలలకు తొడిగారో, లేదో - హఠాత్తుగా ఆ హాలులో ఉన్న దీపాలన్నీ ఆరిపోయాయి.

అలా అకస్మాత్తుగా ఆపద తప్పిపోయినందుకు 002 విరగ

బడి నవ్వుతూ, "ఓరి చవట సన్యాసుల్లారా? భగవంతుడు లేడూ? అన్యాయంగా మమ్మల్ని హింసించాలని చూస్తే, విద్యుచ్ఛక్తి ఎలా ఫెయిల్ అయిందో చూడండి!" అన్నాడు.

"నాన్సెన్స్! ఎవరు మీరు? మా విషయాలలో అనవసరంగా ఎందుకు జోక్యం కలిగించుకుంటున్నారు?" ఈ పనికి మిమ్మల్ని ఎవరు నియమించారు?" అని ఆ ముసుగుమనుష్యుల్లో ఎవరో అడిగారు.

"భగవంతుడు నియమించాడు," అని 002 విరగబడి నవ్వుతూ, తన కాలితో ఏజెంట్ ఎక్స్ కాలిని తన్నాడు. దాంతో ఏజెంట్ ఎక్స్ కూడా విరగబడి నవ్వసాగాడు.

"ఎందుకలా నవ్వుతారు? మీరిప్పుడు మా గుప్పిట్లో చిక్కుకున్నారు. తెలుసా?" అంది ఒక గంభీరమైన కంఠం.

"అందుకే నవ్వడం" అంటూ ఎక్స్ ఆదేపనిగా నవ్వసాగాడు.

ఒక బొంగురు కంఠం "సార్, గంట క్రితం వీళ్ళ తలల పైకి లోషన్ సీసాలు విసిరివేయబడ్డాయి. అవి పగిలి, వీళ్ళ తలలకు గాయాలు చేసి, వీళ్ళ రక్తంతో ఆ ద్రావకం కలిసిపోయి ఉండాలి. అందుకే ఇప్పుడు పిచ్చిపట్టి అలా నవ్వుతున్నారు," అంది.

ఇంతలో ఆరిపోయిన దీపాలన్నీ ఒక్కసారిగా వెలిగాయి.

"దీపాలు వెలిగె...పరదాలు తొలగె..." అంటూ 002, ఎక్స్ పాడసాగారు.

దాంతో వాళ్ళిద్దరికీ నిజంగా పిచ్చి పట్టిందని నమ్మి, ఆ ముసుగు మనుషులు - వాళ్ళ కట్లు విప్పేశారు. "భలే - భలే!" అంటూ 002, ఎక్స్ డాన్స్ చేయ నారంభించారు.

ఆ ముసుగు మనుషులు వింతగా చూడసాగారు. ఆ తర్వాత "వీళ్ళిద్దరినీ ఈ హాలులో బంధించి మనం వెళ్ళిపోదాం," అంటూ ఆ నలుగురూ ఆ హాలు తలుపుకు తాళంవేసి బయటకు వెళ్ళిపోయారు.

002 సగర్వంగా ఏజెంట్ ఎక్స్‌తో కరచాలనం చేస్తూ, "మన తెలివితేటలవల్ల పెద్ద గండం గడిచిపోయింది. ఈ దుర్మార్గుల జట్టు వారు లోకంలోని అందర్నీ ఆ లోషన్‌తో పిచ్చివాళ్ళను చేసి, ఈ యావత్ప్రపంచాన్నీ తమ పాదాక్రాంతం చేసుకొని, ఏకఛత్రాధిపత్యం చలాయించాలని పథకం వాబోలు. వీళ్ళకు నాయకుడు పిచ్చాసుపత్రి డాక్టర్ బృహస్పతి. ఈ గుప్తప్రదేశంలో పిచ్చిని ప్రకోపింపజేసే ఆఫ్టర్ షేవ్ లోషన్‌ను భారీ ప్రమాణంలో తయారు చేసి, శ్రీమతి ఛాయా బృహస్పతి పేరున ఉండే ఏజెన్సీ మూలంగా దశదిశలకూ సరఫరా చేస్తున్నారన్న మాట!" అన్నాడు.

"సరేలెండి...ఇప్పుడు మన మిక్కడ్నించి ఎలా బయటపడడం? ఆ సంగతి ఆలోచించాలి" అన్నాడు ఎక్స్.

ఇంతలో 002 పెట్టుకున్న టైపిన్ కిర్‌కిర్ మంది. వెంటనే అతను జేబులోంచి ఒతాణీగింజ ప్రమాణంలో ఉన్న రేడియో రిసీవర్‌ను తీసి చెవిలో ఉంచుకున్నాడు. మరోక్షణంలోనే అతని ముఖం ప్రకాశవంతమైంది. "మన 05 మాట్లాడుతోంది. ఆమె ఇప్పుడు పక్కగదిలోనే బంధించబడి ఉంది. సురక్షితంగానే ఉందట. ఇంకా ఏదో చెబుతోంది." అని ఎక్స్‌తో అంటూ, పది నిమిషాలపాటు చెవులు రిక్కించి విన్నాక, "ఏజెంట్ ఎక్స్! మన 05 భలే ఉపాయం చెప్పింది. అదో– ఆ కొయ్యపెట్టెలలో ఆఫ్టర్ షేవ్‌లోషన్‌లు ఉంటాయి. ఈ మెట్లపైగా వెళ్ళితే, వాటర్‌టాంక్ ఉందట. ఆ జలాశయం నించే ఇక్కడంతా మంచినీరు సరఫరా అవుతుంది. మనం

వెంటనే ఆ జలాశయంలో ఆఫ్టర్ షేవ్ లోషన్లు పోసేసెయ్యాలి. ఇంకో అరగంటలో ఇక్కడున్న కుర్రాళ్ళులందరూ భోజనాలకు కూర్చుంటారట. ఆ ఆఫ్టర్ షేవ్ లోషన్ ద్రావకం కలిసిన నీరు త్రాగగానే వాళ్ళందరికీ పిచ్చి పట్టేస్తుంది" అన్నాడు 002

"భలే ఐడియా. ఐతే పద." అన్నాడు ఎక్స్.

ఇద్దరూ అతి కష్టమీద కొయ్యపెట్టెలలోని ఆఫ్టర్ షేవ్ లోషన్ సీసాలను మెట్లమీదుగా తీసుకెళ్ళి జలాశయంలో ఆ ద్రావకాన్ని కలిపారు. ఓమూల ఒక చిన్న సైజు పీపాలో కూడా అలాంటి ద్రావకమే కనిపించింది. దాన్నికూడా తీసుకెళ్ళి వాటర్ టాంక్‌లో పోశారు. ఇలా అరగంటపాటు కష్టపడ్డాక ఇద్దరూ బాగా అలిసిపోయి, కుర్చీలలో ఉస్సూరుమంటూ కూలబడ్డారు.

002 హైపిన్ మళ్ళీ కిర్ కిర్ మంది. అతను బటాణీగింజ రిసీవర్‌ను చెవిలో వుంచుకొని, "ఏమిటీ? భోజనాలకు ఇంకా స్నేపట్లో కూర్చోబోతున్నారా? అందరికీ టీలుకూడా కలిపి ఇవ్వమని డాక్టర్ బృహస్పతి, బట్లర్‌కు ఆదేశించాడా? భలే – భలే...! నువ్వేక నిశ్చింతగా ఉండు. నువ్వు చెప్పినట్లే వాటర్ టాంక్‌లో ఆ ద్రావకాన్ని బాగా కలిపేశాం. ఇంకో గంటలో ఆ ముఠాలోని వారందరికీ పిచ్చిపట్టక తప్పదు...జాగ్రత్త! ఉంటాం...టా...టా!" అంటూ చిరునవ్వుతో ఏజెంట్ ఎక్స్‌వంక చూశాడు.

"ఇందాక ఆ హోటల్ దగ్గర మనం కాఫీ అయినా పుచ్చుకున్నాం కాదు. ఇప్పుడు నాకు చాలా దాహంగా వుంది" అన్నాడు ఏజెంట్ ఎక్స్ పెదవులు చప్పరిస్తూ.

"కొంపతీసి, ఇక్కడెక్కడైనా కొళాయి నీళ్ళు త్రాగేవు! పిచ్చి పట్టేస్తుంది సుమా!" అని 002 హెచ్చరించాడు.

"ఈపాటికి వాళ్ళు భోజనాలను ఉపక్రమించి వుంటారా?" అన్నాడు ఎక్స్, తన రిస్టువాచ్ వంక చూసుకుంటూ.

"ఏమో," అంటూ 002 కూడా తన రిస్టువాచ్ వంక చూశాడు. అలాగే దానివంకే చూస్తూండిపోయాడు. ఎప్పుడు కునుకు పట్టిందో తనకే తెలీదు. అతన్ని ఏజెంట్ ఎక్స్ తట్టి లేపేసరికి ఓవైపునించి ఎంతోమంది భయంకరంగా పకపక నవ్వుతూ వినిపించింది.

"సందేహం లేదు. వాళ్ళందరికీ పిచ్చి పట్టేసింది" అంటూ ఎక్స్, 002 తో కరచాలనం చేశాడు. బయటనించి పకపక లు వికవికలు హెచ్చుస్థాయిలో వినిపించసాగాయి. కొంతమంది ఇటుఅటు పరుగెత్తుతున్న చప్పుళ్ళుకూడా.

మరో నిమిషంలో ఆ హాలు తలుపు తెరువబడింది. ట్విస్టు డాన్సుచేస్తూ ప్రవేశించిన బట్టతలమనిషే డాక్టర్ బృహస్పతి అని 002, ఎక్స్‌లు ఇట్టే పోల్చుకున్నారు. వాళ్ళిద్దరిని చూసే సరికల్లా డాక్టర్ బృహస్పతి డాన్సు ఆపి, "మీకు పిచ్చి కుదిరింది. వెళ్ళిపోవొచ్చు." అన్నాడు.

002 తల అడ్డంగా తిప్పుతూ, "మేం వెళ్ళిపోము. మాకు పిచ్చి కుదరలేదు. ఇక్కడే ఎంతో హాయిగా ఉంది" అన్నాడు.

"ఏమిట్రా కూశావ్! నేను వైద్యం చేయడమూ - మీకు కుదరకపోవడమూనా! ఇంకో సారి ఆమాటంటే మీ డొక్కలు చీరేస్తాను. జాగ్రత్త! ఇక్కడ బెడ్‌లు ఖాళీగా లేవు. వెంటనే మిమ్మల్ని డిశ్చార్జ్ చేసేస్తున్నాను. వెళ్ళిపొండి," అన్నాడు బృహస్పతి.

"మరి మా అమ్మాయి?" అన్నాడు ఎక్స్ బుర్ర గోక్కుంటూ.

"ఆ అమ్మాయికి మీ కన్నా ముందే పిచ్చి కుదిరింది. ఆమెనుకూడా తీసుకెళ్ళి పోండి – పక్కగదిలో వుంది."

"థాంక్స్... వెళ్ళొస్తాం" అన్నాడు 002.

"వెళ్ళొస్తాం – కాదు; వెళ్తాం – అనండి. ఒక్కసారి నా దగ్గర చికిత్స పొందిన వారు మళ్ళీ నాకు ముఖం చూపించకూడదు. వెళ్ళిపోండి. ఇంతికే. ఎలా వెళ్తారు? ఇదో – నా కారు తాళం చెవులు. నా కారులోనే మీరు ముగ్గురూ వెళ్ళిపోండి." అంటూ డాక్టర్ బహాస్పతి.

బీగాల గుత్తి ఇచ్చాడు.

ఇక 002, ఏజెంట్ ఎక్స్‌ల ఆనందం వర్ణనాతీతం.

* * *

"సెహాభాష్ 002! మొనగాడివనిపించుకున్నావ్! త్వరలోనే మన కేంద్రప్రభుత్వం నీకొక బంగారు పతకాన్ని ఒక ప్రత్యేక సమావేశంలో బహూకరించబోతోంది. ఆ డాక్టర్ బృహస్పతి తాలూకు నల్లసేవలోని పిచ్చివాళ్ళందరికీ మన పిచ్చాసుపత్రి చాలక, దాని ప్రక్కనే మరొక పిచ్చాసుపత్రిని త్వరలోనే కట్టించడానికి ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి... నీకూ, ఏజెంట్ ఎక్స్‌కూ, 05 కూ మా అభినందనలు..." అన్నాడు బాస్.

"సార్! మరి డాక్టర్ బృహస్పతిగారి శ్రీమతి తాలూకు ఏజెన్సీ ఏమైంది?" 002 అడిగాడు.

"ఆమెను బంధించాం. వాళ్ళ గోడౌన్‌లో ఉండే లోషన్ సీసాల స్టాక్ అంతా వశం చేసుకోబడింది. వాటిని పోలీసు రసాయన పరిశోధనాలయంలో పరీక్షించాక, ఆ సీసాలన్నీ నాశనం చేయబడతాయి. మీరిక వెళ్ళి, విశ్రాంతి తీసుకోవచ్చు." అన్నాడు బాస్.

ఏజెంట్ ఎక్స్ తన రిస్టువాచ్ వంక చూసుకొని, "నాకిక టైమ్ అయింది. ఏకాయెకిన ఏరోడ్రోమ్‌కు చేరుకోవాలి. సెలవు" అంటూ అందరివద్దా సెలవు పుచ్చుకొని నిష్క్రమించాడు.

002 మెల్లగా 05 తో గుమ్మంవరకు నడిచి, హఠాత్తుగా ఆగాడు.

ఆమె కూడా ఆగి, అతనివంక ప్రశ్నార్థకంగా చూసింది. "ఇప్పుడు మీరు నా కళ్ళకు ఎలా కన్పిస్తున్నారో తెలుసా? మిమ్మల్ని చూస్తుంటే నాకు పిచ్చెత్తినట్లుంది" అన్నాడు.

"అమ్మ బాబోయ్. ఆ చూపులుకూడా వెర్రిచూపుల్లా ఉన్నాయి. సందేహం లేదు మీకూ పిచ్చిపట్టినట్లుంది..." అంటూ 05 స్పృహ తప్పి పడిపోయింది!

* * *

జైలులో ఇద్దరు ఖైదీలు మాట్లాడుకుంటున్నారు.

మొదటివాడు: మీరు మద్యం పుచ్చుకుంటారా?

రెండవవాడు: లేదండి. ఆ అలవాటే లేదు.

మొదటివాడు: పోనీ జూదం—?

రెండవవాడు: ఛ, ఛ! దానికి మనకు అమడదూరం?

మొదటివాడు: మరి, తమరు ఇక్కడకు ఎందుకొచ్చినట్లు?

రెండవవాడు: మనం ఎప్పుడుచేసే నేరం ఒకటే, అదే అబద్ధాలు చెప్పడం.

—యస్. లక్ష్మణ్‌గుప్త, అలీసాగర్.

క్రైమ్‌లో తమాషాలు

(మొదటి బహుమతి రు. 10/- లు పొందిన రచన)

రంగారావు, రాజారాం, హడావిడిగా స్టేషన్‌కి పరిగెత్తుకు వచ్చారు. శ్రమపడి బొంబాయి వెళ్ళే రైలు కనుక్కొని, అందులో ఎక్కారు. వారు బొంబాయి వెళ్ళటం అదే మొదటిసారి అన్నమాట.

"చూడు, రంగారావ్! ఇక్కడ, బొంబాయిలో మోసం ఎక్కువ. మనం మోసపోగూడదు" అన్నాడు.

దానికి రంగారావ్ "చూద్దుగాని, ఈ రంగారావ్‌ని మోసం చెయ్యటం ఎవ్వరి తరం గాదు" అన్నాడు.

మొత్తానికి బొంబాయి వచ్చారు. వారికి రోడ్డు ప్రక్కన ఓ పెద్ద బిల్డింగ్ కన్పించింది. అది తొమ్మిదంతస్తుల మేడ.

వీళ్ళిద్దరూ ఆశ్చర్యంగా చూస్తూ నిలబడ్డారు. అంతలో రంగారావ్ "నేను ఈ బిల్డింగ్‌కు ఎన్ని అంతస్తులో లెక్క పెడతాను" అని "ఒకటి, రెండు, మూడు...తొమ్మిది" అని లెక్కపెట్టసాగాడు.

రోడ్డుమీద వీళ్ళిలా నిలబడ్డం మూలాన నాలుగువైపులా ట్రాఫిక్ బందు అయింది. కానిస్టేబుల్ వచ్చి, రంగారావ్ కాలర్ పట్టుకుని "ఏం చేస్తున్నారు?" అడిగాడు.

"బిల్డింగ్‌కి ఎన్ని అంతస్తులున్నారో లెక్కపెడుతున్నాం" అన్నాడు.

"ఎన్ని లెక్కపెట్టారు?"

"ఏడు" సమాధానం ఇచ్చాడు రంగారావ్.

"అయితే ఒక్కొక్క అంతస్తుకి రెండు రూపాయల చొప్పున ఏడింటికి పధ్నాల్గు రూపాయలివ్వు" అన్నాడు.

పధ్నాలుగు రూపాయలు చెల్లించారు.

రాజారాం, రంగారావ్‌ని చూసి "చూడు వాడు మనకే టోపీ వేసాడు" అన్నాడు.

రంగారావ్ నవ్వి, "ఆఁ! వాడి బొంద. నేనే వాడికి టోపీ వేశాను. తొమ్మిది లెక్కపెట్టా. ఏడు లెక్కపెట్టానని చెప్పాను." ఓపోజు విసిరాడు రంగారావ్.

బిత్తరబోయాడు రాజారాం.

—వాసిరాజు హనుమంతరావ్, సికింద్రాబాద్.

(రెండవ బహుమతి రు 5/-లు పొందిన రచన)

ఒక అరణ్యం గుండా ఇద్దరు యువతులు ప్రయాణం చేస్తున్నారు. ఆ అరణ్యంలో దొంగలు అమితంగా వుండేవారు. వాళ్ళు తమకు కనబడిన యువతులను అనుభవించకుండా విడిచి పెట్టేవారు కారు.

వాళ్ళకు ఇద్దరు దొంగలు కనపడి దగ్గరకు రాసాగారు. యువతులు పరిస్థితి గ్రహించి, ఒక ప్లాను వేసారు. వాళ్ళు చెరొక దొంగ దగ్గరికెళ్ళి "అన్నయ్యా!" అని పిలిచారు. దొంగలుకూడా వాళ్ళను "చెల్లాయి" అని ఆదరించారు. వాళ్ళిచ్చిన టిఫిన్ తిని దొంగలు బాగా ఆలోచించారు.

ఒక దొంగ మరో దొంగతో ఇలా అన్నాడు. "ఒరేయ్, దుందుభి! నేను నా చెల్లాయిని నీ కిస్తానని మాటిచ్చాను కదరా? నీవుకూడా నీ చెల్లాయిని నా కిస్తానని ఆనాడు

చెప్పలేదూ?" అని అన్నాడు. రెండోవాడు "అవును" అన్నాడు. వాళ్ళు ఆ యువతులను ఒకరికొకరు ఇచ్చివేసుకున్నారు. పాపం! ఆ స్త్రీలు తను ఐడియా బెడిసికొట్టినందుకు చింతించారు.

—పి. చంద్రమౌళి, నల్లగొండ.

ఒక సీక్రెట్ ఏజంట్ ప్రప్రథమంగా అమెరికాకు వెళ్ళాడు. అమెరికాలో అప్పుడు కొన్ని అలజడులు జరుగుతున్నవి. మన సీక్రెట్ ఏజంట్‌గారు ఏదో ఆలోచిస్తూ ఒక ప్రదేశానికి వచ్చారు. అక్కడ అంతా నిర్మానుష్యంగా వుంది. తలకాయ వొంచుకొని ఏదో ఆలోచిస్తూ నడుస్తున్న వాడు కాస్తా సడన్‌గా ఆగిపోయాడు. కారణం? అక్కడ భూమిలో పాతిన ఒక వైరు కనుపించటమే! ఇదేదో బాంబ్ పెట్టిన కేసులా వుందేనని చూస్తే, అది (వైరు) ఒక బంగళాకు సమీపంలో ఆగుంది. వెంటనే మన సీక్రెట్ ఏజంట్‌గారు సమీపంలో ఉన్న పోలీస్ స్టేషనుకు వెళ్ళి ఫలాన ప్రదేశంలో బాంబ్ పెట్టారనీ, తనకు వైరు కనిపించిందనీ చెప్పాడు. వెంటనే ఇన్‌స్పెక్టర్ అక్కడకు వెళ్ళి కొంచెంసేపు పరీక్షించి గట్టిగా నవ్వటం ప్రారంభించాడు.

"మీరెందుకు నవ్వుతున్నారు" అని కోపంతో అడిగాడు సీక్రెట్ ఏజంట్.

దానికి ఇన్‌స్పెక్టర్ "బాబు, ఇది అమెరికా. ఇక్కడ వైరింగ్ అంతా అండర్ గ్రౌండ్ సిస్టమ్ ప్రకారం చేయబడింది. ఇక్కడ పైమట్టి లేకటంవల్ల నీకా వైరు కనబడింది" అని చెప్పాడు.

ఇహ మన సీక్రెట్ ఏజంట్ గారి మొహం చూసి తీరాల్సిందే.

—కె రామారావు, టాపట్లు.

కానిస్టేబుల్ ఏడుకొండలు నైట్ బీటుమీద తిరుగుతున్నాడు. సుందరం పేళ్ళ వీధిలోకి తిరిగి చార్ మినార్ సిగరెట్ వెలిగించాడు.

ఆ వీధంతా నిర్మానుష్యంగా ఉంది కార్పొరేషన్ దీపాలు గ్రుడ్డిగా వెలుగుతున్నాయి. దాదాపు పన్నెండు గంటలయిందేమో; కీచురాళ్ళ రొద తప్ప మరేమీ వినిపించడం లేదా సమయంలో.

ఏడుకొండలు చార్ మినార్ పొగ గట్టిగా పీలుస్తూ ముందుకు నడిచాడు. లాఠీ ఊపుకొంటూ ఓ ప్రహారీగోడ దగ్గరికి వచ్చాడు. ఏవో మాటలు వినిపించి ఆగాడు.

"అయ్యో, ఎట్లాగండీ! మన పీకలమీదకు వచ్చిందే? ఒక్క దెబ్బకే ప్రాణం పోయిందేం?" అందో ఆడకంఠం.

"ఉష్, నెమ్మదిగా మాట్లాడు. ఎవరైనా విన్నారంటే హత్యకేసు బనాయించి ఇద్దర్నీ జైల్లో తోస్తారు" అందో పురుషకంఠం.

"అమ్మో" అంది ఆ స్త్రీ కంఠం భయంగా.

ఓరి వీళ్ళ దుంపతెగా, ఎవర్నో హత్య చేసారన్నమాట. ఇంకా వారి మాటలు విని ఎవర్ని హత్యచేసారో మొదలైన వివరాలు తెలుసుకోదల్చిన ఏడుకొండలు చెవులు రిక్కించాడు.

"అయినా, అంత దెబ్బ ఎందుకు కొట్టారండీ?"

"ఏంచేయమంటావ్ మీద పడితే? నేనెప్పుడు కనిపించినా కక్షు పట్టినట్లు మీదకురుకుతుంటే! విడిపించుకొని నేనుకు చేతిలో కర్రతో బుర్రమీద మోదాను. తప్పలేదు. ఆ ఒక్క దెబ్బకే చచ్చే!" అన్నది పురుషకంఠం.

"అయ్యోయ్యో! నాకు భయమేస్తోంది. ఇంతకీ ఈ శవాన్నేం చేద్దాం?" అడిగిందా స్త్రీకంఠం ఆదుర్దాగా.

"భయపడక, అసలే హిస్టీరియా పేషంటువు. ఇప్పుడు ఇక్కడ మూర్ఛపోయావంటే కొద్దిగా చెడిన నా బుర్ర పూర్తిగా చెడుతుంది. శవాన్నేంచేద్దామంటావా? ఇంట్లోకి వెళ్ళి పారా, పలుగూ తీసుకురా! గప్‌చిప్‌గా గొయ్యి త్రవ్వి పూడ్చేద్దాం" అన్నది పురుషకంఠం.

"ఓరి మిమ్మల్ని పూడ్చా! అన్యాయంగా ఓ నిండు ప్రాణాన్ని హత్యచేసింది చాలక, శవాన్ని పాతిపెట్టి నేరాన్ని కప్పిపుచ్చుకొందామనుకొంటున్నారా? ఈ ఏడుకొండల ముందు మీ కుప్పిగంతులా?" అనుకొన్న యేడుకొండలు స్టేషన్‌కు శరవేగంగా పరిగెత్తాడు.

ఇంట్లో హాయిగా నిద్రిస్తున్న యస్.ఐ. ని లే[...]ంట పెట్టుకు వచ్చేసరికి అరగంట పట్టింది. పోలీస్‌జీప్ పెద్దగా శబ్దంచేస్తూ ఆ యింటిముందాగింది. ఉత్సాహంగా క్రిందికి ఉరికాడు యేడుకొండలు. తీవీగా అడుగులు ముందుకు వేస్తూ ఆ యింటిని సమీపించి తలుపులు తట్టాడు చేతిలాఠీతో.

సుమారు ముప్పై యేళ్ళ యువకుడు తలుపులు తెరిచి ఇన్‌[...]క్ని, పోలీసుల్ని చూసి కంగారు పడ్డాడు. అతని వెనుకే భార్య వచ్చి నిలబడింది. దొరికారు హంతక దంపతులు, [...]డు యేడుకొండలు.

"వీడో మనిషిని హత్యచేసి పాతిపెట్టినందుకు మిమ్మల్ని అరెస్టు చేస్తున్నాం" అన్నాడు యస్.ఐ.

ఆ మాటవిని "ఆఁ" అంటూ విరుచుకు పడిపోయిందా యిల్లాలు.

యేడుకొండలు జేబులోంచి సంకెళ్ళుతీసి ఆ యువకుని దగ్గరకు వచ్చాడు, మనస్సులో జంకుతూ. ఇద్దరు కానిస్టేబుల్స్ చెరోవైపూ పట్టుకొన్నారు. సంకెళ్ళు వేసాడు.

ఎస్. ఐ. టార్చిలైట్ కాంతిలో వెదకడం ప్రారంభించాడు. అప్పుడే పూడ్చివట్టున్న చోటు చూసి అక్కడ త్రవ్వమన్నాడు. కానిస్టేబుల్స్ త్రవ్వనారంభించారు.

"అయ్యా, ఇన్‌స్పెక్టర్ గారూ! నేను..." ఆ యువకుడు యేదో చెప్పబోయాడు. యేడుకొండలు అతన్ని మోచేత్తో పొడిచాడు.

కానిస్టేబుల్స్ త్రవ్వడం పూర్తిచేసారు. వారి చేతులకు [illegible]న శవాన్ని బయటికి తీసారు. యస్.ఐ. టార్చి ఫోకస్ [illegible] శవం మీద.

అది అల్సేషియన్ కుక్క!

అందరూ నిశ్చేష్టులయ్యారా శవాన్ని చూసి. యేడుకొండలు సరేసరి. అతనికి కాళ్ళక్రింద భూమి తిరుగుతోంది.

—తుర్లపాటి నాగేశ్వరరావు, మచిలీపట్నం-1.

Edited & Published by S. DAMODAR RED
3-4-612/2 Narayanguda, Hyderabad-
Printed at I.P.S. printing pres